



తెలుగు జాతీయ దినపత్రిక

# అక్షర విజేత

నిజం నిర్భయం నిష్పక్షం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక






హైదరాబాద్ సంపుటి:05 సంచిక :68 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజీలు : 12, వెల. 6రూ/ శుక్రవారం- 31 -అక్టోబర్- 2025


### ట్రంప్ వ్యాఖ్యలను ఖండించే

# ధైర్యం మోదీకి లేదు

## అదానీ, అంబానీ, ప్రధానిదే భారత్

- నలంద ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న రాహుల్ గాంధీ- ప్రధాని మోదీపై విమర్శల వర్షం
- ప్రధాని మోదీకి లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు.



ఢిల్లీ : భారత్-పాక్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను ఖండించే ధైర్యం ప్రధాని మోదీకి లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. నీతీశ్ కుమార్ పాలనలో బిహార్ పేపర్ లీకేజీలు, పేలవమైన ఆరోగ్య మౌలిక సదుపాయాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. మిగతా..2లో

### వయనాడ్ టూరిజం ప్రమోషన్..

### కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై బీజేపీ విమర్శలు



- కేరళలోని వయనాడ్ పర్యటనపై కర్ణాటక టూరిజం శాఖ పోస్ట్
- ప్రియాంక గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం వయనాడ్
- సీఎం కుర్చీ కాపాడుకునేందుకే ఈ ప్రచారమని సిద్ధరామయ్యపై బీజేపీ విమర్శలు

కర్ణాటక రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పొరుగు రాష్ట్రమైన కేరళలోని వయనాడ్‌ను ప్రమోట్ చేస్తూ పెట్టిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ వయనాడ్ నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న మిగతా..2లో

### చైనాకు ఆ టారిఫ్ నుంచి ఊరట

## జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ట్రంప్ కీలక ప్రకటన

- దక్షిణ కొరియా వేదికగా సమావేశమైన ట్రంప్, జిన్‌పింగ్
- ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20 శాతం సుంకాలను 10 శాతానికి తగ్గిస్తున్నట్లు ట్రంప్ వెల్లడి
- జిన్‌పింగ్‌కు పదికి 12 మార్కులంటూ ప్రశంస

ఢిల్లీ : చైనా అధినేత జీ జిన్‌పింగ్‌తో సమావేశం అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు.




చైనా ఉత్పత్తులపై టారిఫ్‌ను 10 శాతం మేర తగ్గిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అమెరికా, చైనా దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరుదేశాల అధినేతలు దక్షిణ కొరియా వేదికగా సమావేశమయ్యారు. దాదాపు రెండు గంటల పాటు అంతర్గతంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం ట్రంప్ మాట్లాడుతూ, జీ జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయని అన్నారు. ఫెంటనిల్ తయారీలో ఉపయోగించే ముడి ఉత్పత్తుల రవాణాను కట్టడి చేసేందుకు జిన్‌పింగ్ తీవ్రంగా శ్రమిస్తారని విశ్వసిస్తున్నానని అన్నారు. అందుకే ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20 శాతం సుంకాలను 10 శాతానికి తగ్గిస్తున్నట్లు వెల్లడించారు.

### జూబ్లీహిల్స్‌లో ఓడిస్తేనే గ్యారెంటీలు అమలవుతాయి




- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ మరోసారి ట్విట్టర్ దాడి
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రజలకు పిలుపు
- ఉపఎన్నికల కోసమే కాంగ్రెస్ ఆపదమొక్కులు మొక్కుతోందని విమర్శ

### వరంగల్‌ను ముంచెత్తిన తుపాను..

# సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

## మొంథా తుపాను వరంగల్ జిల్లాను ముంచెత్తింది.

- హైడ్రా సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామాగ్రిని కూడా అత్యవసరమైన చోట వినియోగించుకునే చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.
- ఫుడ్ పాకెట్లు సరఫరా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.
- వరంగల్ నగరాన్ని మొంథా తుపాను అతలాకుతలం చేసింది.






హైదరాబాద్, అక్టోబర్ 30: మొంథా తుపాను వరంగల్ జిల్లాను ముంచెత్తింది. భారీ వరదలకు అనేక ప్రాంతాలు నీటమునిగాయి. ఈ క్రమంలో జిల్లాలో వరదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వరంగల్?లో వరద బాధితులకు అందించే సహాయక చర్యలను ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు. వెంటనే అవసరమైనన్ని పడవలను అక్కడికి పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్?డీఆర్?ఎఫ్? సిబ్బందిని తక్షణమే తరలించాలని సీఎస్?, డీజీపీకి ఆదేశాలు జారీ చేశారు.

### కేంద్ర సహకారంతో

## రైతులను ఆదుకుంటాం




- హుస్నాబాద్ నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో ఉందని..
- పూర్తిగా జలమయం అయిందని మంత్రి పొన్నం తెలిపారు. రైతాంగం పూర్తిగా నష్టపోయిందన్నారు.
- వేలాది ఎకరాల్లో ధాన్యం దెబ్బతిన్నదని.. కొట్టుకుపోయిందని అన్నారు.

## గాజాపై మళ్లీ బాంబుల వర్షం.. 104 మంది పాలస్తీనియన్ల మృతి

కాల్పుల విరమణ ఒప్పందాన్ని హమాస్ పదే పదే ఉల్లంఘిస్తోందన్న ఇజ్రాయెల్

హమాస్ కు బుద్ధి చెప్పేందుకే ప్రతి దాడులు చేస్తున్నామని వెల్లడి

ఇజ్రాయెల్ ఆరోపణలను ఖండించిన హమాస్



గాజాలో మరోసారి బాంబుల మోత మోగుతోంది.. ఇజ్రాయెల్ నుంచి బాంబుల వర్షం కురుస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత కొన్ని రోజులుగా నెలకొన్న ప్రశాంతత తాజాగా చెదిరిపోయింది. అయితే ఇందుకు కారణం హమాస్ ఉగ్రవాదులేనని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) ఆరోపిస్తోంది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆదేశాలతో మళ్లీ దాడులు ప్రారంభించింది. తాము కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉన్నప్పటికీ హమాస్ మిగతా..2లో

## పాకిస్థాన్ వ్యోమగామిని గగనతలంలోకి తీసుకెళ్లనున్న చైనా

చైనాకు చెందిన మానవ సహిత అంతరిక్ష కేంద్రం కీలక ప్రకటన

పాకిస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యోమగాములకు శిక్షణ ఇవ్వనున్న చైనా

ఒకరిని పెలోడ్ స్పెషలిస్ట్‌గా స్వల్పకాలిక అంతరిక్ష ప్రయాణ మిషన్‌లో పాల్గొనేందుకు ఎంపిక చేస్తామని వెల్లడి



పాకిస్థాన్ వ్యోమగామిని అంతరిక్షంలోకి పంపేందుకు చైనా సన్నద్ధమవుతోంది. ఈ మేరకు చైనా మానవ సహిత అంతరిక్ష కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. తమ దేశ వ్యోమగాములతో కలిసి పాకిస్థాన్ వ్యోమగామిని అంతరిక్షంలోకి తీసుకు వెళ్ళనున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో, పాకిస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యోమగాములకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొంది. పాకిస్థాన్ అంతరిక్ష కేంద్రం ఎంపిక చేసిన ఇద్దరు వ్యోమగాములు చైనా వ్యోమగాములతో కలిసి శిక్షణ తీసుకుంటారని మిగతా..2లో

### సంగం బ్యారేజీ దగ్గర భారీ బోటు తొలగింపు..

## టీమ్ వర్క్‌పై మంత్రి లోకేష్ ప్రశంసలు..




- మొంథా తుపాన్ కారణంగా పెన్నా నదికి భారీగా వరద నీరు పోటెత్తింది.
- బ్యారేజీకి పెను ప్రమాదం తప్పింది. ఇక, ఈ సంఘటనపై మంత్రి నారా లోకేష్ స్పందించారు.

### అజారుద్దీన్ మన దేశ, రాష్ట్ర కీర్తిపతాకాలను

# రెపరెపలాడించిన వ్యక్తి అన్న భట్టివిక్రమార్క

అలాంటి వ్యక్తిని మంత్రివర్గంలోకి తీసుకోవద్దని లేఖలు రాయడమేమిటని ఆగ్రహం

ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సహకరించేందుకే బీజేపీ లేఖ రాసిందని ఆరోపణ



హైదరాబాద్ బిడ్డ, క్రికెట్ దిగ్గజం అజారుద్దీన్‌కు మంత్రివర్గంలో చోటు దక్కకుండా కుట్రలు జరుగుతున్నాయని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆరోపించారు. మంత్రివర్గ విస్తరణకు అవకాశం ఇవ్వవద్దంటూ బీజేపీ నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేయడాన్ని ఆయన ఖండించారు. అజారుద్దీన్ ఎన్నో విజయాలు అందించారని ఆయన కొనియాడారు. దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన క్రీడాకారుడిని మంత్రివర్గంలోకి తీసుకోవద్దని లేఖలు రాయడం దారుణమని భట్టివిక్రమార్క అన్నారు. దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ పటంలో నిలిపిన ఆయనను మంత్రివర్గంలోకి తీసుకుంటే అందరూ స్వాగతించాలని, కానీ ఆయనను వద్దంటూ లేఖలు రాయడమేమిటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసమే బీజేపీ నేతలు ఈ లేఖ రాశారని ఆయన ఆరోపించారు. గత లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ సహకరించిందని అన్నారు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ గెలవలేదని తెలిసే బలహీన వ్యక్తిని నిలబెట్టిందని, అదే సమయంలో అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోకుండా గవర్నర్‌పై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోందని ఆయన అన్నారు. ఈసీకి బీజేపీ ఫిర్యాదు చేయడంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సైతం స్పందించారు. మైనారిటీలకు మంత్రివర్గంలో అవకాశం ఇస్తే అడ్డుకునేలా బీజేపీ విషం చిమ్ముతోందని ఆయన మండిపడ్డారు. గొప్ప క్రీడాకారుడిని మంత్రివర్గంలోకి తీసుకుంటే అడ్డుకునే ప్రయత్నాలు ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఉప ఎన్నికల వేళ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి ఎలా తీసుకుంటారని బీజేపీ ప్రశ్నించడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు.

### ముందస్తు చర్యలతో

# నష్టం తగ్గింది

ప్రజలకు అలర్ట్ మెసేజ్‌లు కూడా పంపామని..

పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో బాగా నష్టం జరిగిందని డిప్యూటీ సీఎం పవన్ వెల్లడించారు.

ప్రతి జిల్లా కలెక్టర్‌లు, ప్రభుత్వ యంత్రాంగం బాగా పని చేశారని కొనియాడారు.



కృష్ణా జిల్లా, అక్టోబర్ 30: జిల్లాలోని అవనిగడ్డ నియోజకవర్గంలో మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన కొనసాగుతోంది. పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. మొంథా తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పంట నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ముందస్తుగా తీసుకున్న చర్యలతో నష్ట నివారణ కొంత వరకు తగ్గించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపు కారణంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ప్రజలకు ఎలర్ట్ మెసేజ్‌లు కూడా పంపామని.. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో బాగా నష్టం జరిగిందని వెల్లడించారు. అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ప్రభుత్వ యంత్రాంగం బాగా పని చేసిందని కొనియాడారు. మొంథా తుపాను ప్రభావంతో 46 వేల హెక్టార్లలో వరి, 14 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బ తిన్నాయని

మొదటి పేజీ తరువాయి

## చైనాకు ఆ టారిఫ్ నుంచి ఊరట: జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ట్రంప్ కీలక ప్రకటన

అదే సమయంలో అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను చైనా తక్షణమే పునరుద్ధరించేందుకు అంగీకారం కుదిరిందని ట్రంప్ వెల్లడించారు. అరుదైన ఖనిజాలకు సంబంధించిన సమస్య కూడా పరిష్కారమైనట్లు అమెరికా అధ్యక్షుడు తెలిపారు. చైనా నుంచి అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని అన్నారు. ఏడాది పాటు ఎగుమతి చేసేలా ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌పై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్ గొప్ప నేత అని, ఆయనకు పదికి 12 మార్కులు ఇస్తానని అన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం అంశంలో అమెరికాతో కలిసి పని చేసేందుకు చైనా అంగీకరించిందని అన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తాను చైనాలో పర్యటిస్తానని ట్రంప్ తెలిపారు. ఆ తర్వాత వీలు చూసుకుని జిన్‌పింగ్ కూడా వస్తారని అన్నారు.

## జూబ్లీహిల్స్‌లో ఓడిస్తేనే గ్యారెంటీలు అమలవుతాయి

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీని ఓడించడం ద్వారానే, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన వరుస ట్వీట్లు చేశారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ కూడా దక్కకుండా చిత్తుగా ఓడించాలని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. అలాంటి ఓటమి రుచి చూస్తేనే అధికార పార్టీకి భయం పట్టుకుంటుందని, అప్పుడే పెండింగ్‌లో ఉన్న హామీల అమలుపై దృష్టి పెడుతుందని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయి వాస్తవాలు అర్థమవుతున్నాయని ఆయన ఎద్దేవా చేశారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ 'ఆపదమొక్కులు' మొక్కుతోందని కేటీఆర్ విమర్శించారు. పార్టీ పరువు కాపాడుకోవడం కోసమే రకరకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే సినీ కార్మికులకు కొత్త వాగ్దానాలు చేయడం, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోనుండడం, మంత్రులు గతంలో ఎన్నడూ లేనంత హడావుడిగా హైదరాబాద్ వీధుల్లో తిరగడం వంటివి చేస్తున్నారని ఆరోపించారు. ఇవన్నీ కాంగ్రెస్ తీవ్ర ఒత్తిడిలో ఉందనడానికి నిదర్శనమని కేటీఆర్ తెలిపారు. ఈ ఉపఎన్నికలో ప్రజలు కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెబితేనే, రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## గాజాపై మళ్లీ బాంబుల వర్షం.. 104 మంది పాలస్తీనియన్ల మృతి

పదే పదే ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో ప్రతీకార దాడులు చేయక తప్పడం లేదని వివరణ ఇచ్చింది. తాజాగా బుధవారం ఇజ్రాయెల్ సైన్యం జరిపిన బాంబు దాడుల్లో గాజాలో 104 మంది మరణించినట్లు సమాచారం. దక్షిణ గాజాలో ఉన్న తమ బలగాలపై హమాస్ కాల్పులు జరిపినందుకే తాము మళ్ళీ యుద్ధం ప్రారంభించామని నెతన్యాహు తెలిపారు. తమ సైనికుడిని హమాస్ చంపేయడంతో టెర్రర్ గ్రూపులపై దాడులు చేస్తున్నామని చెప్పారు. మంగళవారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ చేస్తున్న బాంబు దాడుల్లో ఇప్పటి వరకు 104 మంది పాలస్తీనా పౌరులు చనిపోగా మరో 250 మందికి గాయాలయ్యాయి. అయితే, నెతన్యాహు ఆరోపణలను హమాస్ ఖండించింది. తమవైపు నుంచి ఎలాంటి కాల్పులు జరగకున్నా స్కూళ్ళు, ఇళ్ళపై ఐడీఎఫ్ బాంబులు వేస్తోందని ఆరోపించింది.

## ముందస్తు చర్యలతో నష్టం తగ్గింది: డిప్యూటీ సీఎం పవన్

వెల్లడించారు. చెట్టు మీద పడి కోయ సుబ్బారావు అనే వ్యక్తి చనిపోవడం బాధాకరమన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు బియ్యం ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. ఇళ్లకు వెళ్లే సమయంలో కూడా ఒక్కో కుటుంబానికి మూడు వేల రూపాయలు ఇస్తున్నామని చెప్పారు. డ్రైన్ల పూడికతీతల ద్వారా నీరు నిల్వ లేకుండా చేశామన్నారు. ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల నేడు నష్టం చాలా వరకు తగ్గిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆక్వా రైతుల ఇబ్బందులు తన దృష్టి కి వచ్చాయని.. సీఎం చంద్రబాబుతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో రోడ్లు పాడైతే యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తామన్నారు. రెండు రోజుల్లో మొత్తం చెత్తను క్లీన్ చేసేలా వేలాది మంది సిబ్బంది పని చేస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## కేంద్ర సహకారంతో రైతులను ఆదుకుంటాం

సిద్దిపేట, అక్టోబర్ 30: సిద్దిపేట జిల్లా కోహెడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు (గురువారం) పర్యటించారు. పోరెడ్డిపల్లి గ్రామంలో భారీ వర్షం కారణంగా జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు. వరదలతో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. పంట నష్టంతో ఆవేదన చెందుతున్న రైతులతో మాట్లాడారు. అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో ఉందని.. పూర్తిగా జలమయం అయిందని తెలిపారు. రైతాంగం పూర్తిగా నష్టపోయిందన్నారు. వేలాది ఎకరాల్లో ధాన్యం దెబ్బతిన్నదని.. కొట్టుకుపోయిందని అన్నారు. వర్షాలకు రోడ్లు మొత్తం దెబ్బతిన్నాయని చెప్పారు. ఇప్పుడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారని.. హుస్నాబాద్‌లో పర్యటించాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశామన్నారు. రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇస్తుందని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయాలకు అతీతంగా రైతాంగాన్ని ఆదుకోవాలని.. ఇక్కడ పర్యటించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారం తీసుకొని బాధ్యతగా రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వరదలు వచ్చినప్పుడు అధికారులు ప్రజల మధ్యే ఉండి నష్టపోయిన పంటలను అంచనా వేయాలని, భారీ వరదలకు జరిగిన నష్టాన్ని మొత్తం రికార్డ్ చేయాలని అధికారులను ఆదేశించామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## పాకిస్థాన్ వ్యోమగామిని గగనతలంలోకి తీసుకెళ్లనున్న చైనా

### చైనాకు చెందిన మానవ సహిత అంతరిక్ష కేంద్రం కీలక ప్రకటన

ప్రతినిధి జాంగ్ జింగ్బో తెలిపారు. వారిలో ఒకరిని పెలోడ్ స్పెషలిస్ట్‌గా స్వల్పకాలిక అంతరిక్ష ప్రయాణ మిషన్‌లో పాల్గొనేందుకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఆ మిషన్ సమయంలో పాక్ వ్యోమగామి శాస్త్రీయ ప్రయోగాలతో పాటు సాంకేతిక ప్రదర్శనలకు సంబంధించి చైనా వ్యోమగాములకు సహాయం అందిస్తారని ఆయన వివరించారు. 2030 నాటికి చంద్రుడిపైకి తమ వ్యోమగామిని దింపేందుకు సిద్ధంగా ఉన్నామని జింగ్బో పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో అగ్రగామిగా ఉండాలనే లక్ష్యంతో ఈ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన వ్యోమగాముల బృందాన్ని త్వరలో ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు.

## వరంగల్‌ను ముంచెత్తిన తుపాను.. సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

హైడ్రా సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామాగ్రిని కూడా అత్యవసరమైన చోట వినియోగించుకునే చర్యలు చేపట్టాలన్నారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని, ఎక్కడైనా వరదలో ఇండ్ల కప్పులు, బంగ్లాలపై చిక్కుకున్న కుటుంబాలకు డ్రోన్ల ద్వారా తాగు నీటితో పాటు?, ఫుడ్ పాకెట్లు సరఫరా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కాగా.. రేపు (శుక్రవారం) వరంగల్ జిల్లాకు వెళ్లనున్న సీఎం... వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. రేపు వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. కాగా.. వరంగల్ నగరాన్ని మొంథా తుపాను అతలాకుతలం చేసింది. భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. అనేక ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వరంగల్ నగరంలోని 30 ముంపు కాలనీలతో పాటు హనుమకొండలోని 15 ముంపు కాలనీవాసులను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు డిజాస్టర్ సిబ్బంది తరలించింది. హనుమకొండలో మూడు పునరావాస కేంద్రాలు, వరంగల్లో 9 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1200 మందిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. గ్రేటర్ పరిధిలో ఏడు ప్రత్యేక బృందాలను వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ ఏర్పాటు చేసింది. ఏడు బృందాల ద్వారా సహాయ చర్యలను సిబ్బంది చేపట్టింది. మరోవైపు భారీ వర్షం నేపథ్యంలో పాఠశాలలకు జిల్లా కలెక్టర్ సెలవు ప్రకటించారు.

## మంత్రులు జూబ్లీహిల్స్‌లో.. వరంగల్ నీళ్లలో: బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డి

భారీ వర్షాలతో వరంగల్ నగరం నీట మునుగుతుంటే ముఖ్యమంత్రి, మంత్రులు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఊరేగడం సరికాదని బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. మంత్రుల జల్సాలకు హెలికాప్టర్లు వస్తాయి గానీ, ప్రజలు ఆపదలో ఉంటే రావా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. హనుమకొండలోని జులైవాడ, అమరావతి నగర్, సమ్మయ్య నగర్, 100 ఫీట్ రోడ్డు తదితర జలమయమైన ప్రాంతాల్లో ఆయన గ్రేటర్ వరంగల్ అధికారులతో కలిసి పర్యటించి, వరద పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ... "మొంథా తుఫాన్ కారణంగా గ్రేటర్ వరంగల్ పరిధిలోని అనేక కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రజల ఇళ్లలోకి నీరు చేరి నిత్యావసరాలు, టీవీలు, బీరువాల వంటి విలువైన వస్తువులు నాశనమయ్యాయి. వృద్ధులు, వికలాంగులు, బాలింతలు రాత్రంతా నీళ్లలోనే గడపాల్సి రావడం దారుణం" అని ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాన్ తీవ్రతను ముందస్తుగా అంచనా వేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని ఆయన ఆరోపించారు. సమ్మయ్య నగర్‌లో పశువులు, గేదెలు వరద ఉధృతికి కొట్టుకుపోవడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. ఆస్తి నష్టంతో పాటు పశుపక్షాదుల ప్రాణ నష్టం కూడా భారీగా ఉండే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని

## తుపాను బీభత్సాన్ని ముందుగానే అంచనా వేశాం
# రూ.5,265 కోట్లు నష్టం: సీఎం చంద్రబాబు




సీఎం వెల్లడించారు. నదుల అనుసంధానం జరిగితే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ తుపాను వల్ల ఎక్కువ నష్టం బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో ఉందని చెప్పారు. 120 పశువులు మృతి: వచ్చే విపత్తును ఆపలేం కానీ ప్రాణ నష్టం జరగకుండా ఎన్ని చర్యలు చేపట్టాలో అన్ని చేపట్టామని సీఎం చంద్రబాబు తెలిపారు. తుపాను వల్ల రాష్ట్రానికి నష్టం వాటిల్లిందని అన్నారు. అలానే దీని వల్ల వ్యవసాయరంగానికి, ఆర్అండ్‌బీకి భారీగా నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇంకా తుపాను వల్ల ఎవరూ చనిపోలేదని కానీ 120 పశువులు మృతి చెందాయని వెల్లడించారు. ఈ తుపాను వల్ల ఆర్అండ్‌బీకి ఎక్కువ నష్టం వాటిల్లిందని కానీ నీటిపారుదల శాఖకు సంబంధించి ఈసారి నష్టం తక్కువేనని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో డ్యామ్‌లు కొట్టుకుపోయాయని సీఎం విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టు గేట్లు పని చేయలేదని ఎక్కడా ఫిర్యాదు లేదని, మా అప్రమత్తత వల్ల నీటిపారుదల శాఖకు నష్టం తక్కువ వాటిల్లిందని అన్నారు.

శాఖల వారీగా నష్టం వివరాలు:

రాష్ట్రవ్యాప్తంగా రూ.5,265 కోట్లు నష్టం (ప్రాథమిక అంచనా)

వ్యవసాయరంగానికి రూ.829 కోట్లు

హార్టికల్చర్‌కు రూ.39 కోట్లు

మత్స్యరంగానికి రూ.1,270 కోట్ల

ఆర్అండ్‌బీకి రూ.2,079 కోట్లు

నీటిపారుదలశాఖకు రూ.207 కోట్లు

సిబ్బందిని కొనియాడిన సీఎం: రాష్ట్రవ్యాప్తంగా సిబ్బంది అందరూ నిబద్ధతతో పని చేశారని ఇది చాలా సంతోషంగా ఉందని సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. వర్షాలు పడుతున్నా కూలిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించి ఇబ్బందులు లేకుండా చేశారని కొనియాడారు. ప్రకృతి విపత్తులను ఎవరూ ఆపలేరు కానీ ముందస్తు చర్యల వల్ల నష్టాన్ని తగ్గించవచ్చని సీఎం అన్నారు. మొంథా తుపాను బీభత్సాన్ని ముందుగానే అంచనా వేయడం వల్లే నష్టనివారణ తగ్గిందని, ఓ పద్ధతి ప్రకారం సాంకేతికతను సక్రమంగా వినియోగించామని తెలిపారు. గతంలో విద్యుత్ సరఫరా ఆగితే 10 గంటల వరకు వచ్చేది కాదు కానీ ప్రస్తుతం విద్యుత్ సరఫరా ఆగిన 3 గంటల్లోనే పునరుద్ధరణ జరిగిందని సీఎం చంద్రబాబు అన్నారు. ఫేక్ పోస్టులపై ఆగ్రహం: ప్రభుత్వం సాంకేతికతను ఉపయోగించి ప్రజలకు నష్టం వాటిల్లకుండా చూస్తుంటే కొందరు ఫేక్ పోస్టులు పెడుతున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయడం కూడా వారికి ఇష్టం లేనట్టు ఉందని విమర్శించారు. శాటిలైట్ ఇమేజ్?ల ఆధారంగా పరిస్థితిని అంచనా వేశామన్నారు. గతంలో గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని మండిపడ్డారు. కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు భరోసా ఇచ్చారని ప్రశంసించారు. వారందరికీ అభినందనలు తెలిపారు.

## ట్రంప్ వ్యాఖ్యలను ఖండించే ధైర్యం మోదీకి లేదు- అదానీ, అంబానీ, ప్రధానిదే భారత్

మొదటి పేజీ తరువాయి



బీహార్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు భూమి లేదని అమిత్ షా అన్న వ్యాఖ్యలపై రాహుల్ మండిపడ్డారు. అదానీ లాంటి వ్యాపారవేత్తలకు రూపాయికే భూమి ఎలా కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు చోరీ ద్వారానే ఎన్?డీఏ అధికారం చేపట్టిందని రాహుల్ మరోసారి ఆరోపించారు. రెండు భారత్?దేశాలు ఉన్నాయని, అందులో ఒకటి అదానీ, అంబానీ, మోదీలదే అని విమర్శించారు. మరొకటి తనది, ప్రజలదేని, ఏమి చేసినా ఉద్యోగాలు రావని పేర్కొన్నారు. గురువారం బిహార్‌లోని నలందలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ ప్రధాని మోదీపై ఈ మేరకు విరుచుకుపడ్డారు. 'ఒక హిందూస్థాన్ అదానీ, అంబానీ, ప్రధాని మోదీలది. రెండో హిందూస్థాన్ మీది (ప్రజలు). రెండో దాంట్లో ఏమి చేసినా మీకు (ప్రజలు) ఉద్యోగాలు రావు. ఎందుకంటే ప్రధాని మోదీ అదానీ, అంబానీల చేత చైనా వస్తువులను విక్రయించాలని చూస్తున్నారు. వాటిని దేశ పౌరులతో పాటు బిహారీలు కొనుగోలు చేసేలా చూస్తున్నారు. ప్రధాని మోదీ ఇక్కడకు (బిహార్) వచ్చి యువతకు ఒక్క మాట చెప్పారు. బీజేపీ మొబైల్ డేటా ఛార్జీలను తగ్గించిందని చెప్పారు. తద్వారా యువత ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో రీల్స్ చేసుకుంటున్నారని చెప్పారు. నేను బిహార్ యువతను ఒక్కటి అడుగుతున్నాను. రీల్స్, ఇన్‌స్టా చూడటం ద్వారా ఏమైనా ప్రయోజనం ఉందా? ఇన్‌స్టా చూస్తే మీ జేబులోకి డబ్బు చేరుతుందా? మీరు ఇన్‌స్టా, ఫేస్‌బుక్ చూస్తే అంబానీ జేబులోకి డబ్బు వెళుతుంది' అని రాహుల్ గాంధీ అన్నారు.

### 'ఇందిరా గాంధీ అంత ధైర్యం మోదీకి లేదు'

ప్రధాని మోదీని భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో పోల్చారు రాహుల్ గాంధీ. 1971 యుద్ధం సమయంలో ఇందిరా గాంధీ అమెరికా ముందు భయపడలేదని తలవంచలేదని, కానీ ప్రధాని మోదీకి ట్రంప్?ను ఎదిరించే సామర్థ్యం లేదని అన్నారు.' 1971 బంగ్లాదేశ్ యుద్ధంలో భారత్?ను బెదిరించడానికి అమెరికా తన విమానాలను, నావికాదళాన్ని పంపింది. ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరా గాంధీ, మీ నావికాదళానికి మేం భయపడం. మీరు చేయాల్సింది చేయండి. మేం చేయాల్సింది మేము చేస్తామని అన్నారు. ఇందిరా గాంధీ ఒక మహిళ. కానీ ఆమెకు ఒక పురుషుడి కంటే ఎక్కువ ధైర్యం ఉంది. నరేంద్ర మోదీ పిరికివారు. ఆయనకు అమెరికా అధ్యక్షుడిని ఎదిరించే సామర్థ్యం లేదు. నేను ఆయనను సవాలు చేస్తున్నా. నరేంద్ర మోదీకి ధైర్యం ఉంటే, బీహార్‌లో జరిగే ఏ సమావేశంలోనైనా , అమెరికా అధ్యక్షుడు అబద్ధం చెబుతున్నారని అని చెప్పాలి. అలాగే ఆపరేషన్ సిందూర్‌ను ఆపలేదని కూడా చెప్పాలి. కానీ ఆయన అలా చేయలేరు. ట్రంప్ ఇప్పటికే 50 సార్లు మోదీని అవమానించారు. కానీ ట్రంప్ అబద్ధం చెబుతున్నారని చెప్పే ధైర్యం మోదీకి లేదు. ట్రంప్‌ను కలిసే ఛాన్స్ మోదీకి వచ్చింది. కానీ, ఆయన భయంతో ఆయనను కలవడం లేదు. ఆయన అజ్ఞాతంలో కూర్చున్నారు. ప్రధానికి అంత ధైర్యం లేదు' అని రాహుల్ గాంధీ విమర్శించారు.

# సంగం బ్యారేజీ దగ్గర భారీ బోటు తొలగింపు..

మొదటి పేజీ తరువాయి

సంగం బ్యారేజీ దగ్గర లంగరు తెగిపోయిన 20 టన్నుల పడవను పక్కకు తీసుకురావటానికి 30 మంది ఎన్డీఆర్ఎఫ్, 30 మంది ఎన్డీఆర్ఎఫ్, 100 మంది దాకా పోలీసు, భద్రతా సిబ్బంది, కృష్ణపట్నం పోర్టు టీమ్, ఫైర్, ఇరిగేషన్ అధికారులు అవిశ్రాంతంగా శ్రమించారు. వీరిపై మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. మొంథా తుపాన్ కారణంగా పెన్నా నదికి భారీగా వరద నీరు పొటెత్తింది. ఈ నేపథ్యంలోనే సంగం బ్యారేజీ దగ్గర ఉన్న 30 టన్నుల భారీ బోటు లంగరు తెగిపోయింది. ఆ బోటు వేగంగా బ్యారేజీ గేట్ల వైపు వెళ్లసాగింది. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు అప్రమత్తం అయ్యారు. పడవను విజయవంతంగా పక్కకు తీసుకువచ్చారు. దీంతో బ్యారేజీకి పెను ప్రమాదం తప్పింది. ఇక, ఈ సంఘటనపై మంత్రి నారా లోకేష్ స్పందించారు. పడవను విజయవంతంగా పక్కకు




తీసుకువచ్చిన వారిపై ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'నెల్లూరు జిల్లా సంగం బ్యారేజీ వద్దకు లంగరు తెగిపోయిన 30 టన్నుల బరువున్న ఇసుక బోటు గేట్ల వరకూ వచ్చింది. బ్యారేజీ నీటి నిల్వకు తోడు మొంథా తుపాన్ వరద పోటెత్తింది. భారీ బోటు బ్యారేజీ గేట్లకు తగిలి ఉంటే భారీ డ్యామేజీ జరిగేది. సమాచారం అందుకున్న నెల్లూరు కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ పరిస్థితిని సమీక్షించి బోటు తొలగింపునకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీసులు, కృష్ణపట్నం పోర్టు గస్తీ బృందం, ఫైర్, ఇరిగేషన్ అధికారుల బృందం అంతా కలిసి 30 టన్నుల బోటును బ్యారేజీకి ఎలాంటి నష్టం కలగకుండా ఒడ్డుకు చేర్చారు. టీం వర్క్‌తో అతిపెద్ద జలగండాన్ని తప్పించిన మీ కృషికి హ్యాట్సాఫ్' అని అన్నారు. కాగా, పడవను పక్కకు తీసుకురావటానికి 30 మంది ఎన్డీఆర్ఎఫ్, 30 మంది ఎన్డీఆర్ఎఫ్, 100 మంది దాకా పోలీసు, భద్రతా సిబ్బంది, కృష్ణపట్నం పోర్టు టీమ్, ఫైర్, ఇరిగేషన్ అధికారులు అవిశ్రాంతంగా శ్రమించారు. పెన్నా నది ప్రవాహానికి ఎదురెళ్లి మరీ పడవను పక్కకు తీసుకువచ్చారు. లేదంటే బ్యారేజీకి పెద్ద ఎత్తున డ్యామేజీ జరిగి ఉండేది. హాలీవుడ్ సినిమాను తలపించేలా ఈ రెస్క్యూ ఆపరేషన్ జరిగింది.

## వయనాడ్ టూరిజం ప్రమోషన్.. కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై బీజేపీ విమర్శలు

మొదటి పేజీ తరువాయి

నేపథ్యంలో, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన కుర్చీని కాపాడుకునేందుకు హైకమాండ్‌ను ప్రసన్నం చేసుకునేందుకే ఈ పని చేస్తున్నారని ప్రతిపక్ష బీజేపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతోంది. వివరాల్లోకి వెళితే... ఈనెల 28న కేఎస్‌టీడీసీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో వయనాడ్ పర్యటనకు సంబంధించి రెండు రాత్రులు, మూడు రోజుల ప్యాకేజీని ప్రకటించింది. "ఉత్సాహం కావాలా? ప్రశాంతత కోరుకుంటున్నారా? రెండూ వయనాడ్‌లో పొందండి! అందమైన ట్రెక్కింగ్, జలపాతాలు, వన్యప్రాణులను కేఎస్‌టీడీసీతో కలిసి ఆస్వాదించండి. ప్రకృతిలో మీ అద్భుతమైన విహారం వేచి ఉంది" అంటూ పోస్ట్ పెట్టింది. ఈ పోస్ట్ వెలువడిన వెంటనే బీజేపీ నేతలు ప్రభుత్వంపై విమర్శల దాడిని ప్రారంభించారు. ఈ వ్యవహారంపై శాసనసభ ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ ఘాటుగా స్పందించారు. "వయనాడ్ జిల్లా కలెక్టర్‌గా, నిధులు సమీకరించే వ్యక్తిగా వ్యవహరించే ముఖ్యమంత్రిని కర్ణాటక ఇంకెంతకాలం భరించాలి?" అని ఆయన ప్రశ్నించారు. "మీరు కర్ణాటక పన్ను చెల్లింపుదారుల సొమ్ము రూ.10 కోట్లను కనీస ఆలోచన లేకుండా వయనాడ్‌కు రాసిచ్చారు. ఏనుగు దాడిలో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి రూ.15 లక్షలు ఇచ్చారు. కొండచరియలు విరిగిపడితే వయనాడ్‌లో 100 ఇళ్లు కట్టిస్తామని ప్రకటించారు. ఇప్పుడు కర్ణాటక పర్యాటక సంస్థతో ప్రియాంక గాంధీ నియోజకవర్గానికి ప్రచారం చేయిస్తున్నారు" అని విమర్శించారు. ఉత్తర కర్ణాటక వరదలతో అతలాకుతలమవుతుంటే, అక్కడి రైతులను గాలికొదిలేశారని అశోక్ మండిపడ్డారు. "12.5 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగింది. కానీ పరిహారం మాత్రం ఫైళ్లు, సర్వేలు, సాకుల్లోనే ఇరుక్కుపోయింది. కలబురగి, రాయచూర్, యాద్గిర్, బీదర్, విజయపుర, బాగల్‌కోట్, బెలగావిలకు వరద సాయం ఎక్కడ? మీ ప్రాధాన్యతలు ఏమిటి?" అని ప్రభుత్వాన్ని నిలదీశారు. "ఇది దాతృత్వం కాదు. తన కుర్చీని కాపాడుకోవడానికి హైకమాండ్‌ను ప్రసన్నం చేసుకోవడమే. మాకు కర్ణాటక ముఖ్యమంత్రి కావాలి కానీ, ఢిల్లీ కీలుబొమ్మ కాదు. వయనాడ్ బ్రాండ్ అంబాసిడర్ వద్దు. నకిలీ గాంధీ కుటుంబానికి మా ఖజానాను ఏటీఎంగా మార్చొద్దు. కర్ణాటకకే మొదటి ప్రాధాన్యత, వయనాడ్‌కు కాదు" అని అశోక్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మరో బీజేపీ నేత సీటీ రవి కూడా స్పందిస్తూ, కర్ణాటక పర్యాటకాన్ని



అభివృద్ధి చేయాల్సిన కేఎస్‌టీడీసీ.. కన్నడిగులను వయనాడ్‌కు ఆహ్వానించడం ఏంటని ప్రశ్నించారు. ప్రియాంక గాంధీని సంతోషపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కన్నడ గౌరవాన్ని తాకట్టు పెడుతోందని ఆయన ఆరోపించారు. ఈ పరిణామం ప్రస్తుతం కర్ణాటక రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## సుంకాలతో వస్త్ర పరిశ్రమ కుదేలు!

డొనాల్డ్ ట్రంప్ సర్కార్ విధించిన సుంకాలు భారతీయ వస్త్ర పరిశ్రమ, ఎగుమతిదారులపై తీవ్రంగా పడింది. తమ ఆదాయం సగానికి పడిపోయినట్టు 34 శాతం వ్యాపార సంస్థలు నివేదించాయి. ఈ మేరకు కాన్ఫెడరేషన్‌ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ (సీఐటీఐ) నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. భారత వస్త్ర ఎగుమతుల కు అతిపెద్ద మార్కెట్ అమెరికా. మన దేశ మొత్తం వస్త్ర ఎగుమతుల్లో అమెరికా వాటా 10.8 బిలియన్ డాలర్లు కావడం గమనార్హం. భారత వస్త్ర ఎగుమతుల్లో ఇది సుమారు 30 శాతం. భారత ఎగుమతులపై ట్రంప్ సర్కార్ 25 శాతం అదనపు సుంకం, 25 శాతం జరిమానా, మొత్తంగా 50 శాతం సుంకం విధించింది. ఇది మన వస్త్ర ఎగుమతులను తీవ్రంగా దెబ్బతీసింది. సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో 60 అగ్ర వస్త్ర ఎగుమతిదారులు, పరిశ్రమల సంఘాలతో మాట్లాడి సీఐటీఐ ఈ నివేదికను విడుదల చేసింది. పోటీని తట్టుకుని నిలబడటానికి 25 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తున్నట్టు 67 శాతం ఎగుమతిదారులు తెలిపారు. ఈ క్రమంలో నష్టాలను భరించాల్సి వస్తున్నదని సీఐటీఐ సెక్రెటరీ జనరల్ చంద్రిమా ఛటర్జీ పేర్కొన్నారు. 'వస్త్ర పరిశ్రమ స్వల్ప మార్జిన్ కలిగిన వ్యాపారం. అయినప్పటికీ, వినియోగదారులను పోగొట్టుకోకుండా ఉండేందుకు చాలా కంపెనీలు డిస్కౌంట్లు ఇస్తూ నష్టాలను భరిస్తున్నాయి. అమెరికాతో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఏదైనా ఉపశమనం కలుగుతుందని వస్త్ర పరిశ్రమలు ఆశిస్తున్నాయి' అని ఛటర్జీ పేర్కొన్నారు. భారతదేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 2.3 శాతం వాటా కలిగిన, 4.5 కోట్ల మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న వస్త్ర పరిశ్రమలు పెట్టుబడుల ప్రవాహం మందగించడం సహా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. దానికితోడు సుంకాల ప్రభావంతో అమ్మకాలు తగ్గిపోయి, ఆదాయాలు పడిపోయినట్టు భారతీయ వ్యాపారులు చెప్తున్నారు. అమెరికన్ల నుంచి డిస్కౌంట్ల కోసం అభ్యర్థనలు (30 శాతం), ఆర్డర్లను రద్దు చేయడం లేదా వాయిదా



వేయడం (25 శాతం), ఆర్డర్ మొత్తంలో కోత (20 శాతం) తదితర కారణాల వల్ల ఆదాయాలు గణనీయంగా పడిపోయినట్టు పేర్కొంటున్నారు. ఆర్డర్ల మందగమనం కారణంగా గోదాంలలో స్టాక్ పేరుకుపోయి 85 శాతం కంటే ఎక్కువ మంది భారతీయ ఎగుమతిదారులు సతమతమవుతున్నారు. గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే 2025 సెప్టెంబర్‌లో వస్త్రాల ఎగుమతులు 10.34 శాతం తగ్గడం ఏ మాత్రం ఆశ్చర్యపరచలేదు. తత్ఫలితంగా చాలా మంది ఎగుమతిదారులు, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలు (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) తీవ్రమైన మూలధన వ్యయం కొరతను ఎదుర్కొంటున్నాయి. అంతేకాదు, మూలధన వ్యయం అవసరాలు 30 శాతానికి పైగా పెరిగినట్టు 40 శాతం మంది ఎగుమతిదారులు నివేదించారు. ఇది వస్త్ర రంగంలో పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడిని నొక్కిచెప్తున్నది. భారతీయ వస్త్రాలపై అమెరికా సుంకాల ప్రభావం దేశవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తున్నది. ఎగుమతిదారులు, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలు ఆర్డర్ల రద్దుతోపాటు పోటీతత్వాన్ని తట్టుకునేందుకు భారీ డిస్కౌంట్లు ఇస్తున్నాయి. వియత్నాం, బంగ్లాదేశ్ వంటి తక్కువ సుంకం ఉన్న దేశాలతో పోటీపడుతున్నందున పెద్ద, చిన్న పరిశ్రమలు కూడా తీవ్ర ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నాయి. అంతా స్థిరపడిన తరుణంలో అకస్మాత్తుగా వచ్చిన మార్పు తమ వ్యాపారాలను నాశనం చేసిందని సూరత్‌కు చెందిన జేపీ కాచివాలా కంపెనీ డైరెక్టర్ ధర్మేష్ కాచివాలా ఆవేదన వ్యక్తం చేశారు. 'మేం పూర్తిగా అమెరికా మార్కెట్‌పై ఆధారపడ్డాం. యూఎస్ వినియోగదారులు కోరినట్టుగా అధిక నాణ్యతతో కూడిన వస్త్రాలను తయారు చేస్తాం. కాబట్టి, మా పెట్టుబడి ఎక్కువగా ఉంటుంది. సుంకాల నేపథ్యంలో దేశీయ మార్కెట్లపై దృష్టిసారించాలని ఇప్పుడు సలహా ఇస్తున్నారు. కానీ, పోటీ తీవ్రంగా ఉంది. అంతేకాదు, దేశీయ మార్కెట్ లాభదాయకం కాదు' అని ఆయన చెప్పారు. దేశంలోని వస్త్ర పరిశ్రమ కుదేలైంది. ఒక్క సూరత్‌లోనే ఉత్పత్తిలో 30-40 శాతం క్షీణత, రూ.7,200 కోట్లకు పైగా ఆదాయం కోల్పోయినట్టు అంచనా. ఈ నేపథ్యంలో కర్మాగారాలు పనిదినాలను తగ్గించుకుంటున్నాయి. డిమాండ్ పడిపోవడంతో వస్త్ర పరిశ్రమలు ప్రమాదంలో పడ్డాయి. పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో దేశీయ మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ ఎక్కువగా ఉంది. కానీ, ఇది మూణ్నాలుగు నెలల్లో తగ్గిపోతుందని కాచివాలా అంచనా వేశారు. 'మేం ఇతర ఎగుమతి మార్కెట్లను అన్వేషిస్తున్నాం. కానీ, కొత్త మార్కెట్లలో పాగా వేసేందుకు కనీసం ఆరు నెలల సమయం పడుతుంది. అమెరికాతో పోలిస్తే యూరోపియన్ మార్కెట్ల పరిమాణం చాలా తక్కువ. గత మూడు నెలలుగా మా పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు' అని ఆయన చెప్పారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ

**సీఎం రేవంత్ సంక్షేమ పథకాలపై ప్రజల విశ్వాసం**

**టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్**



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 50 వేల ఓట్ల మెజార్టీతో గెలవడం ఖాయం అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయని, మహిళలు, యువత పెద్ద ఎత్తున కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఇప్పటికే అమలు చేస్తోందని, అవే ప్రజల విశ్వాసానికి ప్రధాన కారణమని చెప్పారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా బండి రమేష్ గురువారం వెంగళరావు నగర్ డివిజన్ పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్న ఈ ప్రచారంలో ఆయన ప్రజలను కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలంటూ పిలుపునిచ్చారు.

# ఏలివేటెడ్ కారిడార్ పనులతో కంటోన్మెంట్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు





**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** కంటోన్మెంట్ నియోజకవర్గంలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఏలివేటర్ కారిడర్ నిర్మాణ పనులు ప్రారంభము కావడంతో ట్రాఫిక్ మళ్లింపులు తప్పడం లేదు. ఈ మళ్లింపులతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. దారి మళ్లించిన వాహనాలు తాడ్ బండ్ నుంచి డైమండ్ పాయింట్ మీదుగా కే జే ఆర్ గార్డెన్ జేబీఎస్ కు వెళ్లాల్సి వస్తుంది. మళ్లింపుల వివరాలు తెలియకపోవడం తో వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

# ఎలివేటెడ్ కారిడార్ పనులతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆదేశం







**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో జరుగుతున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే శ్రీగణేష్ పరిశీలించి అధికారులు, ట్రాఫిక్ పోలీసులకు కీలక సూచనలు చేశారు. ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి వరకు కొనసాగుతున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కారణంగా ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలు, దారి మళ్లింపుల వివరాలను ఆయన ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ట్రాఫిక్ పోలీస్‌లు, అధికారులు ఇప్పటికే వాహనదారుల సౌకర్యార్థం తాత్కాలిక ఆంక్షలు విధించి, వాహనాలను మళ్లిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అయితే ప్రజలకు అసౌకర్యం కలగకుండా సమయానుకూల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాహనదారులు అభివృద్ధి పనులకు సహకరించాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ రూట్లను వినియోగించుకోవాలని సూచించారు. రెండు రోజుల్లో రహదారి మార్పులు, సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగుపరచి సాఫీ ప్రయాణం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో టీపీసీసీ సెక్రెటరీ రాజేష్ యాదవ్, ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్ రెడ్డి, ఏసీపీ శంకర్ రాజు, హెచ్ఎండీఏ డిప్యూటీ ఇంజనీర్ విద్యాసాగర్, ట్రాఫిక్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

**ఏ ఎస్సై రమణారెడ్డి**



**అక్షర విజేత గజ్వేల్ :** మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జగదేవపూర్ మండల ఏఎస్ఐ రమణ రెడ్డి అన్నారు. గురువారం జగదేవపూర్ మండల కేంద్రంలోని మునిగడప చాట్లపల్లి వాహనాల డ్రైవర్లకు గ్రామ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మద్యం సేవిస్తున్న యువకులకు మద్యం వలన కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రమాదాల నివారణకు మద్యం సేవించకుండా వాహనాలు నడపడం మంచిదని చెప్పారు. ఒక ప్రమాదంతో రెండు కుటుంబాలు ఆర్థిక నష్టాలతో పాటుగా చిన్న భిన్నం అవుతాయని అన్నారు.డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి రూ. 10 వేల జరిమానా విధించడం లేదా ఆరు నెలలు జైలు శిక్ష అమల్లోకి రావడం జరిగిందనీ చెప్పారు.అలాగే ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం కూడా జరుగుతుందని తెలిపారు. మద్యం సేవించి రెండవసారి వాహనం నడుపుతూ పట్టుపడితే రూ. 15 వేల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. జరిమానా డబ్బులు కట్టని వారికి జైలు శిక్ష విధించడం జరుగుతుందనీ తెలిపారు.18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని ప్రజలకు సూచించారు.తల్లితండ్రులు మైనర్లకు చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని ప్రజలకు తెలియజేశారు.పై నిబంధనలు పాటించని వారిపై ఎంపీ చట్టపకారం కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రవి తదితరులు ఉన్నారు.

# డిసిసి అధ్యక్ష పదవి అర్థ సుధాకర్ రెడ్డికే ఇవ్వాలి

**అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు అత్యంత సన్నిహితుడు**

**వికారాబాద్ జిల్లా ఏర్పాటు కోసం కృషిచేసిన నాయకుడు అర్ధ సుధాకర్ రెడ్డి**

**ఎన్ని ఆఫర్లు వచ్చిన పార్టీ మారని నాయకుడు**

**జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని సమర్థవంతంగా నిర్వహించే సత్తా ఉన్న నాయకుడు**

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, 16వ వార్డుకు చెందిన మున్నూరు శ్రీకాంత్**

**అక్షరవిజేత, వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని అర్థ సుధాకర్ రెడ్డికే కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు 16వ వార్డుకు చెందిన మున్నూరు శ్రీకాంత్ అన్నారు. గురువారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 16వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మున్నూరు శ్రీకాంత్ అక్షర విజేత వికారాబాద్ ప్రతినిధితో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎదుగుదల కోసం కృషిచేసిన మహోన్నత వ్యక్తి అర్థ సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీని విడవకుండా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగిన నాయకుడని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని ఆఫర్లు వచ్చినా పార్టీ మారని మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.వికారాబాద్ పట్టణంలో సుధాకర్ రెడ్డి వల్లనే కాంగ్రెస్ పార్టీ క్యాడర్ ఎక్కువగా ఉందని అన్నారు. వికారాబాద్ ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గెలుపు కోసం కృషి చేసిన అర్థ సుధాకర్ రెడ్డికి వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాలని అన్నారు. వికారాబాద్ ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు అత్యంత సన్నిహితుడు అని అన్నారు. డిసిసి అధ్యక్ష పదవిని సమర్థవంతంగా నిర్వహించే సత్తా ఉన్న నాయకుడు అర్థ సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండే నాయకుడని, కాంగ్రెస్ కార్యకర్తకు కష్టం వస్తే అండగా ఉండే నాయకుడు అర్థ సుధాకర్ రెడ్డి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం వికారాబాద్ జిల్లా ఏర్పాటు గురించి కృషిచేసిన నాయకుడని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఎన్నో కేసులను తమ మీద వేసుకొని ఉద్యమాన్ని ముందుకు నడిపించిన నాయకుడని అన్నారు. అలాంటి నాయకునికి కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు 16వ వార్డుకు చెందిన మున్నూరు శ్రీకాంత్ అన్నారు.



# వికారాబాద్ జిల్లాలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

**పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి**

**అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు**

**పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్**






**అక్షరవిజేత, వికారాబాద్ ప్రతినిధి :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని వికారాబాద్ జిల్లాలో విద్యాసంస్థల బంద్ విజయవంతంగా జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ అన్నారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, జిల్లా లో శాంతి యుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులను ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమ అరెస్టులు చేసిన పోలీసులు అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని , తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థులకు దొంగ హామీలు ఇచ్చి గద్దినెక్కారనీ అన్నారు. ఆరు సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రంలో 8150 కోట్ల దాకా స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ పెండింగ్లో ఉందని అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో చదివి విద్యార్థులకు సర్టిఫికెట్స్ తీసుకుందాము అంటే ప్రభుత్వం నుండి డబ్బులు రాలేదని విద్యా సంస్థల యాజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదన్నారు. గత నెల రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు పీజీ కళాశాలలో ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్రంలో బందుకు పిలుపునిస్తే రాష్ట్ర ప్రభుత్వం వారితో చర్చలు జరిపి 1200 కోట్ల రూపాయలను రెండు దఫాలుగా దసరా దీపావళి కి విడుదల చేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా మోసం చేసిందనీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. రాష్ట్రం లో విద్యాశాఖ మంత్రి స్వయంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఉన్న విద్య రంగం పై ఒక్క సారి సమీక్ష లేకుండా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగా సమస్యలపై, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ, జిల్లా నాయకులు రాకేష్ , సిద్దు ,రెహాన్, జునేద్ అఖిల్ , శిర్యాజ్, రాజు ,ఇస్మాయిల్ దీపక్ ,చందు తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన పంటలను ప్రభుత్వమే కొనాలి, రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

**ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్**



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** పంట నష్టం పై ప్రభుత్వం స్పందించకపోవడాన్ని జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల మొ%శీ%థా తుఫాన్ ప్రభువంతో రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో పంటనష్టం జరిగిందని ఆయన తెలిపారు. పంటలు భారీగా దెబ్బతినగా, పశువులు, గొర్రెలు,మేకలు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడ్డాయని వివరించారు. ఇక అనేక చోట్ల రోడ్లు తెగిపోయాయని తెలిపారు. సీఎం, మంత్రులకు పంట,ఆస్థి నష్టం తెలియదాని ప్రశ్నించారు.ఇంత పెద్ద మొత్తంలో నష్టం జరిగినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని ధ్వజమెత్తారు. ఇక మొక్క జొన్న పంట ఆరున్నర లక్షల ఎకరాల్లో సాగు అవుతుంటే, నాలుగు లక్షల ఎకరాల్లో సాగైనా పంట దెబ్బతిన్నదన్నారు. ఎకరాకు 30 క్వి%శీ%టాళ్ల పంట పండుతే, ప్రభుత్వం ఎకరాకు 18 క్వి%శీ%టాళ్ళ మాత్రమే తీసుకుంటామంటోందని అన్నారు. ఇది ఇలా ఉంటే కౌలు రైతుల నుంచి పంట కొనుగోలు చేసేది లేదని చెప్పడం ఏంటో, ఇదేమి పాలసో అర్థం కావడం లేదన్నారు. రైతులు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేయాలని, మక్కలకు క్వి%శీ%టాల్ కు 2400 రూపాయల మద్దతు ధర ఇవ్వాల్సి ఉండగా 1800 కూడా ఇవ్వడం లేదన్నారు.11 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలు కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం 11 వేల టన్నులు కూడా కొనుగోలు చేయలేదన్నారు. ఇక సోయాబీన్ ఒక క్వి%శీ%టాల్ కూడా కొనుగోలు చేయలేదన్నారు. మరోవైపు పత్తి రైతుల భాధలు వర్ణనాతీతం అన్నారు. తేమ శాతం 11 కు తగ్గించడంతో పత్తి కొనుగోలు చేయడం లేదన్నారు.తేమ శాతం 17 ఉన్నా పత్తిని కొనుగోలు చేసేలా సీసీఐని రాష్ట్రప్రభుత్వం ఒప్పించాలని సవాల్ విసిరారు. వరి ధాన్యం కొనుగోలు కోసం నాలుగు వేల కొనుగోలు కేంద్రాలు ఇంకా తెరవలేదని, మిల్లర్లతో ఇంకా కొనుగోలు ఒప్పందాలు జరగలేదన్నారు.టార్పాలిన్లు లేక కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి పోయిందన్నారు. కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు.సీఎం సినిమా వాళ్ళతో చిందులు వేస్తున్నారని ఆరోపించారు. సీఎం ,మంత్రులు అందరూ జూబ్లీ హిల్స్ మీద దృష్టి పెట్టారని,వరద భాధిత ప్రాంతాల్లో పర్యటించకుండా జూబ్లీ హిల్స్ లో రౌడీ లతో కలిసి ఓటర్లను బెదిరిస్తున్నారని విమర్శించారు.ఇక ఓ మంత్రి తన జన్మ దిన వేడుకల్లో బిజీగా ఉన్నారని,ఆ మంత్రి సమ్మక్క సారక్క దేవాలయ అభివృద్ధి పనుల టెండర్ల ను కూడా వదలలేదని దుమ్మె త్తారు. రైతులకు నష్ట పరిహారం చెల్లించకుండా వేరే పనులకు ఈ ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేస్తోందని, బందిపోట్లలా సీఎం మంత్రులు రాష్ట్రం మీద పడి దోచుకుంటున్నారని మండిపడ్డారు.ఇతర పనులు పక్కన పెట్టి వరద భాదితులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తడిసిన అన్ని రకాల పంటలను కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాత మధు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు రామచంద్రు నాయక్ ,పల్లె రవి కుమార్ ,బీ.ఆర్.ఎస్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు తుంగ బాలు తదితరులు పాల్గొన్నారు.

# పేదోడి సొంతింటి కల నిజం చేసిన ఇందిరమ్మ సర్కార్

**జిల్లా కాంగ్రెస్ అగ్రనేతలకు కృతజ్ఞతలు: వడ్డెబోయిన**

**అక్షర విజేత ఖమ్మం:-** పేదల సొంతింటి కల నిజం చేసినందుకు గాను ఇందిరమ్మ ప్రభుత్వం తాజాగా గృహ నిర్మాణంలో మార్పులు చేయడం ఫలితంగా ఇందిరమ్మ గృహ నిర్మాణం పథకంలో తక్కువ స్థలం ఉన్న అత్యంత పేదలకు కూడా సొంతిల్లు నిర్మించుకునేలా వెసులుబాటు కలిగించిన రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు ఖమ్మం జిల్లా ముగ్గురు మంత్రులకు ఎంపీలకు ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ నేత వడ్డెబోయిన నరసింహారావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వడ్డెబోయిన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఖమ్మం నగరంలోని ఇందిరమ్మ ఇండ్ల విషయంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తనయుడు తుమ్మల యుగేందర్కి కొన్ని సమస్యలను వివరించిన వెంటనే ప్రధాన సమస్య రాష్ట్ర ప్రభుత్వం 400 చదరపు మీటర్ల పైన 600 చదరపు మీటర్ల లోపల ఇంటి నిర్మాణం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం మనందరికీ తెలిసిందే. ఇట్టి విషయమై ఖమ్మం నగరంలో ఇందిరమ్మ ఇండ్లకు ప్రభుత్వ నిబంధన అడ్డురావడంతో కొంతమంది నిరుపేదలు స్థలం సరిపోని నిరుపేదలు ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవడానికి సమస్యగా మారిన నేపథ్యంలో అట్టి సమస్యను తుమ్మల యుగంధర్ కి చెప్పటంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి తెలియపరచి ఖమ్మం నగరంలో జీ01 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అనుమతినిచ్చినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేస్తూ 25వ డివిజన్లో అట్టి ఇంటి నిర్మాణం విషయమై లబ్ధిదారులకి ముగ్గు పోసి శంఖుస్థాపన చేసినామని తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దాసరి పూర్ణ, డివిజన్ నాయకులు కందికొండ శ్రీను, కూతురు రమేష్, హౌసింగ్ ఏఈ పూర్ణచంద్రరావు , డివిజన్ ఆఫీసర్ నిరోషా లబ్ధిదారులు ఫర్జానా, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.



# స్కూల్ బస్సులు ప్రైవేట్ బస్సులు తనిఖీ






**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు పోలీస్ శాఖ మోటార్ వాహనాల శాఖ ఆధ్వర్యంలో బోధన్ సిఐ వెంకటనారాయణ స్కూల్ బస్సులు, ప్రైవేట్ బస్సులను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇన్స్యూరెన్స్ వివరాలను పరిశీలించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఈ తనిఖీలు చేపట్టారని అధికారులు తెలిపారు. నియమాలను ఉల్లంఘించిన వాహనాలపై కేసులు నమోదు చేసి, డ్రైవర్లకు హెచ్చరికలు జారీ చేశారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష



**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** మద్యం సేవించి వాహనాలు నడిపిన 15 మందికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జాహాన్ ముగ్గురికి జైలు శిక్ష, 12మందికి జరిమాన విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపిన 15 మందికి గురువారం ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. వీరిలో 12 మందికి రూ.18,500 జరిమానా, ముగ్గురికి రెండురోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

# బకాయిల భారం నుండి విద్యార్థులను ఆదుకోవాలి

### ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం

**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ లు ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు రూ. 8200 కోట్లు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ పేద విద్యార్థులను ఆదుకోవాలని గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో దుకాణాలలో బిక్షాటన నిర్వహించారు. గత 3, 4 సంవత్సరాల నుంచి విద్యార్థులకు అందించాల్సిన ఫీజు రియంబర్స్ మెంట్ స్కాలర్షిప్ బకాయిలు అందించడంలో గతంలో బిఆర్ఎస్ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తూ పేద విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చదువులు పూర్తి అయినా సర్టిఫికెట్లు పొందాలంటే పెండింగ్ బకాయిలు చెల్లించి తమ సర్టిఫికెట్లను తీసుకువెళ్లాలని విద్యార్థులకు ప్రవేట్ ప్రభుత్వ విద్య సంస్థల యాజమాన్యాలు చెప్పడంతో పేద విద్యార్థులు అయ్యోమాయనకి గురవుతున్నారు. పై చదువులు చదవాలంటే చదువులు సాగేదెట్లా ఒకవైపు బి.ఎ.స్ పాఠశాలలో అనుమతించక పోవడంతో ఇప్పటికే ఎస్సీ ఎస్టీ విద్యార్థులు జగిత్యాలలో రోడ్డు ఎక్కిన వైనం ప్రభుత్వానికి కనబడడం లేదా ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది కానీ ప్రభుత్వం ఇప్పటికీ దీనిపై విద్యా సంస్థలకు ఎటువంటి మార్గదర్శకాలు విడుదల చేయకపోవడం వెనక ఆంతర్యం ఏమిటని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కుషాల్ , సుభొద్, సంజయ్, కార్తీక్ పాల్గొన్నారు.



# అజారుద్దీన్ ని ఖచ్చితంగా మంత్రివర్గంలోకి తీసుకుంటాం

### టీపీసీసీ అధ్యక్ష పదవితో సంతృప్తిగా ఉన్నాను
### నేను డిప్యూటీ సీఎం పదవి రేసులో లేను
### విలేకరుల సమావేశంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** టీపీసీసీ అధ్యక్ష పదవితో సంతృప్తిగా ఉన్నానని, తాను డిప్యూటీ సీఎం రేసులో లేనని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆర్ అండ్ బి అతిథి గ%-%హంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేటి క్రీడాకారుడు అజారుద్దీన్ కేబినేట్ లోకి తీసుకోవాలని భావిస్తే బీజేపీ, బిఆర్ఎస్ అడ్డుకోవాలని చూస్తున్నాయన్నారు. కెప్టెన్ గా అజారుద్దీన్ దేశానికి సుదీర్ఘ కాలం సేవలు అందించారని, బీజేపీ, బిఆర్ఎస్ చీకటి ఒప్పందాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. క్రీడా ప్రపంచానికే కాదు ఎంపీగా అజారుద్దీన్ ప్రజలకు సేవలందించారని, అజారుద్దీన్ ను మంత్రి కాకుండా ఎలక్షన్ కమిషన్ కు బీజేపీ నేతలు ఫిర్యాదు చేయడం విచారకరమన్నారు. అనైతికంగా అజారుద్దీన్ మంత్రి కాకుండా బీజేపీ?బీఆర్ఎస్ అడ్డుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. బీజేపీ ద్వంద్వ వైఖరి ప్రజలకు తెలియాల్సి న అవసరముందని,గతంలో బీజేపీ రాజస్థాన్ లో ఉప ఎన్నిక అభ్యర్థి ని మంత్రిని చేశారని గుర్తు చేశారు. గంగానగర్ జిల్లా కరణ్ పూర్ నియోజకవర్గం ఉప ఎన్నిక బీజేపీ అభ్యర్థిగా ఉన్న సురేంద్ర పాల్ సింగ్ ఉపఎన్నికకు 20 రోజుల ముందు సురేంద్ర పాల్ సింగ్ ను మంత్రి వర్గంలోకి తీసుకున్నారని తెలిపారు. ఉప ఎన్నిక అభ్యర్థిని మంత్రిగా చేస్తే తప్పులేనిది? అజారుద్దీన్ మంత్రి చేస్తే తప్పేంటి అని బీజేపీ నేతలను సూటిగా అడుగుతున్నానన్నారు. అజారుద్దీన్ తో ప్రమాణ స్వీకారం చేయించకుండా రాష్ట్ర గవర్నర్ పైన బీజేపీ ఒత్తిడి తీసుకువ స్తోందని, బీజేపీ తో బిఆర్ ఎస్ కుమ్మక్కై ఉందని కేసీఆర్ కూతురు కవిత స్వయంగా చెప్పారన్నారు. మైనార్టీలకు లబ్ది చేకూరుతుందనే ఉద్దేశ్యంతోనే అజారుద్దీన్ ప్రమాణస్వీకారాన్ని బీజేపీ అడ్డుకుంటోందని,గవర్నర్ పై కేంద్రంలోని బీజేపీ ఒత్తిడి తెస్తుందన్న సమాచారం ఉందన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు విజ్ఞులు. కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం ఖాయమన్నారు. అజారుద్దీన్, కోదండరాంను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసి కేబినేట్ గవర్నర్ కి పంపిందని, అక్కడ పెండింగ్ ఉందని కోర్టులో గెలిచితీరుతామన్న నమ్మకముంద న్నారు. అజారుద్దీన్ కేబినేట్ లోకి రావడం ఖాయమని, మంత్రిగా అజారుద్దీన్ మైనార్టీల శ్రేయస్సు కోసం కృషి చేస్తారన్న నమ్మక ముందని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గడుగు గంగాధర్, నగేష్ రెడ్డి, అరికెల నర్సారెడ్డి, జావిద్ అక్రమ్ తదితరులున్నారు.



# అమరులైన పోలీసుల త్యాగాలను కొనియాడిన డిసిపి సునీత రెడ్డి







### పోలీసుల అమరవీరుల వారోత్సవాలలో మెగా రక్తదాన శిబిరం.
### శిబిరంలో 200 మంది రక్తదానం.
### కుటుంబ సమేతంగా రక్తదానం చేసిన ఎసిపి రాజు.

**అక్షర విజేత, ఇబ్రహీంపట్నం :-** పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా భాగంగా రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీస్ అమర వీరుల సంస్మరణ వారం (అక్టోబర్ 21 నుండి అక్టోబర్ 31, 2025 వరకు) సందర్భంగా, విధినిర్వహణలో అసువులుబాసిన పోలీస్ అమర వీరుల త్యాగాలకు నివాళిగా, అలాగే సమాజ సేవకు అంకితమై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో మహేశ్వరం డీ సి పీ సునీత రెడ్డి ఐపిఎస్, అసిస్టెంట్ పోలీస్ కమీషనర్ కెపివి రాజు స్వీయ పర్యవేక్షణలో శ్రీ వైష్ణవి గార్డెన్స్ లో గురువారం భారీ రక్తదాన శిబిరం నిర్వహించ బడింది. ఈ సందర్భంగా డిసిపి సునీత రెడ్డి మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న లడక్ లో జరిగిన ఘటనలో అనేక మంది పోలీసులు అమరులయ్యారని తెలిపారు. కొంతమంది చైనీస్ పోలీసు అధికారులకు చిక్కారని గుర్తు చేశారు. వారి కాల్పుల్లో మృతి చెందారని తెలిపారు. మృతదేహాలను కూడా చైనీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారన్నారు. సుమారు మూడు వారాల తర్వాత ఇరు దేశాల మధ్య జరిగిన అనేక చర్చల అనంతరం మృతదేహాలతో పాటు వారి ఆధీనంలో ఉన్న పోలీసులను విడుదల చేశారని వివరించారు. 1960 అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అంతే కాకుండా విధి నిర్వహణలో అనేకమంది ఆయా సందర్భాలలో పోలీసులు అమరులయ్యారని తెలిపారు. మంచాలలో పని చేసిన ఎస్ఐ సైదయ్య, కానిస్టేబుల్ సాయిలతో పాటు యాచారం పోలీస్ స్టేషన్ పేల్చివేసిన ఘటనలో అమరులైన పోలీసులకు త్యాగాలను కొనియాడారు. అక్టోబర్ 21 పోలీసుల అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని వారి కుటుంబాలను రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో తమ పోలీసులు కలిసి కుటుంబ స్థితిగతులు తెలుసుకోవడం జరుగుతుందని వివరించారు. తమకు తోచిన సహాయాన్ని వారికి అందజేస్తున్నామన్నారు. ఇటీవల నిజామాబాదులో ఓ నిందితుని అరెస్టు చేసి వాహనంపై తీసుకువెళు తున్న క్రమంలో నిందితుడు తన వద్ద ఉన్న కత్తితో కానిస్టేబుల్ ను పొడిచి హత్య చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ కుటుంబానికి ప్రభుత్వ సహకారంతో తమ పోలీసు శాఖకు అండగా నిలుస్తోందని కుటుంబానికి భరోసా ఇచ్చారు. వారి అమరత్వాన్ని కొనియాడుతూ ఈ వారోత్సవాల సందర్భంగా కొవ్వొత్తులు, బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆపదలో ఉన్న అభాగ్యులను ఆదుకునేందుకు గాను రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి తమ వంతు సహకారాన్ని, మద్దతును తెలియజేస్తున్నామని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ పై యువత అప్రమత్తంగా ఉండాలని, ఈ అంశాన్ని తీసుకొని ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించామన్నారు. విధి నిర్వహణలో స్త్రీ, పురుష బేధం చూపించవద్దని తెలియజేస్తూ పోలీసు సిబ్బందికి సైతం వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీలో పాల్గొన్న వారి వివరాలను ప్రత్యేక వెబ్ సైట్ లో పొందుపరిచామని, రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని వివరించారు. ప్రజలకు రక్షణ కల్పించడం కోసం విధి నిర్వహణలో పోలీసులు వెనకడుగు వేయకుండా ముందుకే సాగుతున్నామని తెలిపారు. మహిళలు, యువతులు, విద్యార్థిని విద్యార్థులకు రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. వారిని సన్మార్గంలో నడిపించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ప్రజలతో మమేకమై పోలీసులు చేస్తున్న అనేక కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయని గుర్తు చేశారు. తద్వారా పల్లెల్లో శాంతిని నెలకొల్పడం సాధ్యమవుతుందన్నారు. రక్తదాన శిబిరంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు కుటుంబ సమేతంగా రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు మహేందర్ రెడ్డి, రవికుమార్, నందీశ్వర్ రెడ్డి, మధు ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# తుఫాన్ వల్ల పంట నష్టం జరిగిన రైతన్న కి ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి

### సిపిఎం వైరా మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, డివిజన్ నాయకులు తోట నాగేశ్వరావు డిమాండ్.
### దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించాలి.
### పభుత్వం వెంటనే రైతులకు నష్టపరిహారం అందించాలి.

**అక్షర విజేత వైరా:-** తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు వైరా మండలంలో పరిధిలో పండించిన ప్రతి వరి,మిరప పంటలకు అపార నష్టం జరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం వైరా మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు డివిజన్ నాయకులు తోట నాగేశ్వరావు ప్రభుత్వాన్ని కోరారు.వైరారూరల్ మండల సిపిఎం పార్టీ బృందం మండలంలో వివిధ గ్రామాలను సందర్శించి తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, డివిజన్ నాయకులు తోట నాగేశ్వరరావు మాట్లాడుతూ గత నెల రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు పెసర మినుము ప్రతి పంటలకు నష్టం జరిగిందని అన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా, ఇప్పటికే వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు, తుఫాన్ వల్ల పంటలకు మరింత నష్టం వాటిల్లిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అధిక పెట్టుబడులు పెట్టిన రైతులు పంటలు చేతికొచ్చే సమయానికి తుఫాను వల్ల పంటలు నీటి పాలు అయ్యేసరికి రైతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని అన్నారు. ఇట్టి పరిస్థితుల వల్ల ఓలుకోని స్థితికి నెట్టవేయబడ్డారని ఆవేదన వెలబుచ్చారు. ప్రభుత్వం వెంటనే వ్యవసాయ అధికారులను పంపించి నష్టం జరిగిన పంటలను పరిశీలించి నష్ట పరిహారం రైతులకు అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రైతులను సమీకరించి నష్టపరిహారం కొరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఉద్యమించాల్సి వస్తుందని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించిన బృందంలో వైరా రూరల్ మండల కమిటీ సభ్యులు కిలారు శ్రీనివాసరావు, చిత్తూరు నాగరాజు, చిత్తారు లక్ష్మణ్, రైతు నాయకులు ఆళ్ల శ్రీనివాసరావు, కంచర్ల సురేష్, సాధినేని వెంకటేశ్వరరావు, బి మురళి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపిన శెట్టిరంగారావు



**అక్షర విజేత ఖమ్మం:-** ఆర్ డబ్లు ఎస్ లో డి ఈ గా ఉన్నతమైన బాధ్యతలను నిర్వహించి గురువారం పదవి విరమణ పొందుతున్న తెడ్డు అర్జున్ రావుని శాలవతో ఘనంగా సత్కరించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలియచేసిన జిల్లా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు, డిపార్ట్మెంట్ కు సంబంధించిన ఏఇ లు టి శ్రీనివాస్, వి రాకేష్ మరియు డి చైతన్య తదితరులు.అనంతరం శెట్టి రంగారావు మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలలో అలుపు లేకుండ నిర్వహించిన అర్జునరావు నేటి నుండి ప్రశాంతమైన జీవితం గడపాలని మనస్పూర్తిగా కోరారు.

# పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం

### తిరుమలగిరి ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో కారా?నా పోలీస్‌స్టేషన్‌లో నిర్వహణ





**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం కారా?నా పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా తిరుమలగిరి ఏసీపీ రమేష్ పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ రక్తదాన కార్యక్రమంలో తిరుమలగిరి డివిజన్‌కు చెందిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొని వాలంటీర్లుగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్ మాట్లాడుతూ, రక్తదానం చేయండి, ప్రాణదాతలు కండని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రధానం చేసి, వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కారా?నా ఇన్స్పెక్టర్ అనురాధ, తిరుమలగిరి ఇన్స్పెక్టర్ నాగరాజు, బొల్లారం ఇన్స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉమ్మిద్ అనే పోర్టల్ యాప్ లో వక్ఫ్ ఆస్తులునమోదు చేసుకోవాలి

### ఆలంపల్లి మజీద్ కమిటీ అధ్యక్షులు గులాం కలీముద్దీన్





**అక్షరవిజేత, వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాకు సంబంధించిన వక్ఫ్ భూములు, మజీద్, దర్గాలు స్మశాన వాటికలు, అషుర్ ఖానులు, ఇతర ముస్లిం సమాజానకి సంబంధించిన ప్రతిది ఉమ్మిద్ అనే పోర్టల్ యాప్లో నమోదు చేయాలనీ ఆలంపల్లి మజీద్ కమిటీ అధ్యక్షులు గులాం కలిమోద్దీన్ అన్నారు. గురువారం వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి మజీద్ కు సంబంధించిన కమిటీతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి గ్రామం లొ మస్జీద్ కమిటీలు బాధ్యత తీసుకోని ఇందులో నమోదు చేయాలనీ, వికారాబాద్ లోని జమ మస్జీద్ లొ నవంబర్ 10 నుండి ప్రారంభమవుతాదని ఆయన తెలిపారు. వికారాబాద్ పట్టణంలోని బిట్స్ కంప్యూటర్ వారు ఉచితంగా నమోదు చేస్తారని ఆలంపల్లి మజీద్ కమిటీ అధ్యక్షుడు గులాం కలీముద్దీన్ తెలిపారు. వికారాబాద్ మజీద్ పెద్దలు అందరితో మాట్లాడి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫక్రుద్దీన్, ఆదం, మోసిన్, అలీమ్, ఖలీమ్, ఖురేషి, పాల్గొన్నారు. ఉమ్మిద్ యాప్ లో నమోదు గురించి కావలిసిన పత్రాలు మస్జీద్ భూమి పత్రాలు, కరెంటు బిల్లు, టాక్స్ మ్యాప్ మస్జిద్ కమిటీ అధ్యక్షుడు ఆధార్ కార్డు ఫోటో కావాలని అన్నారు.మరిన్ని వివరాలకొరకు 9440182873, 801968429,8347291981 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

# కేటీఆర్ రోడ్‌షో విజయవంతం చేసేందుకు కసరత్తు

### కంటోన్మెంట్ బీఆర్ఎస్ నేతలు



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** ఉప ఎన్నికల్లో కేటీఆర్ రోడ్డు షో పై చర్చించినట్లు బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్, కంటోన్మెంట్ రెండో వార్డు అధ్యక్షుడు టీఎన్ శ్రీనివాస్ తెలిపారు. రహమత్ నగర్ డివిజన్ ఇన్‌చార్జి ఎంఎల్‌సి రవీందర్ రావు తో కలిసి నవంబర్ ఒకటో తేదీన తలపెట్టిన రోడ్ షోను విజయ వంతం చేసేందుకు కసరత్తు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్, మాజీ కోఆపరేషన్ సభ్యుడు నర్సింహ ముదిరాజ్, పనస సంతోష్,కంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోసం కాంగ్రెస్ ఆపదమొక్కులు..



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో:** జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతే..అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.అధికారం చేపట్టిరెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయి వాస్తవాలు గమనించారని తెలిపారు. దిగజారిన పార్టీ పరువును కాపాడుకోవడానికి అడ్డగోలు ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం సినీ కార్మికులకు అడ్డగోలు వాగ్దానాలు చేయడం, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడం, మంత్రులు గతంలో ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వీధుల్లో హడావుడిగా చేయడం తిరగడం ఆ పార్టీ తీవ్ర ఒత్తిడిలో ఉందనడానికి నిదర్శనమన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ డిపాజిట్‌ను కోల్పోయేలా ప్రజలు ఓటు హక్కుతో సమాధానం చెబితేనే, ఇచ్చిన ఆరు హామీలు, 420 వాగ్దానాలను అమలు చేయడం ప్రారంభిస్తుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ నాయకత్వానికి గుణపాఠం చెప్పడానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సరైన వేదిక కానీ కేటీఆర్ ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు..

# తపస్వి రామారావు మహారాజ్ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి నివాళులు

### త్వరలో బంజారా భవనానికి శంకుస్థాపన
### తెలంగాణ యూనివర్సిటీలో ఎస్సీ హాస్టల్ మంజూరు





**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బంజారా సోదరులతో కలిసి తపస్వి రామారావు మహారాజ్ 5వ వర్ధంతి సందర్భంగా ధర్పల్లి మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి గురువారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. రేకులపల్లి భూపతిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూబంజారా సోదరులందరికీ తపస్వి రామారావు మహారాజ్ ఆశీస్సులు, జగదాంబ మాత కరుణ ఎల్లవేళలా లభించాలని ఆకాంక్షించారు. బంజారాల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు. భూములు, ఇండ్లు, రిజర్వేషన్లు అన్నీ కాంగ్రెస్ హయాంలోనే లభించాయని, బంజారాల అభివృద్ధి కాంగ్రెస్ చేతనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. త్వరలో మంత్రి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జిల్లా బంజారా భవనానికి శంకుస్థాపన చేస్తున్నామన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో ఎస్ టి హాస్టల్ భవనం మంజూరు చేయించామని త్వరలో శంకుస్థాపన చేసి భవనం నిర్మిస్తామన్నారు. మూడు మండలాల్లో బంజారా భవనాల నిర్మాణం త్వరలో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే ధర్పల్లి మండల కేంద్రంలో బంజారా సోదరులు కోరిన కళ్యాణ మండపం నిర్మాణానికి అవసరమైన చర్యలు తక్షణమే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాల్ రాజ్, మిట్టపల్లి గంగారెడ్డి, చెలిమెల నరసయ్య, సురేందర్ గౌడ్, మనోహర్ రెడ్డి, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు బాబు రామ్ నాయక్, మంగిత్య నాయక్, లౌడియ శ్రీనివాస్, రవి, లాల్ సింగ్ అలాగే వివిధ గ్రామాల బంజారా సోదరులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముస్నేరు లోతట్టు ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి






**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**పునరావాస కేంద్రాలలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు.**

**మున్నేరు వరద ప్రవాహాన్ని అంచనా వేస్తూ మరిన్ని ముందస్తు చర్యలు చేపట్టాలి.**

**అత్యవసర సమయాల్లో ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్ లో 1077, 9063211298 టోల్ ఫ్రీ నెంబర్.**

**కాల్వొడ్డు వద్ద మున్నేరు వరద ప్రవాహాన్ని పరిశీలించి, నయాబజార్ స్కూల్ లోని పునరావాస కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.**

**అక్షర విజేత ఖమ్మం:–** మొంథా తుపాన్ ప్రభావం వలన ఎగువ ప్రాంతాల నుండి వచ్చే వరదతో మున్నేరు వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మొంథా తుపానుతో ఎగువ జిల్లాలో మున్నేరు పరీవాహకంలో భారీ వర్షాలు కురవడంతో మూడవ ప్రమాద హెచ్చరికతో 25 అడుగుల మేరకు ఖమ్మం కాల్వొడ్డు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు ప్రవాహాన్ని గురువారం, నగర మేయర్ పునకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మున్నేరు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయించి, ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయించి ధంసలాపురం పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, నయాబజార్ కళాశాలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయించి, పలు కాలనీల ప్రజలను పునరావాస కేంద్రాలకు వాహనాల్లో తరలించినట్లు తెలిపారు. నెమ్మదిగా పెరుగుతున్న మున్నేరు నీటిమట్టం ప్రవాహాన్ని అధికారులు పర్యవేక్షిస్తూ సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మున్నేరు లోతట్టు ప్రాంత ప్రజల సహాయక చర్యలలో భాగంగా నయాబజార్ స్కూల్, నయాబజార్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రజలకు కల్పించిన వసతులు, భోజనం నాణ్యత, హెల్త్ క్యాంప్ ను పరిశీలించారు. స్థానికంగా ఉన్న ప్రజలతో కలెక్టర్ మాట్లాడి సమకూర్చిన సౌకర్యాల పై ఆరాతీసారు. చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని కలెక్టర్ అన్నారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ**

మొంథా తుపాన్ భారీ వర్షాలతో ఎగువ ప్రాంతంలో నుండి ఉధృతంగా వచ్చే వరదతో మున్నేరుకి వరద ముప్పు పెరుగుతుందని, ప్రస్తుతం ఖమ్మం వద్ద మున్నేరు 25 అడుగుల మేర ప్రవహిస్తోందని, అధికార యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉన్నామని, ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. ప్రజలు అనవసరంగా ముంపు ప్రాంతాల్లో తిరగవద్దని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు నీటిమట్టం అంచనా వేస్తూ జాగ్రత్తలు తీసుకోవాలి ఆదేశించారు. వరద పెరిగినందున మున్నేరు నది, బ్రిడ్జిల పైకి ప్రజలు అనవసరంగా రావద్దని, ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతాల ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, ఖమ్మం అర్డీవో నరసింహారావు, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస రెడ్డి, ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ అనిల్ కుమార్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సైదులు, మున్సిపల్, పోలీస్, ఇరిగేషన్ వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## టీజీవో మాజీ అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ మాతృమూర్తి వియోగం



**అక్షర విజేత ఖమ్మం:–** విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ మరియు గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ మాతృమూర్తి స్వాతంత్ర సమరయోధురాలు కస్తాల రామ తులిశమ్మ (95) వారి స్వగ్రామం కొండకోడిమ గ్రామంలో గురువారం తుది శ్వాస విడిచారు. రామ తులిశమ్మ తన జీవితకాలంలో ఎంతోమంది పేదలకు సహాయ సహకారాలు అందిస్తూ, వారి గ్రామంలో పేద విద్యార్థుల చదువులకు ఎంతో సహాయం చేసేవారు. వీరి మృతి పట్ల గ్రామ ప్రజలు, ఉద్యోగ యూనియన్ నాయకులు శ్రద్ధాంజలి ఘటిస్తూ, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దహన సంస్కారాలు శుక్రవారం ఉదయం 10:30 గంటలకు వారి స్వగ్రామం వైరా మండలం, కొండకోడిమ గ్రామంలో నిర్వహిస్తారు.

## విద్యార్థులకు ఆన్ లైన్ లో ఓపెన్ హౌజ్ కార్యక్రమం




**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవములలో భాగంగా ( ఫ్లాగ్ డే సందర్భంగా) నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం అన్నీ స్కూల్ విద్యార్థులకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకు ఆన్ లైన్ ద్వారా ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆన్ లైన్ ఓపెన్ హౌజ్ కార్యాక్రమంలో రిసెప్షన్ కౌంటర్ ఏ విధంగా నిర్వహిస్తారు, సి.సి.టి.ఎన్.ఎస్ పనితీరు, ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదు ఏ విధంగా తీసుకొని వాటి పనితీరు ఏ విధంగా చేస్తారో వివరించారు. అలాగే ఎఫ్.ఐ.ఆర్ నమోదు ఏ విధంగా చేస్తారో వాటి కాపీ ఏ విధంగా పొందాలో, డయల్ 100 పనితీరు, పెట్రోకార్ పనితీరు, నేరస్తున్ని పట్టుకున్న తరువాత అతని పూర్తి సమాచారం సేకరణ అట్టి సమాచారం ఏ విధంగా భద్రపరుచాలో తెలియజేశారు. పోలీస్ స్టేషన్ రికార్డులు నిర్వాహణ, హనాల తనిఖీలు ఏ విధంగా చేస్తారు, పోలీస్ స్టేషన్ సిబ్బంది విధులు, కమ్యూనికేషన్స్ విభాగాల గూర్చి క్షుణ్ణంగా వివరించారు.

## కాంగ్రెస్ అభ్యర్థి పై ఎన్నికల కమిషన్ కు బీ ఆర్ ఎస్ నేతల ఫిర్యాదు



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** ఎన్నికల నియమావళి ని ఉల్లంఘించిన జూబ్లీ హిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి బిఆర్ఎస్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. వారం రోజుల్లో బీఆర్ఎస్ కేడర్ లేకుండా చేస్తాని నవీన్ యాదవ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి ఈసీ చర్యలు తీసుకోవాలని లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంగా రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన ఎన్నికల్లో అధికార పార్టీకి సంబంధించిన అభ్యర్థి బెదిరింపు ధోరణి తో వ్యవహరిస్తున్నారని వివరించారు. నవీన్ యాదవ్ ను పోటీ నుంచి తప్పించాలని కోరారు. ఎన్నికల కమిషన్ అందుకు సానుకూలంగా స్పందించినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. ఎన్నికల కమిషన్ పై తమకు విశ్వాసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పల్లె రవికుమార్, కె .కిషోర్ గౌడ్ ,రామచంద్రు నాయక్ ,ఉపేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లు ఫ్లెక్సీలతో వాహనదారులకు అవగాహన




**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** ద్విచక్ర వాహనాలు నడిపిస్తున్న మైనర్లకు కోర్టు శిక్ష విధించింది. వాహనాలు నడుపుతున్న 9 మంది మైనర్లకు ట్రాఫిక్ పోలీసులు పట్టుకుని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. వీరికి మేజిస్ట్రేట్ నగరంలో ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తూ ఫ్లెక్సీ లు ప్రదర్శించాలని ఆదేశించారు. దీంతో గురువారం ఉదయం చౌరస్తాలలో ట్రాఫిక్ పై అవగాహన కల్పించే ఫ్లెక్సీలను పట్టుకుని వాహనదారులకు అవగాహన కల్పించారు. నగరంలోని సాయిరెడ్డి సిగ్నల్, పూలంగ్ చౌరస్తా, కంఠేశ్వర్, గవర్నమెంట్ హాస్పిటల్, కోర్టు చౌరస్తాలలో మైనర్లు ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తూ ఫ్లెక్సీలలో పట్టుకుని ప్రదర్శించారు.

## కోటగుళ్ల శిల్ప సంపద అద్భుతం

**భూపాలపల్లి ఆర్డీవో రవి**




**అక్షర,విజేత, గణపురం :** గణపురం మండలం కాకతీయులు నిర్మించిన కోట గుళ్ళు శిల్ప సంపద ఎంతో అద్భుతమని భూపాలపల్లి ఆర్డీవో రవి అన్నారు. కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆర్డిఓ ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిసారి ఆలయాన్ని సందర్శించడం జరిగిందని కోటగుళ్ళు ఆలయం రామప్పను పోలిన విధంగా ఉందన్నారు. మరోసారి ఆలయాన్ని సందర్శిస్తానని ఈ సందర్భంగా అన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నాగరాజు ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గణపురం తహసిల్దార్ మధురకవి సత్యనారాయణ స్వామి తదితరులు న్నారు.

## భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్ష పదవికి రాజీనామా

**అక్షర విజేత, గణపురం :** గణపురం మండలంలో స్థానిక నాయకుల నుంచి మొదలుకొని జిల్లా కార్యదర్శి వరకు అడుగు అడుగున నాకు అడ్డం వస్తున్నారు అని ఎన్నిసార్లు జిల్లా పార్టీ అదిష్టణానికి మోర పెట్టుకున్న లాభం లేకుండ పోయింది నేను ఇప్పటి వరకు మండల పార్టీ అభివృధి కోసం 10 నెలల కాలంలో 400000 రూపాయలు ఖర్చు చేసిన ఐనా కనీస గుర్తింపు జిల్లా పార్టీ నుండీ లేదు స్థానిక మండల నాయకులు నన్ను ఎపుడెప్పుడు బయటికి నేడుదాం అని చూస్తున్నారు అని జిల్లా పార్టీ కీ మోర పెట్టుకున్న పట్టించుకున్న పాపాన పోలేదు మండల జిల్లా కార్యదర్శి మరియు మండలం కేంద్రం లోని కొందరు గల్లీ లీడర్లు అడుగుడుగునా నా ప్రతిష్టను దిగజారుస్తున్నారూ అని చెప్పుకున్న జిల్లా అధిష్టానం పట్టించుకున్న పాపన పోలేదు కాబట్టి నా మండల అధ్యక్ష పదవికి మాత్రమే రాజీనామా చేస్తున్న నా ఒంట్లో ఊపిరి ఉన్నంత వరకు నేను భారతీయ జనతా పార్టీ కోసమే ఒక సామాన్య కార్యకర్త గా ఉంటాను అని విన్నవించుకుంటూ మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్న

## చేతికందే సమయంలో నోటికాడి బువ్వను తుఫాను బుడిదలో కలిపేసింది



**అక్షర విజేత గజ్వేల్ :** ఆరుగాలం చేసిన కష్టం నీటిపాలు అయింది.ప్రకృతి పగ పట్టడంతో పట్టెడన్నం అన్నదాతకు కరువు అయ్యే కాలమొచ్చింది. చేతికందే సమయంలో నోటికాడి బువ్వను మొంథా తుఫాను బుడిదలో కలిపేసింది.పంటకు చేసిన పెట్టుబడి కూడా రాని పరిస్థితులు ఏర్పడ్డాయి.మొంథా తుఫాను అన్నదాతలను నిలువునా ముంచేసింది.సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన బీడ శ్రీను రైతు ఆవేదన వ్యక్తం చేశారు.ఆరుకాలం పండించిన పంట చేతికి అందిన సమయానికి నీళ్ల పాలు అవ్వడంతో రోదిస్తు చెప్పారు.అకాల వర్షానికి తన పండించిన ఒక ఎకరాల్లో పంట నీళ్ల పాలు అవ్వడంతో గుండెలు పగిలేలా రోదించారు. పంట మునిగిపోవడం వల్ల రైతుకి తీవ్ర నష్టం జరిగిందని వాపోయాడు.ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని లేదంటే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన చెందాడు. పంట నష్ట పోయిన రైతులను నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వనిరైతులు కోరారు.

## బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో భారీ రక్తదాన శిబిరం



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గురువారం బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బేగంపేట్ ఏసీపీ గోపాల కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ, ప్రజలు రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా నిలుస్తారు. థలసేమియాతో బాధపడుతున్న రోగులకు ఈ రక్తం ఎంతో ప్రాణాధారంగా ఉంటుందని తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంలో సిటీ కమిషనర్ వి.సి సజ్జనార్, నార్త్ జోన్ డిసిపి సాధన రష్మీ పెరుమాళ్ పిలుపు మేరకు బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సుమారు 100 మందికి పైగా యువత రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయడంలో ఇన్స్పెక్టర్ తిరుపతి రాజు, డిఐ. ఆనంద్ కుమార్, ఎస్ఐలు శివశంకర్, అవినాష్ మరియు సిబ్బంది విశేష కృషి చేశారని ఆయన అభినందించారు. రక్తదానంలో పాల్గొన్న దాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, లడ్డు, దయానంద్, అశోక్, రితీష్ తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ సహాయక చర్యలలో ఆపద మిత్రలు కీలకపాత్ర

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**






**అక్షర విజేత ఖమ్మం :** మొంథా తుఫాన్ సహాయక చర్యలలో ఆపద మిత్రలు కీలకపాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.విపత్కర సమయంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలలో చురుగ్గా పాల్గొనేందుకు ప్రతి మండలానికి కొంత మంది ఆపద మిత్రలను ఎంపిక చేసి వారికి అవసరమైన శిక్షణ గతంలో అందించామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 300 మంది యువతకు ఆపదమిత్ర లుగా ఎంపిక చేసి, శిక్షణ ఇచ్చామన్నారు.ఖమ్మం జిల్లా మున్నేరు పరివాహక ప్రాంతంలో గల లోతట్టు ప్రాంతాలైన సారధి నగర్, బొక్కల గడ్డ, అగ్రహారం కాలనీ, వెంకటేశ్వర నగర్, పద్మావతి కాలనీలలో మొంథా తుఫాన్ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న "ఆపదమిత్రలు'బుధ, గురువారాల్లో మున్నేరు లోతట్టు ప్రాంతాల ప్రజలను చైతన్య పరుస్తూ పునరావాస కేంద్రాలకు తరలించుటలో పూర్తిగా సహాయ సహకారాలు అందించారని తెలిపారు.ప్రజలకు తుఫాన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ, జిల్లా అధికారులతో సహాయక చర్యలలో చాలా చురుగ్గా పాల్గొన్నట్లు జిల్లా కలెక్టర్ అన్నారు.

## మానవతా దృక్పథం చాటుకున్న కిరణ్ గౌడ్



**అక్షర విజేత గజ్వేల్ :** దిక్కు లేని వారికి దేవుడే దిక్కంటారు.కానీ ఇక్కడ మాత్రం దేవుడిలా అనాథకు మాజీ ఎంపిటిసి కిరణ్ గౌడ్ అండగా నిలిచి మానవతా దృక్పథం చాటుకున్నారు. జగదేవపూర్ మండల కేంద్రానికి 6 సంవత్సరాల క్రితం వెంకటేష్ భార్య భాగ్యమ్మ కుమారుడు శివ 8 బతుకుదెరువు కోసం పొట్ట కుటికోసం వచ్చి బిక్షాటన బిచ్చమెత్తుకుంటూ జీవనం సాగించే వారు ఇటీవల ఆ కుటుంబంలో భాగ్యమ్మ మృతి చెందింది.తండ్రి వెంకటేష్ ఉన్నారు. తండ్రికి అనారోగ్యం సరిగ్గా లేకపోవడంతో కుమారుడు శివ అనాథగా మారాడు. విషయం తెలియడంతో మాజీ ఎంపిటిసి కిరణ్ గౌడ్ బాబు ను చూసి మనసు చలించి చదువుకునే వయసులో బిచ్చమెత్తుకోవడం గ్రహించి ఎలాగైనా సరే ఈ పిల్లవాడిని చదువుపించాలని అనుకున్నాడు. బాబు ను గురువారం రోజు తన సొంత కారులో తీసుకు వెళ్ళి , వేసుకోవడానికి బట్టలు ఇప్పించి కొండపాక మండలం లోని ఆనంద నిలయంలో బాలుడిని చేర్పించాడు. బాబుకి, నా వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తాననీ హామీ ఇచ్చారు.ఎప్పుడు ఏలాంటి అవసరం వచ్చినా బాబుకి అండగా ఉంటానని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వారి వెంట రమేష్ తదితరులు ఉన్నారు.

# వార్షిక తనిఖీలలో భాగంగా రెబ్బెన సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ









## సర్కిల్ కార్యాలయం రికార్డుల మెయింటెనెన్స్ పరిశీలన

**అక్షర విజేత అదిలాబాద్ ప్రతినిధి:-** వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం రోజు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఐపీఎస్ రెబ్బెన సర్కిల్ పోలీస్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు తనిఖీ సందర్భంగా ఎస్పీ మొదట పోలీసు వందనం స్వీకరించారు అసిఫాబాద్ ఏఎస్పి చిత్తరంజన్ ఐపీఎస్ కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు తదుపరి సర్కిల్ కార్యాలయ పరిసర పరిశుభ్రతను పరిశీలించి అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్ కేసుల వివరాలను సర్కిల్ ఇన్స్పెక్టర్ సంజయ్ అడిగి తెలుసుకున్నారు సర్కిల్ కార్యాలయ రికార్డులను తనిఖీ చేస్తూ ఎలాంటి కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలని జరిగిన నేరాలను సర్కిల్ మ్యాప్‌లో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు గ్రేవ్ కేసులపై నాణ్యమైన దర్యాప్తు చేసి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు మర్డర్ డౌరీ డెత్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని అవసరమైతే టెక్నికల్ సపోర్ట్ వినియోగించుకోవాలని సూచించారు సర్కిల్ పరిధిలో గల పోలీస్ స్టేషన్లను తరచుగా సందర్శిస్తూ ఆయా కేసులపై సంబంధిత ఎస్‌హెచ్‌ఓలకు తగిన సూచనలు సలహాలు ఇవ్వాలని ఎస్పీ పేర్కొన్నారు అలాగే సర్కిల్ పరిధిలో ఉన్న కె.డి. సస్పెక్ట్ రౌడీ షీట్స్ తెరిచిన వ్యక్తులను నిరంతరం చెక్ చేస్తూ వారి కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు ముఖ్యంగా ఆస్థి సంబంధిత నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను క్రైమ్ హాట్ స్పాట్స్‌గా గుర్తించి నిఘాను మరింత బలోపేతం చేయాలని అన్నారు నేరాల అదుపు జరిగిన నేరాల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొని ప్రతి స్టేషన్ పరిధిలో వీటి ఏర్పాటు కోసం కృషి చేయాలని అన్నారు సర్కిల్ పరిధిలో ఉన్న లాంగ్ పెండింగ్ కేసులు ఎన్‌బిడబ్ల్యూలు ఎన్ టి డబ్ల్యు ఎస్ వెంటనే ఎగ్జిక్యూట్ చేయాలని సూచించారు సర్కిల్ పరిధిలో గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు అవగాహనా కార్యక్రమాలలు నిర్వహించాలని అన్నారు సర్కిల్ కార్యాలయం రికార్డుల నిర్వహణ దర్యాప్తు తీరు సంతృప్తికరంగా ఉందని అభినందిస్తూ సర్కిల్ ఇన్స్పెక్టర్ సంజయ్ గారిని మరియు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు

# అకాలమొంథా తూఫాన్ ఆగమైన పంట







## దిక్కుతోచని స్థితిలో రైతాంగం

**అక్షర విజేత నర్సింహులపేట :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో మొంథా తుఫాన్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతంగంపై తీవ్ర ప్రభావం చూపింది, గత రెండు రోజుల నుండి ఎడతెరిపిలేని జడివానతో నర్సింహులపేట మండలంలోని రైతంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది, నష్టపోయిన పంటను పరిశీలించడానికి మండల వ్యవసాయ శాఖ అధికారి జి. వినయ్ కుమార్ తన బృందంతో మండలంలోని ముంగిమడుగు, పత్ని తండా, జయపురం మరియు రామన్నగూడెం, పడమటి గూడెం గ్రామాల్లోని పంట నష్టాన్ని పరిశీలించడం జరిగింది. అనంతరం రైతులతో మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావం వలన అధికనష్టాన్ని నివారించుటకు రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు వివరించారు. వరిపైరు నేలకొరిగితే వరిగింజ గట్టి పడే దశ, కోత దశలో ఉండటం వల్ల తల బరువుతో కిందపడి పోవచ్చు,వరిపైరు నేలకొరిగితే ధాన్యం మొలకెత్తకుండా పొలం నుంచినీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలి నేలకొరిగిన పంటను జడలు కట్టి నిటారుగా నిలబెట్టాలి ధాన్యం మొలకెత్తకుండా 5శాతం సోడియం క్లోరైడ్ (సాధారణ ఉప్పు) ద్రావణాన్ని పిచికారీ చేయాలి భారీ వర్షాల నేపథ్యంలో పంటలకు ఎరువులు వేయొద్దు వీలైనంతవరకు వరి కోతలను వాయిదా వేసుకోవాలి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని కుప్పగా చేర్చి టార్పాలిన్ కవర్లతో కప్పి ఉంచాలి. మొక్కజొన్న పంటపూత లేదా గింజ పోసే దశలో పంటలు నేలకొరిగే అవకాశముంది. మొక్కలను దగ్గరగాఒకదానితోఒకటి ఆసరా ఉండేలా చర్యలు తీసుకోవాలి, పంట పొలాల్లో వర్షం నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి. కోతకు వచ్చిన మొక్కజొన్న పంటను వర్షం తగ్గే వరకు కోయకుండా వాయిదా వేయాలి, ఆరబెట్టిన గింజలను టార్పాలిన్ కవర్ల కింద కప్పి ఉంచాలి పత్తి పంట తుపాను హెచ్చరికల నేపథ్యంలో పత్తితీతను వాయిదా వేసుకోవాలి. నల్లరేగడి నేలల్లో తేమ ఎక్కువ రోజులు నిలిచి కుళ్లిపోయే ప్రమాదం ఉంటుంది కనుక వర్షం నీటిని త్వరగా బయటికి పంపించాలి. ఇప్పటికే తీసిన పత్తిని తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అధిక తేమ వల్ల కాయలు కుళ్లిపోతాయి. దూది రంగుమారి నాణ్యత దెబ్బతింటుంది. దీని నివారణకు ప్రొపికొనాజోల్ 200మిల్లీలీటర్లను ఎకరానికి పిచికారీ చేయాలి. వర్షాలు తగ్గిన తర్వాత ఆకులపై మచ్చలు ఏర్పడితే బోరాక్స్ 1.50గ్రాములను లీటరు నీటికి కలిపి చల్లాలి. తడి వాతావరణం వల్ల పచ్చదోమ, తెల్లదోమ వంటి రసం పీల్చే పురుగుల ఉధృతి పెరుగు తుంది. వీటి నివారణకు ఎసిఫేట్ 1.50గ్రాము లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి కూరగాయల పంటలో టమాటా, మిరప మొక్కలు గాలికి పడిపో కుండా కర్రలు, తీగలతో ఊతమివ్వాలి. తీగజాతి కూరగాయల పందిళ్లను పటిష్ఠపరచాలి.కొత్తగా వేసిన నారుమళ్లపై వాననీరు పడకుండా ఏర్పాట్లు చేయాలి. పడిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి వాటి మొదళ్ల చుట్టూ మట్టిని ఎగదోయాలి. నారుకుళ్లు తెగులు నివారణకు 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ ను లీటరు నీటికి కలిపి మొక్క మొదళు తడిసేలా చల్లాలి అని రైతులకు తగు సూచనలు చేశారు, ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల బాధిత రైతులు పాల్గొన్నారు.

# పేదల గృహ స్వప్నం సాకారం -పామేనా భీమ్ భారత్







**అక్షర విజేత షాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజల ఆశయ పథకం ఇందిరమ్మ ఇళ్లు కార్యక్రమాన్ని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పామేన భీమ్ భరత్ షాబాద్ మండలం కుమ్మరిగూడ గ్రామంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నియామక పత్రాలను అందజేస్తూ భీమ్ భరత్ మాట్లాడుతూ, ఇల్లు కేవలం నాలుగు గోడలు కాదు, అది ప్రతి పేద మనిషి కల, గౌరవం, ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. పేదల ఆత్మగౌరవం కోసం, వారి భవిష్యత్తు కోసం తాను ఎల్లప్పుడూ ముందుంటానని, ప్రతి పేద కుటుంబం తలదాచుకునే ఇంటి కల నెరవేరే వరకు తన పోరాటం ఆగదని ??ఢంగా పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు కేవలం మాటలు కావు, అవి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి అర్హుడికి రూ. 5 లక్షల సాయం అందించడమే కాక, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూ. 6 లక్షల వరకు సహాయం ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ సామాజిక న్యాయానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం ప్రతి పేద మనిషి వెన్నంటే నిలబడి ఉందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను మహిళల పేరుతోనే ఇవ్వడం మహిళా సాధికారతకు నిదర్శనం అని భీమ్ భరత్ అన్నారు. మహిళ గౌరవం అంటే కుటుంబ గౌరవం, మహిళ సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. ప్రజల నమ్మకమే తన బలం, వారి ఆశయాల సాధన తన కర్తవ్యమని, ప్రజల కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. ప్రజల ఇబ్బందులు, పేదల సమస్యల పరిష్కారం తన రాజకీయ ధ్యేయమని భీమ్ భరత్ తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రతి గ్రామంలో తాను పాదయాత్ర చేస్తానని, ప్రజల మాట వింటానని, పేదల జీవితాల్లో వెలుగు నింపే నాయకుడిగా నిలుస్తానని హామీ ఇచ్చారు. నాకు పదవి కాదు, ప్రజల విశ్వాసమే ముఖ్యమని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని బలంగా అన్నారు. తరువాత ఆయన కుమ్మరిగూడ గ్రామానికి చెందిన గుడిసె యాదయ్య స్థాపించిన శ్రీ లక్ష్మీ నరసింహ రియల్ ఎస్టేట్ ఆఫీసును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా హాజరై భీమ్ భరత్‌కు ఘన స్వాగతం పలికారు. గ్రామం మొత్తానికి పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో షాబాద్ మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య, మాజీ సర్పంచ్ తమ్మాలి రవీందర్, ఎంపీటీసీ అశోక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సురేందర్, మన్మరి మాజీ సర్పంచ్ సత్యనారాయణ, గుడిసె రంగయ్య, నర్సిములు, నవీన్, ఆనంద్, వెంకటేష్, రవీందర్ రెడ్డి, సమీర్ పాషా, లక్ష్మి నారీ, మల్లయ్య, నరేష్, మల్లారెడ్డి, గుల అనంతయ్య, పెద్దేటి మహేందర్, కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బీసీ జేఏసీ కన్వీనర్ బర్క కృష్ణ

# బీసీల హక్కుల సాధనే నా ధ్యేయం



**అక్షర విజేత, షాబాద్ :** తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన కీలక సమావేశంలో జాతీయ బీసీ సేన అధ్యక్షులు బర్క కృష్ణను తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ కన్వీనర్‌గా నియమించారు. ఈ నియామకం బీసీ వర్గాల ఐక్యతకు, బలానికి నిదర్శనంగా మారింది. బీసీ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తూ ఎల్లప్పుడూ బీసీల హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన బర్క కృష్ణకు ఈ బాధ్యత రావడం రాష్ట్ర వ్యాప్తంగా ఆనందాన్ని కలిగించింది. ఈ సందర్భంగా బర్క కృష్ణ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి చైర్మన్ ఆర్. కృష్ణయ్యకు ధన్యవాదాలు తెలుపుతూ "బీసీలకు న్యాయం జరిగే వరకు నా పోరాటం ఆగదు. 42 శాతం రిజర్వేషన్ సాధించే వరకు ప్రతి బీసీ ఇంటి తలుపు తట్టుకుంటాను. రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో బీసీలకు గౌరవప్రదమైన స్థానం రావాలంటే మన అందరి ఐక్యతే బలమని నేను నమ్ముతున్నాను. బీసీల సంక్షేమం కోసం అన్ని వర్గాలను, అన్ని పార్టీలను, అన్ని కులాలను కలుపుకొని ముందుకు వెళ్తాను. బీసీలకు రావలసిన హక్కులు, గౌరవం కోసం ఎటువంటి త్యాగానికైనా వెనుకాడను. బీసీల రాజ్యాధికారమే నా లక్ష్యం, బీసీల అభ్యున్నతే నా ఊపిరి" అని బలంగా తెలిపారు. అతను ఇంకా మాట్లాడుతూ, బీసీ సమాజం ఒక్కటై ఉంటే ఎవరూ మన హక్కులను దోచుకోలేరని, బీసీలను అణగదొక్కే శక్తులు ఇకపై రాష్ట్రంలో తలెత్తే అవకాశం లేదని స్పష్టం చేశారు. బీసీ యువత తమ భవిష్యత్తు కోసం విద్య, రాజకీయాలు, సామాజిక ఉద్యమాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బీసీల సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా కట్టుబడి పని చేస్తానని, బీసీల అభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖరప్ప, మహిళా నాయకులు, పెద్దలు, షాద్‌నగర్ బీసీ సేన నాయకులు, జేఏసీ సభ్యులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొని బర్క కృష్ణకు అభినందనలు తెలియజేశారు. సభా ప్రాంగణం "జై బీసీ" నినాదాలతో మార్మోగింది.

# జూబ్లీహిల్స్ లో బిఆర్ఎస్ గెలుపు ఖాయం

## బిఆర్ఎస్ పార్టీ నాయకులు దాచారం కనకయ్య



**అక్షర విజేత గజ్వేల్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ విజయం ఖాయమని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ దాచారం కనకయ్య పేర్కొన్నారు. గురువారం జగదేవపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గెలుపు తథ్యమన్నారు. జూబ్లీహి ల్స్ నియోజకవర్గ ప్రజలు బిఆర్ఎస్ అభ్యర్థికి బ్రహ్మరథం పడుతున్నారని ఎవ్వరి నోట విన్న గులాబీ ముచ్చటనే వినిపిస్తుందన్నారు.కాంగ్రెస్ ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసిన కుట్రలు, కుతంత్రాలు పన్నిన బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపును అడ్డుకోలేరన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు చాలా తెలివిమంతులని ఎవరికి ఓటు వేయాలో వారికి తెలుసు అని అన్నారు.అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కు జూబ్లీహిల్స్ ప్రజలు ఓటర్లు ఉప ఎన్నికల ద్వారా తగిన బుద్ధి చెప్తారని తెలిపారు. బిఆర్ఎస్ పదేళ్ల పరిపాలనలో మాజీ సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ప్రవేశ పెట్టిన పథకాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.

# పోషకాహారం ప్రతి కుటుంబ ఆరోగ్యానికి పునాది

## రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్.



**అక్షరవిజేత,రాయికల్ :** జగిత్యాల జిల్లారాయికల్ పట్టణంలోని ఇటిక్యాల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జయ న్యూట్రిషన్ సెంటర్ ను మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ › "ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్యమైన పోషకాహారం అత్యంత అవసరం. చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, వృద్ధులు మరియు యువతకు సరైన ఆహారపు అలవాట్లు పెంపొందించడంలో న్యూట్రిషన్ సెంటర్‌లు కీలక పాత్ర పోషిస్తాయి" అని, న్యూట్రిషన్ సెంటర్ ద్వారా ప్రజల్లో పోషకాహారంపై అవగాహన పెంచేందుకు నిర్వాహకులు కృషి చేయాలని సూచించారు. అలాగే ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం తగిన వ్యాయామం, నీటి వినియోగం, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం అవసరమన్నారు. న్యూట్రిషన్ సెంటర్ నిర్వాహకురాలు తీగుల్ల జయసుధ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాభివృద్ధి లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యూట్రిషన్ ప్రతినిధులు మీనారావు ,నరేష్,అతిథి బాలె శేఖర్, నిఖిల్,రామ్ రెడ్డి, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి అండగా నిలిచిన ఒడితల ప్రణవ్ బాబు







**అక్షర విజేత,కమలాపూర్‌బీ :** కమలాపూర్ మండల పరిధిలో గల మరి పెల్లి గూడెం గ్రామానికి చెందిన ఎరుకల రాజయ్య ఇటీవల మరణించగా వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని మరి పెల్లి గూడెం కాంగ్రెస్ పార్టీ నాయకులు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఒడితలప్రణవ్ బాబు దృష్టికి తీసుకువెళ్లగా ఆ విషయంపై స్పందించిన ప్రణవ్ బాబు మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ 50 కేజీల బియ్యాన్ని పంపించడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మౌటంకుమారస్వామి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల కష్టసుఖాలలో ఒడితలప్రణవ్ బాబు ఎల్లప్పుడూ ముందు ఉంటాడని ప్రజల సంక్షేమమే తన ధ్యేయంగా పనిచేస్తున్నాడని ఇంకా రానున్న రోజుల్లో రాజకీయాలకతీతంగా ప్రజా సేవచేయడానికి ముందు వరుసలో ఉంటాడని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి అంకుష్,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ పైసా శరత్,మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుల్లా వెంకటేష్,గ్రామ శాఖ అధ్యక్షులు జక్కుల రాజు, ఇనగాల బిక్షపతి,పోరండ్ల ప్రభాకర్, ఎరుకల సాయిరెడ్డి, ఎనుగాల రాజు సుదర్శన్, ఎనుగాల కాళీ, కుమ్మరి రవి, సల్పాల తిరుపతి,కాసూరి సాంబయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది..

# మానేపల్లి జ్యువెల్లర్స్‌లో ఐటీ దాడులు కొనసాగింపు

## వ్యాపార లావాదేవీలపై లెక్కల తేడాలు ఆరా తీస్తున్న ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు




**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** సికింద్రాబాద్‌లోని మానేపల్లి జ్యువెల్లర్స్ పై ఇన్‌కమ్ ట్యాక్స్ (ఐటీ) అధికారులు నిర్వహిస్తున్న దాడులు మూడవ రోజు కూడా కొనసాగాయి. లెక్కల్లో తేడాలు ఉన్నాయన్న విశ్వసనీయ సమాచారం ఆధారంగా అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. సమాచారం ప్రకారం, సికింద్రాబాద్‌లోని మానేపల్లి జ్యువెల్లర్స్ సంస్థలో ప్రతి సంవత్సరం ?1000 నుంచి ?1250 కోట్ల వరకు లావాదేవీలు జరుగుతున్నట్లు ఐటీ అధికారులకు సమాచారం అందింది. కొనుగోలు%-%అమ్మకాలపై ట్యాక్స్ చెల్లింపుల్లో జాప్యం జరిగినట్లు ఐటీ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ దాడులు గురువారం మూడవ రోజుకీ కొనసాగుతున్నాయి. అధికారులు వ్యాపార లావాదేవీలకు సంబంధించిన డాక్యుమెంట్లు, అకౌంట్ రికార్డులు పరిశీలిస్తున్నారు. అలాగే, కొనుగోలు, అమ్మకాల లెక్కలపై వ్యాపారులను ఐటీ అధికారులు ఆరా తీస్తున్నారు. సంస్థ ప్రధాన కార్యాలయం, బ్రాంచ్‌లతో పాటు మానేపల్లి గ్రూప్‌కు చెందిన ప్రముఖుల నివాసాలపైనా తనిఖీలు జరుగుతున్నట్లు సమాచారం. అయితే, అధికార వర్గాలు ఈ విషయంపై అధికారిక ప్రకటన చేయలేదు.

# కుమ్మరి గూడ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించిన భీమ్ భరత్

### కుమ్మరి గూడ గ్రామంలో గుడిసె యాదయ్య నూతన శ్రీ లక్ష్మీ నరసింహ రియల్ ఎస్టేట్ ఆఫీసు ను ప్రారంభించిన భీమ్ భరత్

**అక్షర విజేత, చేవెళ్ల :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలం కుమ్మరి గూడ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లు పథకాన్ని లబ్ధి దారులకు చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామేన భీమ్ భరత్ నియామక పత్రాలు ఇచ్చి ప్రారంభించారు. ఈ స్కీమ్ ద్వారా అర్హులైన పేదలందరికీ సొంత ఇల్లు కట్టుకునేందుకు రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు వచ్చే ఆర్థిక సంవత్సరానికి గానూ ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్లను కేటాయించింది. కాగా ఈ విడతలో సొంత జాగా ఉన్నవారికే ఇండ్లను కేటాయిస్తోంది అని తెలియజేశారు. మరియు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారికి అదనంగా రూ. లక్ష సాయం అందించనున్నట్లు తెలిపారు. అంటే బీసీ, మైనార్టీ వర్గాలకు ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు సాయంగా అందిస్తుంటే, ఎస్సీ, ఎస్టీలకు మాత్రం రూ. 6 లక్షలు సాయం అందించనున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లోనూ ఈ వాగ్దానం చేసింది. ఇందిరమ్మ ఇండ్లు స్కీమ్ ద్వారా ఇల్లు కట్టుకునేందుకు ఎస్సీ, ఎస్టీలకు రూ. 6 లక్షలు, ఇతరులకు రూ. 5 లక్షలు సాయంగా అందిస్తామన్నారు ఇప్పుడు అందుకు అనుగుణంగానే హామీని అమలు చేస్తోంది అని కొనియాడారు. ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను మహిళల పేరు మీదే అందించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. మహిళలు సంతోషంగా ఉంటే రాష్ట్రం బాగున్నట్లే అని పేర్కొన్నారు. అందుకే ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను మహిళల పేరు మీద మంజూరు చేసినట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో వీరితో పాటుగా పాల్గొన్న షాబాద్ మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య, షాబాద్ మండల మాజీ సర్పంచ్ తమ్మాలి రవీందర్, షాబాద్ ఎంపీటీసీ అశోక్, షాబాద్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సురేందర్,మన్మరి మాజీ సర్పంచ్ సత్యనారాయణ, నర్సిములు, నవీన్, ఆనంద్, వెంకటేష్, రవీందర్ రెడ్డి, సమీర్ పాషా, లక్ష్మి నారీ,మల్లయ్య, నరేష్, మల్లారెడ్డి, గుల అనంత్తయ్య, పెద్దేటి మహేందర్, ఆయా గ్రామా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుడిసె రంగయ్య, గ్రామ ప్రజలు సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## సంజయ్ ను సత్కరించిన బొబ్బిలి వీధి యువకులు



**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన ధర్మపురి సంజయ్ ను బొబ్బిలి వీధి యువకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని ఎల్లమ్మగుట్ట బొబ్బిలి వీధి మున్నూరు కాపు సంఘం యువకులు గురువారం బొబ్బిలి వీనిష్ (బిట్టు ) ఆధ్వర్యంలో ధర్మపురి సంజయ్ స్వగృహంలో సంజయ్ ను శాలువా, పూలమాలతో సత్కరించారు. సంజయ్ ను కలిసిన వారిలో బొబ్బిలి మహేష్, బొబ్బిలి మధుమోహన్, బొబ్బిలి అఖిలేష్,బొబ్బిలి నిఖిల్ లు కలిశారు ల్.

## ఏసీబీకి పట్టుబడ్డ మెదక్ విద్యుత్ డిఈఈ





**అక్షర విజేత మెదక్ :** మెదక్ జిల్లా విద్యుత్ కార్యాలయంలో గురువారం సంగారెడ్డి ఏసీబీ అధికారులు రైడ్ చేయగా డిఈఈ షేక్ చాంద్ షరీఫ్ పాషా రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు.పాపన్నపేట మండలం సీతానగరం గ్రామానికి చెందిన పాపగారి భాస్కర్ అనే రైతు కొత్త పౌల్ట్రీ ఫారం ఏర్పాటు చేసుకొనుటకుగాను అందుకు విద్యుత్ కనెక్షన్ ,ట్రాన్స్ఫార్మర్ ఇచ్చుటకు డిఈఈ రూ.40 వేల రూపాయలు డిమాండ్ చేయగా, రూ.30వేలు ఇచ్చుటకు ఒప్పందం కుదిరింది. ముందుగా రూ.9 వేలు చెల్లించినారు.గురువారం రూ.21 వేల రూపాయలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొన్నట్లు ఏసిబి డిఎస్పీ సుదర్శన్ రెడ్డి తెలిపారు.

## ఇల్లు ఇల్లు తిరుగుతూ. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం
### జ్యోతి భీమ్ భరత్
### రంగా రెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు



**అక్షర విజేత, చేవెళ్ల :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలలో భాగంగా.రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావుతో కలిసి నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లో ఇల్లు ఇల్లు తిరుగుతూ. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ ని భారీ మెజార్టీ గెలిపించాలని కోరుతూ రంగా రెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్ గారు ప్రచారం చేయడం జరిగింది ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

## పీఎం ఉజ్వల యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

### నిరుపేద ప్రజలకు ఈ పథకం వరంలాంటిది..
### బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ సిద్ధిరాములు..



**అక్షరవిజేత,టేక్మాల్ :** నిరుపేదలకు అండగా భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉండి, గ్యాస్ కనెక్షన్ లేని నిరుపేద మహిళలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ కనెక్షన్ పథకాన్ని ప్రవేశపెట్టింది.కావున టేక్మాల్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన అర్హులైన నిరుపేద మహిళలు ఈ ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసం దరకాస్తులు చేసుకోవాలని కోరారు.ఈ కనెక్షన్ కోసం కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు,మూడు ఫొటోలు, బ్యాంక్ ఖాతా వివరాలు, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్సులను అందుబాటులోని గ్యాస్ ఏజెన్సీ డీలర్లకు అందించాలని సూచించారు.వీరిలో రెడ్యా నాయక్,బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కోయిలకొండ దుర్గాప్రసాద్ ఉన్నారు.

## శబరిమలకు 2 వసారి మహాపాదయాత్ర



**అక్షరవిజేత,రాయికల్ :** రాయికల్ మండలం రామాజీపేట గ్రామానికి చెందిన మామిడిపెల్లి లక్ష్మణ్ 7 వ సారి శ్రీ అయ్యప్ప స్వామి మాలధారణ చేసి, 5 సార్లు పెద్దపాదం, గత సంవత్సరం మహా పాదయాత్ర చేశాడు. గురువారం 7 వసారి మాలధారణ చేసి అభినవ శబరిమల రాయికల్ అయ్యప్ప గుడి నుండి మహాపాదయాత్రకు బయలుదేరాడు. గత సంవత్సరం, ఈ సంవత్సరం మహా పాదయాత్ర చేయడం అనేది ఎంతో అదృష్టం ఉంటేనే ఈ విధంగా భగవంతున్ని సేవించుకునే మహద్భాగ్యం కలిగిందని మామిడిపెల్లి లక్ష్మణ్ అన్నాడు. అయోధ్య లో భవ్యమైన శ్రీ రామ మందిరం నిర్మాణంకై చేపట్టిన మొదటిసారి రెండోసారి కరసేవ చేసే భాగ్యాన్ని దేవుడు ప్రసాదించాడని అన్నాడు. భక్తితో మానసిక పరివర్తన, స్థైర్యం లభిస్తుందని అన్నాడు. రెండోసారి శబరిమలకు మహా పాదయాత్రకు బయలుదేరిన మామిడిపెల్లి లక్ష్మణును పలువురు అభినందించారు.

## చేవెళ్లలో విజయవంతమైన ఎస్ఎఫ్ఐ బంద్

### ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎర్రవల్లి శ్రీనివాస్, బేకరీ అరుణ్ కుమార్




**అక్షర విజేత, చేవెళ్ల :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చేవెళ్లలో జూనియర్,డిగ్రీ ప్రభుత్వ ప్రైవేటు కళాశాల లను బందు చేయించడం జరిగిందని అన్నారు ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించకుండా కాలయాపన చేయడం సరే ఎందుకు కాదన్నారు గత కొన్ని రోజుల క్రితం పెండింగ్ బకాయిలను కొంతమేరకు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ఇప్పటికీ చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ వ్యాప్తంగా జూనియర్ డిగ్రీ ప్రొఫెషనల్ ఇంజనీరింగ్ బి.ఎడ్ తదితర విద్యాసంస్థలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బందు నిర్వహించడం జరిగిందని అన్నారు పెండింగ్లో ఉన్నటువంటి 8500 కోట్ల స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల కార్యదర్శి మాల చందు ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ నాయకులు రిషి, ఆకాష్, విష్ణు, కైఫ్, వినయ్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ కన్వీనర్ గా బర్క కృష్ణ



**అక్షర విజేత షాద్నగర్ :** తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య ఈరోజు జాతీయ బీసీ సేన అధ్యక్షులు బర్క కృష్ణ ను తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ కన్వీనర్ గా నియమించడం జరిగినది. ఈ కార్యక్రమానికి బీసీ నాయకులు జేఏసీ నాయకులు, బీసీ నాయకులు, జాతీయ బీసీ సేన అధ్యక్షులు బర్క కృష్ణకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ అధ్యక్షులుగా నియమితులైన బర్క కృష్ణ మాట్లాడుతూ తనపై పూర్తి నమ్మకంతో రాష్ట్ర జేఏసీ అధ్యక్షులుగా నియమించినందుకు జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యకు ధన్యవాదాలు తెలియజేస్తూ 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధించేంతవరకు అవిశ్రాంతంగా పోరాటం చేస్తామని, అన్ని కులాలను అన్ని వర్గాలను అన్ని పార్టీలను కలుపుకొని పోయి బీసీల అభ్యున్నతికై పాటుపడతానని, బీసీలకు అందాల్సిన అన్ని సంక్షేమ ఫలాలు అందేంతవరకు ముందు తానే నడుస్తానని, బీసీల సంరక్షణ ధ్యేయంగా పూర్తి నమ్మకం మరియు విశ్వాసంతో పని చేస్తానని, బీసీలకు రాజ్యాధికారం దిశగా అన్ని వర్గాలను కలుపుకొని పోతానని బీసీల సంపూర్ణ అభివృద్ధి తన ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప మహిళలు పెద్దలు బీసీ సేన షాద్ నగర్ నియోజకవర్గం బీసీ నేతలు కృతజ్ఞతలు తెలియజేశారు...

## మాజీ జెడ్పీటిసి బోర్ల భీమయ్య అల్లుడు పెళ్ళికి హాజరైన మాజీ మంత్రి

### మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



అక్షర విజేత గోపాల్పేట్, రేవల్లిబీ : వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలోని మాజీ జెడ్పీటిసి అల్లుడు పెళ్లికి మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. ఆయనతోపాటు మాజీ జెడ్పీటిసి బోర్ల భీమయ్య, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాగం తిరుపతిరెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లకు ధన్యవాదాలు

### ట్విట్టర్ లో ప్రముఖ టాలీవుడ్ నిర్మాత బండ్ల గణేష్ కృతజ్ఞతలు



**అక్షర విజేత షాద్నగర్ :** షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్ పల్లి పౌల్ట్రీ రైతులకు సంబంధించిన ఆస్తిపన్ను రూ. 5.5 కోట్లకు పైగా బకాయి రద్దు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ లకు ప్రముఖ టాలీవుడ్ నిర్మాత బండ్ల గణేష్ తన ట్విట్టర్ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. గత దశాబ్ద కాలంగా పౌల్ట్రీ రైతుల ఆస్తిపన్ను వ్యవహారంపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే వీళ్లపల్లి శంకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయగలరని పేర్కొన్నారు. పౌల్ట్రీ రైతుల ఆస్తి పన్ను వ్యవహారంలో గత ప్రభుత్వం సమస్యను పరిష్కరించకపోగా అదేవిధంగా కేసులు బనాయించడం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని రైతులకు ఐదున్నర కోట్ల రూపాయలకు పైగా ఆస్తి పనులు మాఫీ చేయడం ఎంతో శుభ పరిణామం ఇది పౌల్ట్రీ రైతులకు ఊరట ఇచ్చిందని బండ్ల గణేష్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదే విధంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర ప్రభుత్వ పెద్దలకు తన ధన్యవాదాలు తెలిపారు..

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

### మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేసిన వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్



**అక్షర విజేత షాద్నగర్ :** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో ఈరోజు ఫరూక్నగర్ మండల ఎంఈఓ మనోహర్ కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కన్వీనర్స్ శ్రీను నాయక్ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా గుడ్ల ధరలను కట్టెల బిల్లులు ను గ్యాస్ బిల్లులను పెంచాలని మరియు పెండింగ్ లో ఉన్న గత విద్యా సంవత్సరానికి మరియు ప్రస్తుతానికి మనిషిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు అన్నారు అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం 18000 ఇవ్వాలని పిఎఫ్ ఈఎస్ఐ పెంచాలని తదితర సమస్యలు పరిష్కరించాలని వారు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాలు చిట్టెమ్మ సుమలత కాజా బేగం యాదమ్మ రెహానా లలితమ్మ హసీనా సౌలీబి శివమ్మ అనిత తదితరులు పాల్గొన్నారు...

## డీజిల్ దొంగతనం చేస్తున్న దొంగలను శంకరంపేట్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు



**అక్షర విజేత, పెద్ద శంకరంపేట్ :** యువకులు చెడు అలవాట్లకు బానిసాయి దొంగతనం అలవాటు పడిన నేరస్తులను జైలుకు పంపించారు తేదీ 29 10 2025 రోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో శంకరంపేట్ ఎస్సై సిబ్బంది వాహన తనిఖీలు చేస్తుండగా చీలపల్లి బ్రిడ్జి వద్ద ఒక బలెనో కార్ నెంబరు %ఖా08ఖీఖీ% 3047 గల కారును ఆపి తనిఖీ చేయగా అందులో 30 లీటర్ల ఖాళీ డబ్బాలు 6 ఉన్నాయి కార్లో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు వారి పేర్లు 1) సబవత్ రాహుల్ వనపర్తి జిల్లా రెండో వ్యక్తి పేరు కురుమ గణేష్ కామారెడ్డి జిల్లా లింగంపేట్ మూడో వ్యక్తి తోకల నాగరాజు మహబూబ్నగర్ జిల్లా అడ్డకల్ మండల్ అని తెలిపినారు కారులో డబ్బాల గురించి విచారించగా వాళ్లు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో వారిని కారుతో సహా పిఎస్ కు తీసుకొచ్చి విచారించగా వారు తెలిపినది ఏమనగా వారందరూ హైదరాబాదులో కూకట్పల్లి ఏరియాలో నివాసం ఉంటున్నారని తెలిపినారు ఆటో డ్రైవింగ్ చేస్తూ కూలి పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపి నారు వాటి వల్ల వచ్చే డబ్బులు వారికి జల్సాలకు సరిపోవడం లేదని ఈజీగా డబ్బు సంపాదించడం కొరకు ఏదైనా దొంగతనం చేద్దామని ముగ్గురు కలిసి నిర్ణయించుకొని వారికి తెలిసిన బోరబండ కు చెందిన అన్వర్ అనే వ్యక్తి పరిచయంతో డీజిల్ దొంగతనం చేయడం ప్రారంభించినారు వీరు రోడ్డు పక్కన పార్క్ చేసిన లారీలలో డీజిల్ దొంగలించి అన్వర్ అనే వ్యక్తికి బోరబండలో అమ్మి ఆ డబ్బులతో జల్సాలు చేయడం ప్రారంభించారు అదేవిధంగా తేదీ 22 10 2025 రోజు నిజాంపేటలో? TS 08FF 3047 నెంబరు గల బలేనో కారు అద్దెకు తీసుకొని ఔటర్ రింగ్ రోడ్ ఏరియాలో జోగిపేటలో డీజిల్ లారీల నుండి దొంగిలించి అన్వర్ కు అమ్మడం జరిగింది తర్వాత 25 తేదీ రోజు నడిరాత్రి అదే కారు తీసుకొని శంకరంపేట వచ్చి శంకరంపేట చర్చి కాంపౌండ్ లోని జుగాల్వార్ నారా గౌడ్ యొక్క టిప్పర్ల నుండి 6 డబ్బాలలో 150 లీటర్ల డీజిల్ వారి యొక్క గోదాం తాళం పగలగొట్టి లోపల ఉన్న ఒక పాత బ్యాటరీ లారీ జాక్ దొంగిలించిన డీజిల్ బోరబండలోని అన్వర్ కు అమ్మినాము అని బ్యాటరీ జాక్ తమ వద్ద ఉన్నాయని తెలిపినారు ఈ ముగ్గురు డీజిల్ దొంగలను ? అరెస్ట్ చేసి మ్యాజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్ కు తరలించడం జరుగుతుంది. నాలుగో నిందితుడు అన్వర్ పరారీలో ఉన్నాడు.

# కుమ్మరి గూడ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించిన భీమ్ భరత్

### కుమ్మరి గూడ గ్రామంలో గుడిసె యాదయ్య నూతన శ్రీ లక్ష్మీ నరసింహా రియల్ ఎస్టేట్ ఆఫీసు ను ప్రారంభించిన భీమ్ భరత్





**అక్షర విజేత :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలం కుమ్మరి గూడ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లు పథకాన్ని లబ్ధి దారులకు చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామేన భీమ్ భరత్ నియామక పత్రాలు ఇచ్చి ప్రారంభించారు. ఈ స్కీమ్ ద్వారా అర్హులైన పేదలందరికీ సొంత ఇల్లు కట్టుకునేందుకు రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు వచ్చే ఆర్థిక సంవత్సరానికి గానూ ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్లను కేటాయించింది. కాగా ఈ విడతలో సొంత జాగా ఉన్నవారికే ఇండ్లను కేటాయిస్తోంది అని తెలియజేశారు. మరియు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారికి అదనంగా రూ. లక్ష సాయం అందించనున్నట్లు తెలిపారు. అంటే బీసీ, మైనార్టీ వర్గాలకు ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు సాయంగా అందిస్తుంటే, ఎస్సీ, ఎస్టీలకు మాత్రం రూ. 6 లక్షలు సాయం అందించనున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లోనూ ఈ వాగ్దానం చేసింది. ఇందిరమ్మ ఇండ్లు స్కీమ్ ద్వారా ఇల్లు కట్టుకునేందుకు ఎస్సీ, ఎస్టీలకు రూ. 6 లక్షలు, ఇతరులకు రూ. 5 లక్షలు సాయంగా అందిస్తామన్నారు ఇప్పుడు అందుకు అనుగుణంగానే హామీని అమలు చేస్తోంది అని కొనియాడారు. ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను మహిళల పేరు మీదే అందించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. మహిళలు సంతోషంగా ఉంటే రాష్ట్రం బాగున్నట్లే అని పేర్కొన్నారు. అందుకే ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను మహిళల పేరు మీద మంజూరు చేసినట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో వీరితో పాటుగా పాల్గొన్న షాబాద్ మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య, షాబాద్ మండల మాజీ సర్పంచ్ తమ్మాలి రవీందర్, షాబాద్ ఎంపీటీసీ అశోక్,షాబాద్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సురేందర్,మన్మరి మాజీ సర్పంచ్ సత్యనారాయణ,నర్సిములు, నవీన్, ఆనంద్, వెంకటేష్, రవీందర్ రెడ్డి, సమీర్ పాషా,లక్ష్మి నారీ,మల్లయ్య, నరేష్, మల్లారెడ్డి, గుల అనంతయ్య, పెద్దేటి మహేందర్, ఆయా గ్రామా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుడిసె రంగయ్య, గ్రామ ప్రజలు సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప దీక్ష తీసుకుంటే పాపమా ? ఎబివిపి ఆగ్రహం








**అక్షర విజేత, కుత్బుల్లాపూర్ :-** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని కొంపల్లి నగర పరిధిలోని సుచిత్రలో ఉన్న షేర్వుడ్ పబ్లిక్ స్కూల్లో జరిగిన ఘటనపై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు స్కూల్లో 6వ తరగతి చదువుతున్న విహన్ తేజస్ అనే విద్యార్థి అయ్యప్ప దీక్ష తీసుకొని మాల ధరించి స్కూల్‌కు వెళ్ళగా, స్కూల్ యాజమాన్యం ఆయనను తిరిగి ఇంటికి పంపించిందని సమాచారం. ఈ ఘటనపై విద్యార్థి కుటుంబం మరియు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేయగా, ఎబివిపి నాయకులు స్కూల్ ఎదుట నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్పల్లి విభాగ్ కన్వీనర్ నగేష్ మాట్లాడుతూ "తెలంగాణలో అనేక స్కూళ్లలో మాల వేసుకున్న విద్యార్థులను ఇంటికి పంపించే ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. అయినా కూడా డిఈఒ ఎంఈఒ లు స్పందించడం లేదు. షేర్వుడ్ స్కూల్‌లో జరిగిన ఈ సంఘటన తిరిగి జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి"కోరారు అలాగే ఆయన డిమాండ్ చేస్తూ "షేర్వుడ్ స్కూల్ అఫిలియేషన్ రద్దు చేయాలి, స్కూల్‌ను సీజ్ చేయాలి" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కన్వీనర్ మృతుంజయ, కొంపల్లి నగర కార్యదర్శి ప్రర్థ సారథి, సంయుక్త కార్యదర్శి సన్నీ, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భవాని సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా దీపోత్సవం





**అక్షర విజేత, ఇబ్రహీంపట్నం :** కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం శ్రీ భవాని సమేత నాగలింగేశ్వర ఆలయంలో దీపోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని శ్రీ భవాని సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ నక్షత్ర కోటి సోమవార వ్రతాన్ని పురస్కరించుకొని గురువారం సాయంత్రం ఆలయంలో దీపాలతో పూలతో అలంకరించారు. నాగలింగేశ్వర ఆలయ భక్త బృందం భక్తిశ్రద్ధలతో ఈరోజును అతి పవిత్రమైన రోజుగా కార్తీక మాసంలో ప్రతి సంవత్సరం శైవ క్షేత్రాలలో దీపాలతో అలంకరించి ఆ శివుని కృప భక్తులందరిపై ఉండాలని ఉపవాసాలు ఉండి భక్తిశ్రద్ధలతో సాయంకాలం సమయం శివాలయాలలో లలో దీపారాధన చేస్తారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



**అక్షరవిజేత,రాయికల్: :** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలోని అల్లీపూర్ రైతు ఉత్పత్తి దారుల కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్ శ్రీలత వీరి వెంట ట్రైనిడిప్యూటీ కలెక్టర్ కన్నంహరిణి, డిసిఎస్ ఓ, జితందర్ రెడ్డి , డియం జితెంధర్, డిటిసిఎస్ ఉమాపతి, జగిత్యాల తహసిల్దార్ వరంధన్, రూరల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ చిట్యాల భూమయ్య, రాయికల్ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ దేవదాస్, ఫుడ్ ఇన్స్ పెక్టర్ రాజేందర్ రావు, జిపిఓ, మహేష్, చైర్మన్ అత్తినేని శంకర్, డైరెక్టర్ రత్నాకర్ రావు, సీఈఓ రాకేష్, రాజేష్ మరియు రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా గడ్డం అబుల్ జన్మ దిన వేడుకలు



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో:** రాజ్యాంగం అందించిన ఫలాలు అందరికి చేరాలని, అందరు సమానంగా ఎదగాలని గడ్డం అబుల్ తెలిపారు. ఒక వైపు అడ్వొకెట్ గా మరోవైపు కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రెసిడెంట్ గా పనిచేస్తూ ప్రజా గొంతుకగా నిలిచారు. ఆయన పుట్టిన రోజు వేడుకలను బోయినిపల్లి లోని జాతీయ మానవ హక్కుల సంఘము కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు. అబుల్ ను ఆయన మిత్రులు, అభిమానులు సహలువతో సన్మానించి కేక్ కాట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి.బి మహేందర్, నగేష్, బాబు రావు, ఎన్.హెచ్.ఆర్.ఎస్ జస్టిస్ కమిషన్ ఉపాధ్యక్షుడు అశోక్, కోలాపూర్ గోమతి, బీ.వాసంతి తదితరులు పాల్గొన్నారు..

# మహేశ్వరంలో పోలీస్ అమరావీరుల దినోత్సవ వార్షికోత్సవాలు

### రక్తదాన శిబిరంలో పాల్గొన్న డిసిపి సునీత రెడ్డి





**అక్షర విజేత మహేశ్వరం :** రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్, ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరుల దినోత్సవ వారోత్సవాలను అక్టోబర్ 21 నుండి 31 వరకు నిర్వహించమని ఆదేశాలు ఇవ్వగా, సిపి సార్ ఆదేశాల మేరకు 30.10.2025 నాడు మహేశ్వరం డివిజన్ పరిధిలోని మహేశ్వరం పోలీస్ స్టేషన్ శివగంగా టెంపుల్ వద్ద మహేశ్వరం డిసిపీ సునీత రెడ్డి, ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ స్టేట్ బ్రాంచ్ వారు రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి, ప్రారంభించరు, ఈ యెక్క ప్రోగ్రామ్ లో మహేశ్వరం డివిజన్ పరిధిలోగల నాలుగు పోలీస్ స్టేషన్ ల సి.ఐ.ఎస్.ఐ లు, సిబ్బంది. మహేశ్వరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు యువకులు, మహేశ్వరంలోని వివిధ కంపెనీలు మలబారు , విప్రో, ప్రీమియర్ , సిగ్నీ , వనమాలి , శ్రీనాథ్ రోటో ప్యాక్ , టాటా టీ కంపెనీ లలో పనిచేసే కార్మికులు, కంపెనీ యాజమాన్యం అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బ్లడ్ డొనేషన్ క్యాంప్ లో సుమారు 500 మంది పాల్గొనగా, అందులో 300 మంది వరకు రక్తదానాన్ని ఇవ్వడం జరిగింది. ఈ యెక్క ప్రోగ్రామ్ ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహేశ్వరం జోన్ డిసిపి సునీత రెడ్డి, మహేశ్వరం ఎసిపి జానకి రెడ్డి , మహేశ్వరం పి.ఎస్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కందుకూరు పి.ఎస్ ఇన్స్పెక్టర్ సీతారాం, పహాడీ షరీఫ్ ఇన్స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డి, బాలాపూర్ ఇన్స్పెక్టర్ సుధాకర్, ఎస్ఐలు, సిబ్బంది, మహేశ్వరం మండల వివిధ గ్రామ ప్రజలు యువకులు పాల్గొనరు,

# ఇందుర్తి కోహెడ మధ్య హైలెవల్ బ్రిడ్జి మంజూరు చేస్తాం

### దెబ్బతిన్న రోడ్డు,పంటలను పరిశీలించిన

### నష్టపోయిన పంటలను మొత్తం రికార్డ్ చేయాలని అధికారులకు ఆదేశం

### మంత్రి పొన్నం ప్రభాకర్



**అక్షర విజేత: చిగురుమామిడి :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో బీసీ సంక్షేమ రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. చిగురుమామిడి నుండి వస్తున్న వరద ప్రభావంతో సీతారాంపూర్ చౌరస్తా నుండి గ్రామం లోపల వరకు దెబ్బతిన్న రోడ్డు కూలిన విద్యుత్ స్తంభాలు,దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వరద ప్రభావంతో వరి పొలాల్లోకి పూర్తిక ఇసుక మేటలు వేయడంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం ఇందుర్తి కోహెడ మధ్య లోలెవెల్ బ్రిడ్జిపై నుండి వరద వెళ్తుండటంతో దానిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ ఇందుర్తి లో లెవెల్ బ్రిడ్జి లో పై నుండి వరద ఉదృతంగా ప్రవహిస్తుందనీ ఇది ఈ సంవత్సరంలో మూడు సార్లు ఇలా పై నుండి వరద పోతుందనీ ఇందుర్తి నుండి కోహెడ వెళ్ళే ఈరోడ్డు లో బ్రిడ్జి పై నుండి వరద వెళ్ళడం వల్ల రాకపోకలు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. త్వరలో ఇందుర్తి కోహెడ మధ్య హైలెవల్ బ్రిడ్జి మంజూరు చేస్తామన్నారు. రేపు ముఖ్యమంత్రి ఇక్కడికి వచ్చినప్పుడు ఈ బ్రిడ్జిపై రిప్రజెంటేషన్ ఇస్తామని తెలిపారు. వరదలకు కొట్టుకుపోయిన రోడ్లు ,నష్టపోయిన పంటలను మొత్తం రికార్డ్ చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. కరీంనగర్ జిల్లా కి సంబంధించి రైతులకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి,అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వకడే,సీపీ గౌస్ ఆలం ,హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి,ఇతర ముఖ్య నేతలు,అధికారులు పాల్గొన్నారు

# ఆదర్శ వృద్ధ అనాధాశ్రమంలో సతీష్ రెడ్డి తనయుని ఘనంగా జన్మదిన వేడుకలు





**అక్షర విజేత, కాప్రా :** మేడ్చల్ జిల్లా కాప్రా మండలం కాప్రా డివిజన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి, చిన్న కుమారుడు రేగళ్ల కరణ్ తేజ రెడ్డి, బుధవారం రాత్రి ఘనంగా పుట్టినరోజులు వేడుకలు నిర్వహించారు. స్థానిక ఆదర్శ వృద్ధ అనాధాశ్రమంలో పుట్టినరోజు జరుపుకున్నారు అనంతరం రేగళ్ల సతీష్ రెడ్డి చిన్నపిల్లలకు చిన్నప్పటినుండి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్క తల్లిదండ్రు పిల్లలకు నేర్పించాల్సింది గా కోరారు. పెద్దవారి ఆశీస్సులు తీసుకోవడం నిండు నూరేళ్లు అష్ట ఆయురారోగ్యాలతో కలకాలగా జీవించాలని వారు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బాల్ రెడ్డి,మన స్నేహం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అక్షర విజేత ఎఫెక్ట్.. బోర్డు అధికారుల్లో కదలిక..




**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో:** కంటోన్మెంట్ రోడ్లు,గుంతల పై అక్షర విజేత కథనానికి బోర్డు అధికారులు స్పందించారు. బోర్డు నామినేడ్ సభ్యురాలు, అధికారులు ఫణి కుమార్, ఉమా శంకర్ లు స్వయంగా వెళ్లి సమస్యను తెలుకున్నారు. సమస్యను పరిష్కారం చేసేందుకు హామీ ఇచ్చారు. గత 6 నెలలుగా ఈ సమస్య వాహనదారులకు నరకాన్ని చూపింది. మరోవైపు ట్రాఫిక్ మల్లింపు తో ఈ సమస్య మరింత తీవ్రంగా మారింది. ఇప్పటి కైనా ఈ సమస్యకు లభిస్తే ప్రయాణికులకు ఉపశమనం కలగనుంది. అటువైపు అధికారులు ప్రయత్నం చేస్తారా లేదా వేచి చూడాల్సి ఉంది.

# ట్రాఫిక్ చిక్కులకు చేక్.. కసరత్తు చేపట్టిన ట్రాఫిక్ అధికారులు..



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** ఎలివేటర్ కారిదార్ నిర్మాణంతో ట్రాఫిక్ చిక్కులకు చేక్ పెట్టేందుకు కసరత్తు చేసినట్లు ట్రాఫిక్ అధికారులు తెలిపారు. ప్యారడైస్ నుంచి మేడ్చల్ రోడ్డు వరకు పనులు ప్రారంభం కావడంతో దారి మళ్లించినట్లు ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణు గోపాల్ రెడ్డి, నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు వివరించారు. ఇక మేడ్చల్, నిజమాబాద్ నుంచి వచ్చే వాహనాలు తాడ్ బండ్ నుంచి మడ్ ఫోర్డ్ నుంచి డైమండ్ పాయింట్ మీదుగా కేజేఆర్ గార్డెన్ జూబ్లీ బస్టాండ్ కు మల్లించినట్లు స్పష్టం చేశారు. మరో రెండు రోజుల్లో ప్రయాణికుల చిక్కులు తప్పేలా కొన్ని మార్పులు చేర్పులు చేసి ప్రయాణం సజావుగా సాగేలా చర్యలు చేపట్టానున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో ట్రాఫిక్ పోలీసులు,అధికారులు, కంటోన్మెంట్ అధికారులు, హెచ్ఎండీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# మల్కాజ్‌గిరి లో వివాహ వేడుకలో కాంగ్రెస్ నాయకుల హాజరు



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని వెంకటాపురం డివిజన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పద్మా కుమార్తె భవాని పవన్ వివాహ వేడుక గురువారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదిస్తూ 135వ డివిజన్ కాంగ్రెస్ కార్పోరేటర్ కాంటెస్ట్ టి.ఎన్. సంజీవ్ కుమార్, రాష్ట్ర ఓబీసీ నాయకులు చిత్రాల సంతోష్ సాగర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాయికుమార్, నందకుమార్, మహిళా ఏ బ్లాక్ అధ్యక్షురాలు వీనస్ మేరీ, నాయకులు లావణ్య, ఆకాష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. వధూవరులు సుఖసంతోషాలతో జీవించాలని, వారి దాంపత్య జీవితం ఆనందంగా సాగాలని నేతలు ఆకాంక్షించారు.

## నాణ్యతలేని పాత ఎమ్మార్వో ఆఫీస్ రోడ్డు సైడ్ కాల్వలు

**రాత్రికి రాత్రే సైడ్ కాల్వల నిర్మాణం**



**అక్షర విజేత, గణపురం :** గణపురం మండల కేంద్రంలోని పాత ఎమ్మార్వో ఆఫీస్ వద్ద గోదాం , కస్తూర్బా హాస్టల్ బీసీ హాస్టల్, పీఎం శ్రీ మోడల్ స్కూలుకు వెళ్లే ప్రధాన రహదారి సైడ్ కాలువలు రాత్రికి రాత్రే నాణ్యత లేకుండా ప్రజలను బెదిరింపులకు గురి చేసి కట్టడం జరుగుతుందని ఎవరైనా ఈ రాత్రిపూట ఎందుకు పని జరుపుతున్నారని అడిగితే మీకేం అవసరం మా పని మేము చేసుకుంటాం మీరు ఇక్కడి నుంచి వెళ్లిపోండి అని బెదిరిస్తూ మా కాంట్రాక్టర్ మాకు అప్పగించిన పనిని మేము ఏ విధంగా చేయాలో మాకు తెలుసు అని ఆ రోడ్డుకు సంబంధించి ప్రయాణికులకు ఎలాంటి హెచ్చరికల బోర్డు లేకుండా పనులు కొనసాగిస్తున్నారు. గణపురం మండల కేంద్రంలో రాత్రిపూట శవయాత్ర జరుగుతున్న సమయంలో సైడ్ కాలువల నిర్మాణ పనులు కొనసాగిస్తూ ఆ కార్యక్రమానికి వెళ్లి వస్తున్న వారిని అక్కడ ఉన్న సిబ్బంది ఆపిమరి బెదిరిస్తున్నారు. ఇదేందని అడిగితే మేము ఇలానే చేస్తామని బాధ్యత రహితంగా మాట్లాడడం జరుగుతుంది. ఇలాంటి రాత్రి జరిగే పనులను అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని నాణ్యమైన సైడ్ కాలువలను నిర్మించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## గ్రామాల్లో నీట మునిగిన వరి,పత్తి పంటలను పరిశీలించిన సిపిఐ,బిఆర్ఎస్ నాయకులు

**తుఫాన్ తో నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి**



**అక్షర విజేత:చిగురుమామిడి :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని 17 గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలకు రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని,ప్రభుత్వం వెంటనే సర్వే చేసి బాధితులను అన్ని విధాల ఆదుకోవాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం మండలంలోని పలు గ్రామాల్లో వర్షాలకు నేలకొరిగిన వరి పంటలను,పత్తి, మొక్కజొన్న పంటలను,దెబ్బ తిన్న రహదారులను,వరదలో కొట్టుకపోయి మృతి చెందిన పాడి పశువులను,వాగులు వంకలను పరిశీలించారు.అనంతరం సిపిఐ,బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రేకొండ గ్రామంలో గందె రాజేశ్వరి,దుడ్డేల లక్ష్మీనారాయణ,రొంటాల రాజయ్య,గుర్రాల మహేందర్ రెడ్డి ల పంట పొలాలను పరిశీలించినట్లు చెప్పారు.ఏరుకొండ రమేష్ కు చెందిన 4 ఆవులు వాగులో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించినట్లు చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామాల్లో నష్టపోయిన రైతుల పంట వివరాలు సర్వే చేసి బాధిత రైతులను వెంటనే అన్ని విధాల ఆదుకోవాలని కోరారు.నష్టపోయిన వరి పంటకు ఎకరాన 50వేలు,పత్తి పంటకు 40వేలు,మొక్కజొన్న పంటకు 30వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.రేకొండ నుండి ఎక్లాస్ పూర్ వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మించేందుకు మాజీఎమ్మెల్యే సతీష్ కుమార్ 2కోట్ల 27లక్షలు మంజూరు చేస్తే 2సంవత్సరాలు అవుతున్న అతి గతి లేదని మండిపడ్డారు.రేకొండ గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుపోయిందని ప్రజలను పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య,సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ముద్రకోల రాజయ్య,రైతు సంఘం మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి జైపాల్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మామిడి రాజేశ్వరి,అల్లెపు సంపత్,సిపిఐ మండల సహాయ కార్యదర్శి పైడిపల్లి వెంకటేష్, బోయిని పటేల్, మొగిలి ఓదెలు, విలాసాగరం అంజయ్య, తమ్మిశెట్టి రవీందర్,మాజీ ఎంపీటీసీ పరకాల కొండయ్య, తదితరులు ఉన్నారు.

## ముంపుకు గురైన రోడ్లు కాలువలు

**వెంటనే మరమ్మతులు చేయాలి**

**దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్**





**అక్షరవిజేత, దేవరకొండ టీ** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దేవరకొండ నియోజకవర్గంలో అనేక ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. గ్రామాలు, వ్యవసాయ భూములు, రహదారులు మౌలిక సదుపాయాలు తీవ్ర నష్టానికి గురయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ ముంపు ప్రభావిత ప్రాంతాలను సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు పర్యటన అనంతరం ఆయన ఆర్డీవో రమణా రెడ్డి ఆధ్వర్యంలో దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాలతో కలిగిన నష్టాలపై సమగ్ర వివరాలను అడిగి, త్వరితగతిన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు ఈ సందర్భంగా వర్షాల వల్ల ముంపుకు గురైన ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని, బాధితులకు అవసరమైన ఆహారం, త్రాగునీరు, వైద్య సదుపాయాలు అందేలా చూడాలని అధికారులకు సూచించాను. అదేవిధంగా బాధితులకు నష్టపరిహారం చెల్లించడానికి అవసరమైన చర్యలను త్వరగా పూర్తి చేయాలని ఆయన అన్నారు అదేవిధంగ ముంపు కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, వంతెనలను గుర్తించి, శాశ్వత పరిష్కార మార్గాలను రూపొందించాలని సూచించారు విద్యుత్ సరఫరా ఎక్కడా నిలిచిపోకుండా ఎలక్ట్రిసిటీ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు వ్యవసాయ పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి రైతులకు తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన మొత్తం నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి జిల్లాకు పంపాలని ఆదేశించారు వర్షాల కారణంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను వేగవంతంగా పునః ప్రారంభించాలని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునా మాధవరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, ఆర్డీవో రమణా రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## తుఫాన్ నష్టాలపై ఈటల రాజేందర్ ఆగ్రహం

**రైతుల కన్నీళ్లపై నిర్లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం**



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** తాజా తుఫాన్ కారణంగా తెలంగాణ రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా విమర్శించారు. షామీర్పేట్ ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీఎం దండాలు వసూలు పక్కనపెట్టి ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. తుఫాన్ ప్రభావంతో పత్తి, వరి, మక్క పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, రోడ్లు ధ్వంసమయ్యినా ఇప్పటివరకు మరమ్మతులు జరగలేదని అన్నారు. భీమదేవరపల్లి మండలంలో 41 సెంటీమీటర్ల వర్షం పడింది, వరంగల్‌లో పలు ప్రాంతాలు ఆరు అడుగుల నీటిలో మునిగిపోయాయి, రైతులు కన్నీళ్లతో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం స్వయంగా ప్రజలను ఆదుకుంటున్నారని, కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం అధికార రాజకీయాలకే పరిమితమైందని ఆయన విమర్శించారు.

## ఘనంగా గడ్డం అబుల్ జన్మదిన వేడుకలు



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** రాజ్యాంగం అందించిన ఫలాలు అందరికి చేరాలని, అందరు సమానంగా ఎదగాలని గడ్డం అబుల్ తెలిపారు. ఒక వైపు అడ్వాకెట్ గా మరోవైపు కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రెసిడెంట్ గా పనిచేస్తూ ప్రజా గొంతుకగా నిలిచారు. ఆయన పుట్టిన రోజు వేడుకలను బోయినిపల్లి లోని జాతీయ మానవ హక్కుల సంఘము కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు. అబుల్ ను ఆయన మిత్రులు, అభిమానులు సహలువతో సన్మానించి కేక్ కాట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మహిళా సంఘం అధ్యక్షురాలు గండి మాదవి, ఉపాధ్యక్షురాలు గోమతి కోనాపూర్,గ్రేటర్ హైదరాబాదు జనరల్ సెక్రటరీ బొడ్డు వాసంతి, ఎస్.సి.బి మహేందర్, నగేష్, బాబు రావు, ఎన్.హెచ్.ఆర్.ఎస్ జస్టిస్ కమిషన్ ఉపాధ్యక్షుడు అశోక్, కోలాపూర్ గోమతి, బీ.వాసంతి తదితరులు పాల్గొన్నారు..

## మర్కూక్ పోలీస్ ఆధ్వర్యంలో ఏక్తా దివాస్ రన్ ఫర్ యూనిటీ

**మండల ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

**మర్కూక్ ఎస్సై దామోదర్**



**అక్షర విజేత గజ్వేల్ :** అక్టోబర్ 31వ తేదీ శుక్రవారం నేడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా సిద్దిపేట కమిషనర్ ఆదేశాలనుసారం మర్కుక్ మండల ప్రాంతంలో ఏక్తా దివాస్ సందర్భంగా రన్ ఫర్ యూనిటీ అనే కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 6 గంటలకు ప్రారంభించడం జరుగుతుంది అని మర్కూక్ ఎస్సై దామోదర్ తెలిపారు.ఈ కార్యక్రమం మర్కూక్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రారంభమై పోలీస్ స్టేషన్ ముందర ముగుస్తుంది అని,ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు ప్రజా నాయకులు,విద్యార్థిని,విద్యార్థులు ఇతర ప్రజానీకం అందరు కూడా టీ షర్ట్ ట్రాకర్ వేసుకుని పాల్గొనవలసిందిగా తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో మండల ప్రజలు అందరూ కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా మర్కుక్ ఎస్సై దామోదర్ తెలిపారు.

## వాగులో కొట్టుకుపోయి మహిళ మృతి


**తండ్రి అస్తికలు గంగలో కలపడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన మహిళ.**



**అక్షర విజేత, ఇబ్రహీంపట్నం :-** బాటసింగారం వద్ద బ్రిడ్జి దాటుతుండగా ప్రమాదం ప్రమాదవశాత్తు వాగులో పడి కొట్టుకుపోయిన మహిళ మృతి చెందింది. చనిపోయిన మహిళ భువనగిరి కి చెందిన కృష్ణవేణి గా గుర్తింపు ప్రమాదం నుండి ఆమె భర్త బయటపడ్డాడు. చనిపోయిన మహిళ నెర్రెపల్లి మాజీ సర్పంచ్ తిరందాస్ రవీందర్ కూతురు అనారోగ్యంతో గత శనివారం మాజీ సర్పంచ్ రవీందర్ మృతి చెందారు. తండ్రి అస్థికలు గంగలో కలపడానికి వచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదంలో కృష్ణవేణి మరణించింది. ఐదు రోజుల వ్యవధిలో తండ్రీకూతుళ్ల మృతితో నెర్రెపల్లిలో విషాదచాయలు అల్లుకున్నాయి.

## బాచుపల్లి ఎమ్మార్వో వాణి రెడ్డి ఉక్కు పాదం





**అక్షర విజేత, దుండిగల్ :-** కుత్బుల్లాపూర్ బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్‌లోని సర్వే నంబర్లు 290, 292, నిజాంపేట్‌లోని సర్వే నెంబర్ 191 వద్ద ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు తీసుకున్నారు.కొత్తగా బాచుపల్లి ఎమ్మార్వోగా బాధ్యతలు స్వీకరించిన వాణి రెడ్డి మొదటి రోజే అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోపుతూ కూల్చివేతలు నిర్వహించారు. ఈ చర్యతో ప్రభుత్వ భూములపై అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారికి గట్టి హెచ్చరిక పంపినట్లైంది.ఈ సందర్భంగా ఆకుల సతీష్ ఎమ్మార్వో వాణి రెడ్డికి మరియు రెవెన్యూ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు కొనసాగించాలని ఆయన కోరారు ప్రభుత్వ భూముల రక్షణలో వాణి రెడ్డి కఠిన చర్యలు ప్రజల మన్ననలు పొందుతున్నాయి.

## నియమ నిబంధనలు పాటించని బస్సులకు జరిమానా

**తొమ్మిది బస్సులకు 52,900 జరిమానా**

**ఒక స్కూల్ బస్సు సీజ్**











**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, ఇన్స్పెక్టర్ ప్రసాద్, సౌత్ రూరల్ సీ.ఐ సురేష్, ఆరవ టౌన్ ఎస్ హెచ్ ఓ వెంకట్రావు ఆర్టీవో అధికారులతో స్కూల్ బస్సులు, ట్రావెల్ బస్సులను తనిఖీ చేశారు.నగరంలోని ఆరవ టౌన్ పరిధిలో గల డైరీ ఫార్మ్ కమాన్ వద్ద స్కూల్ బస్సులు, ట్రావెల్ బస్సులను తనిఖీ చేసి నియమాలను పాటించని తొమ్మిది బస్సులకు రూ. 52,900/- జరిమానా, ఒక స్కూల్ బస్సును సీజ్ చేశారు. ఈ తనిఖీలలో బస్సులలో ఎమర్జెన్సీ డోర్లు సరిగా పనిచేయకపోవడం, అగ్నిమాపక నిరోధక పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ లేకపోవడం, సరియైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం గమనించారు. ప్రతి స్కూల్ బస్సు, ట్రావెల్ బస్సులు ప్రమాదం జరగకుండా, ప్రమాద బారిన పడితే ప్రయాణికులు రక్షించడం కోసం కావలసిన వస్తువులు, అత్యవసర ద్వారం గుండా బయటకు వెళ్లే విధంగా సౌకర్యాలు కలిగి ఉండాలన్నారు. లేనియెడల నియమాలు పాటించని బస్సుల పైన చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడునని అధికారులు హెచ్చరించారు.

## భారతీయ సినీ మంథన్ బెనెగల్



శ్యాం బెనెగల్.. ఈ పేరు తెలియని సినిమా అభిమాని ఉండరనడంలో అనుమానం లేదు. ఆయన భారతీయ సినిమాకు అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రముఖ దర్శకుడు. 'అంకుర్, నిషాంత్, మంథన్, భూమిక' చిత్రాలతో సినీ రంగంలో కొత్త ఒరవడిని సృష్టించారు. అంతర్జాతీయ చిత్ర పరిశ్రమకు ఎన్నో సేవలందించిన ఆయన అనారోగ్యంతో నిన్న సాయంత్రం ముంబైలో మరణించారు. 2019లో శ్యాం బెనెగల్‌ను ముంబైలో కార్టూనిస్టు చిలువేరు మృత్యుంజయ్ ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా ఆయనతో బెనెగల్ గత జ్ఞాపకాలను పంచుకున్నారు. 1985లో తీసిన సుస్మన్ సినిమా చిత్రీకరణ సందర్భంలో చిలువేరు రామలింగంతో ఉన్న మధురమైన జ్ఞాపకాలను యాదిచేసుకున్నారు. ఆ ఇంటర్వ్యూ 2019, నవంబర్ 3న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైంది. శ్యాం బెనెగల్‌కు నివాళిగా ఆ ఇంటర్వ్యూ యథాతథంగా ముంబైలో థాడ్‌దేవ్ రోడ్డు. ఎవరెస్టు బిల్డింగ్.. రెండో ఫ్లోర్‌లో ఆఫీసు.. లోపలికి వెళ్లగానే ఎడమవైపు.. పెద్ద సుస్మన్ సినిమా పోస్టర్.. కుడివైపు అంకుర్ నిషాంత్ పోస్టర్లు. కొంచెం ముందుకువెళ్లి డోర్ తీయగానే దర్శకుడు శ్యాం బెనగల్. అభిముఖంగా తపస్సు చేసుకుంటున్నట్టున్నారు. ఒంటరిగా 85 ఏండ్ల వయసులో ఎంతో ఎనర్జెటిక్‌గా కనిపిస్తున్నారు. చుట్టూ బోలెడు పుస్తకాలు, కాగితాలు, ఫొటోల మధ్య షేక్ ముజీబుర్ రెహ్మాన్ లైఫ్‌స్టోరీ మీద స్క్రిప్ట్ రాసుకునే పనిలో ఉన్నారు. ముజీబుర్ రెహ్మాన్ కూతురు ప్రస్తుత బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా రిక్వెస్ట్ మీద ఈ సినిమా తీసే పనిలో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఈ పని తప్ప వేరే ధ్యాస లేదు. అయినప్పటికీ సుమారు గంటన్నర సమయం కేటాయించారు. సినిమా, తెలంగాణ పల్లె,హైదరాబాద్, భాష రకరకాల అంశాల మీదసుదీర్ఘమైన జ్ఞాపకాలను పంచుకున్నారు. 1985లో భూదాన్ పోచంపల్లిలో, అలాగే ముక్తాపూర్ గ్రామంలో నేత కార్మికుల ఇతివృత్తం మీద తీసిన సినిమాను బెనగల్‌కు గుర్తుచేశాను. అప్పుడు నేను ఐదో తరగతి. చేనేత కార్మికుల సమస్యలు, సహకార సంఘాల వైఫల్యం, దళారుల దౌర్జన్యంతో అరుదైన చేనేత కళ ఎలా చితికిపోతున్నదో సుస్మన్ సినిమా చూపెడుతుంది. ఆ సినిమా షూటింగ్ కోసం ఓంపురి, షబానా అజ్మీ, పల్లవి జోషి.. మా ఇంట్లోనే రిహార్సల్స్ చేసేవారు. మా ఇంట్లోనే బస. మా వీధి జాతరలా ఉండేది. బట్టలపై రాజకీయ నేతలను నేయడం, కొత్త డిజైన్లను సృష్టించడం, కుట్టులేకుండా మూడు కొంగుల చీర, సుస్మన్ సినిమా కోసం పచ్చీసు కుర్తా పైజామా, మగ్గంపై నేసే నేత కళాకారుడైన మా నాయన చిలువేరు రామలింగం సహాయం ఎలా తీసుకున్నారో శ్యాంబెనగల్ చెప్తూ పోయారు. సుస్మన్ స్క్రిప్ట్ వర్క్ మా ఇంట్లో కూడా జరిగింది. సుస్మన్ సినిమా ప్రధాన పాత్రధారుడు ఓంపురికి మా నాయన మగ్గం నేయడం నేర్పించడమే కాకుండా, ఓంపురి పాత్రకు మా నాయనను రిఫరెన్స్‌గా తీసుకున్న విషయం చెప్పారు. బోనాల పండుగ రోజు మా నాయన బండి మీద మగ్గం నేస్తూ గుడికి వెళ్లేలోపు చీర పూర్తిచేసి అమ్మవారికి అప్పటికప్పుడే కట్టించే మా ఊరి సంప్రదాయాన్ని సుస్మన్ సినిమాలో ఓంపురికి అన్వయిస్తూ చిత్రీకరించిన విషయం కూడా ప్రస్తావనకు వచ్చింది. బెంగాల్ నుంచి మృణాల్‌సేన్, సత్యజిత్ రాయ్, కేరళ నుంచి ఆదూర్ గోపాలకృష్ణన్ కన్నడ నుంచి పట్టాభి రామిరెడ్డి (సంస్కార చందమార్త ఫేం), గిరీశ్ కాసరవల్లి, గిరీశ్ కర్నాడ్.. ఈ కోవకు చెందిన సూపర్ క్లబ్ డైరెక్టర్లు అద్భుతమైన ఆర్ట్ ఫిల్మ్‌లను తీస్తున్నారు. అవి ఇంటెలెక్చువల్ సినిమాలు. మామూలు ప్రేక్షకులకు ఎన్నటికీ చేరలేవు. ఇటు డబ్బు దండుకునే పక్కా కమర్షియల్ సినిమాలు, ఫైట్లు, క్లబ్ డాన్సులు, బూతు పాటలతో వేడి వేడి పకోడిలా జనాలను ఊపేస్తున్న కాలం అది. అంత ఆర్టూ పనికి రాదు. ఇంత పచ్చి వ్యాపార సెక్సిజమూ కూడదు. మధ్యే మార్గం ఉందా? కచ్చితంగా ఉంది. ఆ మిడిల్ ఆఫ్ ద రోడ్ ఫిల్మ్‌ను, టెక్నిక్‌ను కనిపెట్టినవారు శ్యాంబెనగల్. అప్పటిదాకా యాడ్ ఫిల్మ్ తీసుకుంటున్న శ్యాంబెనగల్‌ను గుజరాత్ వైట్ రెవొల్యూషన్ పితామహుడు వర్గీస్ కురియన్ పిలిచారు. ఇక్కడ కో-ఆపరేటివ్ పద్ధతిలో పాలు సేకరించి, నెయ్యి, స్వీట్లు, పాలు మార్కెటింగ్ చేస్తున్నాం. దీన్ని ప్రమోట్ చేస్తూ తక్కువ బడ్జెట్‌లో ఒక ఫిల్మ్ చేయగలవా అని అడిగారు. లెక్కలు వేసిన శ్యాం బెనగల్ ఆరు లక్షలు ఖర్చవుతుందన్నారు. గుజరాత్ కో-ఆపరేటివ్ రైతుల నుంచి తలా ఓ రూపాయి సేకరించి కురియన్.. శ్యాం బెనగల్‌కు ఆరు లక్షలు ఇచ్చారు. దాని ఫలితమే మంథన్ అనే గొప్ప సినిమా. మంథన్ అంటే చిలకడం. దాంట్లో స్మితా పాటిల్ హీరోయిన్. బహుశా అది ఆమె తొలి సినిమా అయి ఉంటుంది. అంకుర్, నిషాంత్‌లతో న్యూ వేవ్ పితామహుడిగా శ్యాం బెనగల్ పేరొందారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్ డీఏ 2 శాతం పెంపుకు కేబినెట్ ఆమోదం



కేంద్ర ప్రభుత్వంలోని ఉద్యోగులకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డియర్‌నెస్ అలవెన్స్ (కరవు భత్యం) 2 శాతం పెంచింది. డీఏ పెంపు ప్రతిపాదనలకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్రవేసింది. తాజా నిర్ణయంతో జూలై ఒకటి నుంచి చెల్లించాల్సిన డియర్‌నెస్ అలవెన్స్ రేటు 53శాతం నుంచి 55శాతానికి పెరిగింది. కేంద్రం నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వంలోని దాదాపు కోటిమందికిపైగా ఉద్యోగులకు లబ్ధి చేకూరనున్నది. ఇందులో 48లక్షల మంది ఉద్యోగులు, 67లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు. ప్రస్తుతం 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం ఉద్యోగుల జీతభత్యాలు నిర్ణయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది. ఇది జనవరి, జూలైల్లో జరగాల్సి ఉన్నప్పటికీ ఏటా మార్చి, అక్టోబరులో ప్రకటిస్తూ వస్తోంది. ఆలస్యంగా ప్రకటించినా.. బకాయిలతో కలిపి జనవరి, జూలై నుంచే చెల్లిస్తారు. ముఖ్యంగా డీఏ సవరణ కోసం ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్‌ను ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఇదే ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. గతేడాది అక్టోబర్‌లో దీపావళి కానుకగా డీఏ 3 శాతం పెంచిన విషయం తెలిసిందే. కేంద్రం డీఏను సరవించిన నేపథ్యంలో రాష్ట్రాలు సైతం తమ ఉద్యోగులకు ఆ మేరకు డీఏ పెంచే అవకాశం ఉంటుంది.

# 1 ముకేశ్ 2 అదానీ

### రూ.8.6 లక్షల కోట్ల సంపదతో ఆసియా శ్రీమంతుడు
### రూ.8.4 లక్షల కోట్లతో ఆ తర్వాతి స్థానంలో గౌతమ్
### దేశ జీడీపీలో మూడోవంతు 284 మంది కుబేరుల సంపద
### హురున్ ఇండియా జాబితాలో వెల్లడి..





తెలుగు టాప్-10 శ్రీమంతుల జాబితా

| ర్యాంక్ | పేరు | సంపద(బిలియన్ డాలర్లలో) |
|---|---|---|
| 280 | మురళి దివిస్ | 10 |
| 600 | పీ పిచ్చి రెడ్డి | 5.8 |
| 625 | పీవీ కృష్ణా రెడ్డి | 5.6 |
| 1122 | ప్రతాప్ రెడ్డి | 3.3 |
| 1122 | పీవీ రాంప్రసాద్ రెడ్డి | 3.3 |
| 1198 | పీ పార్థసారథి రెడ్డి | 3.1 |
| 1624 | కే సతీష్‌రెడ్డి | 2.3 |
| 1796 | ఎస్ సుబ్రమణ్య రెడ్డి | 2.1 |
| 1796 | పీ వెంకటేశ్వర రెడ్డి | 2.1 |
| 1796 | ఎం సత్యనారాయణ | 2.1 |

దేశీయ శ్రీమంతుడు ముకేశ్ అంబానీ సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. గడిచిన ఏడాదికాలంలో ఆయన సంపద 13 శాతం తరిగిపోయి రూ.8.6 లక్షల కోట్లకు పరిమితమైనట్లు ప్రస్తుత సంవత్సరానికిగాను హురున్ ఇండియా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అయినప్పటికీ దేశీయ శ్రీమంతుల జాబితాలో తొలిస్థానంలో నిలిచినట్లు పేర్కొంది. కానీ, ప్రపంచవ్యాప్తంగా 100 బిలియన్ డాలర్ల సంపద కలిగిన కుబేరుల జాబితా నుంచి వైదొలిగినప్పటికీ ఆసియా కుబేరుడిగా కొనసాగుతుండటం విశేషం. కానీ, ఇదే సమయంలో అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ లక్ష కోట్ల రూపాయల సంపదను పోగేసుకొని ఈ జాబితాలో రెండో స్థానంలో నిలిచినట్లు నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది జనవరి 15తో ముగిసిన ఏడాదికాలంలో గౌతమ్ అదానీ రూ.8.4 లక్షల కోట్ల సంపదను కలిగివున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం భారత్‌లో 284 మంది బిలియనీర్లు ఉండగా, వీరి సంపద ఏడాది ప్రాతిపదికన 10 శాతం ఎగబాకి రూ.98 లక్షల కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. లేదా దేశ జీడీపీలో మూడోవంతు వీరివద్ద ఉన్నది.

**చైనాను అధిగమించిన భారత్...**

భారత్ మరో రికార్డు సృష్టించింది. కుబేరుల సరాసరి సంపదలో తన పొరుగు దేశమైన చైనాను అధిగమించి రికార్డు నెలకొల్పింది. భారత్‌లో ఒక్కొక్కరి సంపద రూ.34,514 కోట్లు కాగా, అదే చైనాలో ఇది రూ.29,027 కోట్లుగా ఉన్నది. మరోవైపు, 175 మంది బిలియనీర్ల సంపద పెరగగా, 109 మంది సంపద హరించుకుపోయింది.

**ప్రపంచ కుబేరుడిగా ఎలాన్ మస్క్....**

టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 420 బిలియన్ డాలర్ల వ్యక్తిగత సంపదతో ప్రపంచ కుబేరుల జాబితాలో తొలిస్థానంలో నిలిచారు. గడిచిన ఏడాదికాలంలో ఈ సంస్థ అంచనాలకుమించి రాణించడం వల్లనే సంపద భారీగా పెరగడానికి ప్రధాన కారణం. అలాగే ఈ జాబితాలో 266 బిలియన్ డాలర్లతో అమెజాన్ ఫౌండర్ జెఫ్ బెజోస్ రెండో స్థానంలో నిలువగా.. మెటా కో-ఫౌండర్, సీఈవో మార్క్ జుకర్‌బర్గ్(242 బిలియన్ డాలర్లు), ఒరాకిల్ కో-ఫౌండర్ ల్యారీ ఎల్లిసన్(203 బిలియన్ డాలర్లు), బర్క్‌షైర్ హ్యాథ్‌వేస్ సీవో వారెన్ బఫెట్(167 బిలియన్ డాలర్లు) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు.

## రాణించిన బ్యాంకింగ్ షేర్లు లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. ఆటో దిగుమతులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించడంతో మార్కెట్లు గురువారం ఉదయం నష్టాల్లో మొదలయ్యాయి. బ్యాంకింగ్ రంగంలో కొనుగోళ్లు కనిపించాయి. ఆటో, ఫార్మా, టెలికాం షేర్లు సహా మిగతా అన్నిరంగాల సూచీలు లాభాల్లోనే ట్రేడయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 77,087.39 పాయింట్ల వద్ద నష్టాల్లోనే మొదలైంది. ఇంట్రాడేలో 77,082.51 పాయింట్ల కనిష్ఠానికి చేరుకున్న సెన్సెక్స్.. గరిష్ఠంగా 77,747.46 పాయింట్లకు పెరిగింది. చివరలో 317.93 లాభంతో 77,606.43 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 105.10 పాయింట్లు లాభపడి 23,591.95 వద్ద స్థిరపడింది. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం పెరగ్గా.. స్మాల్ క్యాప్ ఇండెక్స్ దాదాపు ఒకశాతం వృద్ధిని నమోదు చేసింది. ట్రంప్ టారిఫ్‌లపై అనిశ్చితి కారణంగా ఫార్మా స్టాక్స్ ఒత్తిడికి గురయ్యాయి. ఆటో ఒకశాతం తగ్గగా.. ఫార్మా 0.4శాతం పతనమైంది. ఇక మిగతా అన్నిరంగాల సూచీలు పెరిగాయి. మీడియా, చమురు, గ్యాస్, రియాల్టీ ఒక్కొక్కటి ఒక శాతం వరకు పెరిగాయి. నిఫ్టీలో హీరో మోటోకార్ప్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎన్‌టీపీసీ లాభాలను ఆర్జించగా.. టాటా మోటార్స్, సన్ ఫార్మా, ఐషర్ మోటార్స్, మారుతి సుజుకి, భారతి ఎయిర్‌టెల్ నష్టపోయాయి. సోనా బీఎల్‌డబ్ల్యూ, హ్యాపీయెస్ట్ మైండ్స్, మెట్రో బ్రాండ్స్, మహీంద్రా లైఫ్, బజాజ్ ఎలక్ట్రికల్స్, జెన్సోల్ ఇంజినీరింగ్, వక్రంగీ, టీసీఐ ఎక్స్‌ప్రెస్, శివ సిమెంట్, రోలెక్స్ రింగ్స్, ఎక్స్‌ప్లియో సొల్యూషన్, బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్, సుయోగ్ టెలి, గెలాక్సీ సర్ఫ్యాక్టెంట్స్ తదితర 460 స్టాక్‌లు బీఎస్‌ఈలో 52 వారాల కనిష్ఠ స్థాయికి చేరుకుంది.

# ట్రంప్ దెబ్బకు ఆటో విలవిల.. దిగుమతయ్యే వాహనాలపై 25 శాతం సుంకం

### వచ్చే వారం నుంచి అమల్లోకి కొత్త పన్ను




అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనిచేశారు. విదేశాల్లో తయారై అమెరికాకు దిగుమతయ్యే కార్లపై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు తాజాగా ప్రకటించారు. కానీ, అమెరికాలో తయారైన కార్లపై ఎలాంటి సుంకం ఉండదని స్పష్టంచేయడం విశేషం. ఈ సుంకం పెంపు వచ్చే వారం నుంచి అమలులోకి రానున్నట్లు ప్రకటించారు. ఇది శాశ్వతమైన చర్యగా పేర్కొన్న ఆయన.. దీంతో అమెరికా ఆర్థిక వ్యవస్థకు ప్రతియేటా 100 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరనున్నదని పేర్కొన్నారు. ఈ నిర్ణయం విదేశీ ఆటోమొబైల్ సంస్థలకు షాకిచ్చినట్లు అయింది. దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ట్రంప్ సుంకాల పెంపును తెరపైకి తీసుకొస్తున్నారు. ఇతర దేశాల నుంచి దిగుమతయ్యే ఏ వస్తువుపైన 25 శాతం సుంకం విధించనున్నట్లు గతంలోనే పేర్కొన్నారు.

**ప్రాణసంకటంగా ఆటోమొబైల్...**

ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో విదేశీ ఆటోమొబైల్ సంస్థల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. యూఎస్‌కు ఎగుమతి చేయాలంటే అధికంగా పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ధరలు పెంచాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఒకవేళ ధరలు పెంచితే వాహన అమ్మకాలు పడిపోయే ప్రమాదం ఉన్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అమెరికా మార్కెట్లో సరాసరి కారు ధర 49 వేల డాలర్లు ఉండగా, త్వరలో భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇతర దేశాల నుంచి దిగుమతయ్యే కారుపై విధిస్తున్న సుంకం 12,500 డాలర్లకు ఎగబాకనున్నది. ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో దేశీయ ఎగుమతులపై నీలినీడలు కమ్ముకోనున్నది. ప్రతియేటా భారత్ నుంచి 7 బిలియన్ డాలర్ల విలువైన కార్లు అమెరికాకు ఎగుమతి అవుతుండగా..తాజా నిర్ణయంతో ఆయా సంస్థలు వెనక్కితగ్గే అవకాశాలున్నాయి. ప్రధానంగా యూఎస్ మార్కెట్లో పాగావేసిన టాటా మోటర్స్ అనుబంధ సంస్థ జేఎల్‌ఆర్‌పై ఈ ప్రభావం అధికంగా పడనున్నది. బ్రిటన్ ప్లాంట్లో తయారైన జేఎల్‌ఆర్ వాహనాలను ప్రతియేటా లక్షల వాహనాలను అమెరికాకు ఎగుమతి చేస్తుండటమే ఇందుకు కారణం. సుంకాల పెంపు ప్రతిపాదనపై వాహన సంస్థలతోపాటు వాహన విడిభాగాల తయారీ సంస్థలు కూడా ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఈ టారిఫ్ బాదుడుతో తమ ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం చూపనున్నాయని వారు వాపోతున్నారు. 2024లో భారత్ నుంచి 2.2 బిలియన్ డాలర్ల విడిభాగాలు అమెరికాకు ఎగుమతి అయ్యాయి.

**కుప్పకూలిన ఆటో షేర్లు...**

ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో దేశీయ ఆటోమొబైల్ రంగ షేర్లు కుప్పకూలాయి. టాటా మోటర్స్ షేరు అత్యధికంగా 5.50 శాతం నష్టపోయింది. దీంతోపాటు అశోక్ లేలాండ్ 2.77 శాతం తగ్గగా, ఐచర్ మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, అపోలో టైర్స్ షేర్లు పతనం చెందాయి. మొత్తంగా ఆటో ఇండెక్స్ ఒక్క శాతం తగ్గి 48,220.85కి పడిపోయింది. వీటితోపాటు వాహన విడిభాగాల తయారీ సంస్థల షేర్లు కూడా ఒత్తిడికి గురయ్యాయి. సోనా బీఎల్‌డబ్ల్యూ షేరు 5.89 శాతం నష్టపోగా, సంవర్ధన్ మథర్‌సన్ ఇంటర్నేషనల్ 2.22 శాతం, భారత్ ఫోర్జ్ 2.30 శాతం, ఏఎస్‌కే ఆటోమోటివ్ లిమిటెడ్ 1.83 శాతం, రామ్‌కృష్ణ ఫోర్జింగ్స్ షేర్లు పతనం చెందాయి.

**సుంకాలను తగ్గిస్తాం: భారత్...**

కొన్ని అమెరికా ఉత్పత్తులపై సుంకాలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తంచేసింది. అయితే అగ్రరాజ్యం అమెరికా ఒత్తిడికి తలొగ్గి ఈ నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టంచేశాయి. 23 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు ప్రతియేటా భారత్ దిగుమతి చేసుకుంటున్నది. ఇరు దేశాల మధ్య జరిగిన ఒప్పందంలో భాగంగా దిగుమతి చేసుకునే వస్తువులపై టారిఫ్‌ను 55 శాతం వరకు తగ్గించడానికి భారత్ అంగీకరించినట్లు ప్రభుత్వ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి.

# హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ టాప్-10లో అంబానీకి దక్కని చోటు అదానీ ఏ స్థానంలో ఉన్నారంటే..!



హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్-2025 టాప్-10 సంపన్నుల జాబితాలో ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అబానీ స్థానం కోల్పోయారు. గత సంవత్సరంతో పోలిస్తే పెరిగిన అప్పుల కారణంగా అంబానీ సంపద రూ.లక్ష కోట్లు తగ్గింది. దాంతో ఆయన టాప్-10 నిష్క్రమించగా.. ఆసియాలో అత్యంత సంపన్నుడిగా తన స్థానాన్ని ఆయన నిలబెట్టుకున్నారు. ఈ జాబితాలో టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ అత్యంత సంపన్నుడిగా కొనసాగుతున్నారు. ఆయన మొత్తం సంపద ఊహించని విధంగా 82శాతం పెరిగి.. 420 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇక 266 బిలియన్ డాలర్ల సంపదతో అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్ రెండోస్థానంలో ఉన్నారు. 242 బిలియన్ డాలర్లతో మెటా సీఈవో జుకర్‌బర్గ్ మూడో స్థానంలో ఉన్నారు. మరో వైపు రూ.3.5లక్షల కోట్ల సంపదతో హెచ్‌సీఎల్‌కు చెందిన రోష్నీ నాడార్.. టాప్-10 సంపన్న మహిళల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఆమె తండ్రి శివ్ నాడార్ ఇటీవల హెచ్‌ఎస్‌ఎల్ 47శాతం వాటాను ఆమె పేరిట బదిలీ చేయడంతో ఐదో స్థానానికి చేరుకున్నారు. టాప్-10 జాబితాలో చోటు కోల్పోయిన ముఖేశ్ అంబానీ.. ఆసియాలో సంపన్నుడిగా కొనసాగుతున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇంధన, రిటైల్ వ్యాపారాలతో ఇబ్బందిపడుతున్నది. నష్టాల నేపథ్యంలో రిలయన్స్ గ్రూప్ చైర్మన్ సంపద తగ్గింది. అలాగే, హురున్ జాబితాలో భారత్‌లో అంబానీ కుటుంబం తొలి స్థానంలో నిలిచింది. సంపద 13 శాతం తగ్గినా.. రూ.8.6 లక్షల కోట్లుగా ఉన్నది. ఆ తర్వాత గౌతమ్ అదానీ కుటుంబం రెండో స్థానంలో నిలిచింది. గత సంవత్సరంలో అదానీ నిరకర విలువ దాదాపుగా రూ.లక్ష కోట్లు పెరిగింది. ప్రస్తుతం అదానీ కుటుంబం ఆస్తులు రూ.8.4లక్షల కోట్లు. రోష్నీ నాడార్ కుటుంబం (రూ.3.5లక్షల కోట్లు), సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్‌కు చెంది దిలీప్ సంఘ్వీ కుటుంబం రూ.2.5 లక్షల కోట్లుగా ఉన్నది. ఆయన సంపద 21శాతం పెరగడంతో ఈ జాబితాలో ఐదోస్థానంలో నిలిచారు. అజీమ్ ప్రేమ్‌జీ కుటుంబం (రూ.2.2 లక్షల కోట్లు), కుమార మంగళం బిర్లా కుటుంబం (రూ.2.0లక్షల కోట్లు) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. సైరస్ పూనావాలా కుటుంబం (రూ.2లక్షల కోట్లు), నీరజ్ బజాజ్ ఫ్యామిలీ (రూ.1.6 లక్షల కోట్లు), రవి జైపురియా కుటుంబం (రూ.1.4 లక్షల కోట్లు) , రాధా కిషన్ దమానీ కుటుంబం (రూ.1.4లక్షల కోట్లు)తో టాప్-10లో చోటు దక్కించుకున్నారు. గత సంవత్సరంలో పోలిస్తే బిలియనీర్ల సంఖ్య పెరిగి 284కు చేరింది. గతంలో బిలియనీర్ల జాబితాలో ఉన్న 27 మంది సంపద కోల్పోయినా.. మొత్తం సంపన్నుల సంఖ్య పెరగడం విశేషం. వీరి వద్ద మొత్తం ఉన్న సంపద రూ.98లక్షల కోట్లు. 90 మంది బిలియనీర్లతో ముంబయి అగ్రస్థానంలో కొనసాతున్నది. 'బిలియనీర్స్ క్యాపిటల్ ఆఫ్ ఆసియా' టైటిల్‌ని ముంబయి కోల్పోగా.. చైనాలో షాంఘై నగరం దక్కించుకున్నది.

# అమెరికాకు.. జీ హుజూర్ డిజిటల్ ట్యాక్స్ రద్దు..ఏప్రిల్ 1 నుంచే అమలు

### గూగుల్, ఎక్స్, మెటా, అమెజాన్ తదితర అమెరికా సంస్థలకు లాభం
### ట్రంప్ టారిఫ్ ఒత్తిళ్లకు తలొగ్గుతున్న మోదీ సర్కారు
### ఖజానా ఆదాయానికి వేల కోట్ల రూపాయల్లో గండి



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుకున్నది సాధిస్తున్నారు. ఇతర దేశాల సంగతెలా ఉన్నా.. భారత్ మాత్రం ట్రంప్ ఆంక్షలకు తలొగ్గింది. ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు ఉంటాయంటూ అగ్రరాజ్యాధినేత చేసిన హెచ్చరికలకు మోదీ సర్కారు బాగానే భయపడిపోతున్నది మరి. అమెరికా వస్తూత్పత్తులపై ఇప్పటికే దిగుమతి సుంకాలను మినహాయించడం లేదా తగ్గిస్తూ వచ్చిన కేంద్రం.. ఇప్పుడు అక్కడి టెక్ కంపెనీలకూ భారీ లాభాల్ని కట్టబెడుతూ డిజిటల్ ట్యాక్స్‌ను రద్దు చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధికారికంగా ప్రకటించారు. ఏప్రిల్ 1 నుంచి 'గూగుల్ ట్యాక్స్'గా పాపులరైన ఈ డిజిటల్ ట్యాక్స్‌ను పూర్తిగా ఎత్తివేస్తున్నట్టు చెప్పేశారు.

**వేల కోట్లలో నష్టం...**

2016 జూన్ 1న ఆన్‌లైన్ అడ్వైర్టైజింగ్‌పై డిజిటల్ ట్యాక్స్ లేదా లెవలింగ్ ఫీ, ఈక్వలైజేషన్ లెవీని కేంద్రం తీసుకొచ్చింది. అంతేగాక 2020లో ఈ పన్ను పరిధిని మరింతగా విస్తరించింది. దేశీయంగా ఎలాంటి కార్యకలాపాలు లేకున్నా భారతీయ వినియోగదారుల నుంచి పెద్ద ఎత్తున ఆదాయాన్ని దక్కించుకుంటున్న గూగుల్, ఎక్స్, మెటా, అమెజాన్ తదితర విదేశీ డిజిటల్ సంస్థలే లక్ష్యంగా 6 శాతం పన్నును విధించారు. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లోనే దీనిద్వారా కేంద్రానికి దాదాపు రూ.3,343 కోట్ల ఆదాయం రావడం గమనార్హం. అయితే ట్రంప్ సర్కారు తమ దేశ టెక్నాలజీ సంస్థలపై అడ్డగోలుగా భారత్ పన్నులు వేస్తోందని మండిపడుతున్నది. ప్రతీకార సుంకాల హెచ్చరికల సందర్భంగా ఈ విషయాన్ని నొక్కిచెప్పింది కూడా. ఈ నేపథ్యంలో ఆర్థిక బిల్లు 2025కి చేసిన 59 సవరణల్లో ఈ డిజిటల్ ట్యాక్స్‌ను ఎత్తివేస్తున్నట్టు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చెప్పింది. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఈ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరగగా, వచ్చే నెల మొదలు ఈ పన్నుకు బ్రేక్ పడనున్నది. ఇదే జరిగితే గూగుల్, మెటా, ఎక్స్, అమెజాన్ వంటి అమెరికా సంస్థలకు వేల కోట్ల రూపాయలు అప్పనంగా మిగిలినట్టే. ఇదే సమయంలో ఖజానా ఆదాయానికీ గండి పడ్డట్టే. నిజానికి లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టేటప్పుడు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి మాట్లాడుతూ.. గత ఏడాదే ఈ-కామర్స్ లావాదేవీలపై 2 శాతం లెవలింగ్ ఫీజును తొలగించామని, ఇప్పుడు ఆన్‌లైన్ ప్రకటనలపై పడుతున్న 6 శాతం డిజిటల్ ట్యాక్స్‌నూ ఎత్తివేస్తున్నామని గొప్పగా చెప్పుకొచ్చారు. తద్వారా మన చట్ట సభల నుంచే అమెరికాను మెప్పించే ప్రయత్నం మోదీ సర్కారు చేసేసింది.

**ట్రంప్ భేటీలోనే..**

గత నెలలో అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు ఆ దేశాధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 2030కల్లా ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు చేర్చాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. అయితే మేము ప్రతీకార సుంకాలకు దిగితే భారత్‌పైనా ఆ ప్రభావం ఉంటుందని ట్రంప్ అన్నారు. ఈ నేపథ్యంలో మోదీ.. వచ్చీరాగానే కొన్నింటిపై సుంకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకుని కోతలు పెట్టారు.

**నిపుణుల మాటేంటి?**

భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న జనరిక్ ఔషధాలతో అమెరికన్ల వైద్య ఖర్చులు 60 నుంచి 70 శాతం తగ్గుతున్నాయని ఆర్థిక విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. అలాంటప్పుడు వీటిపై సుంకాలు వేస్తే అక్కడి ప్రజానీకానికే ఇబ్బందని అంటున్నారు. ఇక అమెరికా ప్రయోజనాల కోసం మన ఆదాయాన్ని వదులుకోవాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని అంటున్నావారూ ఉన్నారు. ఐటీ, ఆటో, స్టీల్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలకు వచ్చిన ఇబ్బందేమీ లేదని, ప్రపంచ దేశాలు అమెరికాతో ఎలా వ్యవహరిస్తున్నాయో.. అలాగే భారత్ కూడా ఉండాలని సూచిస్తున్నారు.

## మీరు జుట్టుకు ఏ హెయిర్ ఆయిల్‌ను వాడుతున్నారు..?
## జుట్టు స్థితిని బట్టి ఎలాంటి ఆయిల్‌ను వాడితే మంచిది..?



శిరోజాల సంరక్షణకు ప్రస్తుతం అందరూ ప్రాధాన్యతను ఇస్తున్నారు. స్త్రీలే కాదు పురుషులు కూడా తమ కురులను అందంగా మార్చుకుంటున్నారు. అయితే అన్నీ బాగానే పాటిస్తుంటారు కానీ హెయిర్ ఆయిల్ విషయంలోనే సరైన జాగ్రత్తలు తీసుకోరు. దీంతో జుట్టు సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. అలాగే ఈ ఆయిల్ వల్ల చర్మం కూడా జిడ్డుగా మారుతుంది. ఇక కొందరు ఎప్పుడు పడితే అప్పుడే హెయిర్ ఆయిల్‌ను అప్లై చేస్తుంటారు. కానీ హెయిర్ ఆయిల్ విషయంలోనూ జాగ్రత్తలను పాటించాలి. అప్పుడే శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. మన జుట్టుకు అన్ని ఆయిల్స్ సరిపోవు. ఎలాంటి హెయిర్ ఆయిల్ ఎవరికి మేలు చేస్తుంది.. అన్న వివరాలను తెలుసుకుని అప్పుడు ఆయిల్‌ను ఉపయోగించాలి. దీంతో మంచి ఫలితాలు రాబట్టవచ్చని బ్యూటిషియన్లు చెబుతున్నారు. ఇక ఎలాంటి ఆయిల్‌ను జుట్టుకు వాడితే ఏం జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.

### కొబ్బరినూనె..

సాధారణంగా కొబ్బరినూనెను అధిక శాతం మంది జుట్టుకు వాడుతుంటారు. ఇది జుట్టు కుదుళ్ల లోపలికి కూడా వెళ్లగలదు. దీంతో శిరోజాలకు పోషణ లభిస్తుంది. కొబ్బరినూనెలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. దీని వల్ల తలలో ఉండే ఇన్‌ఫెక్షన్లు కూడా తగ్గుతాయి. ఇన్‌ఫెక్షన్ కారణంగా చుండ్రు సమస్యతో బాధపడేవారు కొబ్బరినూనెను వాడితే మంచి ఫలితం ఉంటుంది. ఈ నూనెలో మన జుట్టుకు అవసరం అయ్యే ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. అలాగే విటమిన్లు ఇ, కెలతోపాటు ఐరన్ కూడా లభిస్తుంది. ఇవన్నీ జుట్టుకు పోషణను అందిస్తాయి. కొబ్బరినూనెను జుట్టుకు వాడుతుంటే శిరోజాలు సుతి మెత్తగా మారుతాయి. శిరోజాల ఎదుగుదలకు కొబ్బరినూనె ఎంతో సహాయం చేస్తుంది.

### జొజొబా ఆయిల్..

మార్కెట్‌లో మనకు జొజొబా ఆయిల్ కూడా లభిస్తుంది. జొజొబా అనే మొక్కకు చెందిన గింజల నుంచి ఈ నూనెను తీస్తారు. ఈ మొక్కలు అమెరికాలోని ఎడారుల్లో పెరుగుతాయి. ఈ విత్తనాలను డీర్ నట్స్‌అని కూడా పిలుస్తారు. అమెరికన్లు తమ జుట్టుకు ఎక్కువగా జొజొబా ఆయిల్‌ను ఉపయోగిస్తుంటారు. జుట్టు బాగా పొడిగా మారిన వారు, తరచూ తలంతా పొడిగా మారుతున్న వారు ఈ నూనెను వాడాలి. జిడ్డు చర్మం అయ్యే వారు ఈ నూనెను వాడకూడదు. ఇక శిరోజాల సంరక్షణకు ఆలివ్ ఆయిల్ కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇది జుట్టును మంచి కండిషనింగ్‌లో ఉంచుతుంది. గ్రీకులు ఆలివ్ ఆయిల్‌ను అధికంగా ఉపయోగిస్తారు. జుట్టు బాగా పలుచగా ఉన్నవారు, జుట్టు బాగా రాలిపోతున్న వారు ఆలివ్ ఆయిల్‌ను వాడితే మేలు జరుగుతుంది. ఇది శిరోజాల పెరుగుదలకు కావల్సిన పోషణను అందిస్తుంది.

### ఆముదం..

మన పెద్దలు ఎంతో పూర్వం కాలం నుంచి ఆముదాన్ని జుట్టుకు ఉపయోగిస్తున్నారు. దీని వాసన కారణంగా చాలా మంది దీన్ని జుట్టుకు ఉపయోగించరు. కానీ దీన్ని తలకు మర్దనా చేసి 2 గంటల పాటు ఉండి తలస్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తుంటే శిరోజాలు నల్లగా మారుతాయి. జుట్టు ఒత్తుగా పెరిగి ధృఢంగా ఉంటుంది. ఆముదంతో ఇలా మసాజ్ చేస్తుంటే తలపై ఉండే ఇన్‌ఫెక్షన్లు కూడా తగ్గుతాయి. ఆముదం జుట్టుకు పెట్టడం ఇష్టం లేని వారు ఇలా మసాజ్ చేస్తే చాలు. ఎంతో ప్రయోజనం పొందవచ్చు. అలాగే బాదం నూనె కూడా జుట్టుకు ఎంతో మేలు చేస్తుంది. ఇది జిడ్డు లేని నూనె. జిడ్డు చర్మం ఉన్నవారు ఈ నూనెను తలకు వాడాలి. ఇది జుట్టుకు అవసరం అయిన పోషకాలను అందిస్తుంది. ఈ ఆయిల్‌ల ఓలిక్ యాసిడ్, లినోలిక్ యాసిడ్ ఉంటాయి. ఇవి శిరోజాలను సంరక్షిస్తాయి. జుట్టును ఇన్‌ఫెక్షన్ నుంచి రక్షిస్తాయి. ఇలా జుట్టు రకం, చర్మాన్ని బట్టి ఎవరికి తగిన హెయిర్ ఆయిల్‌ను వారు వాడితే అన్ని రకాలుగా ప్రయోజనాలను పొందవచ్చు.

# క్షయను జయిద్దాం

క్షయ అనుక్షణం భయపెట్టించే అంటువ్యాధి. నాలుగు వేల సంవత్సరాలుగా మానవ మనుగడను శాసిస్తున్న మహమ్మారి. భూమ్మీద క్షయ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నది భారతదేశంలోనే. ప్రపంచవ్యాప్తంగా సుమారు కోటి ఎనభై లక్షల మంది టీబీతో బాధపడుతుండగా, అందులో నాలుగో వంతు మనదేశంలోనే ఉండటం ఆందోళనకరం. ప్రతి మూడు నిమిషాలకు ఒక రోగి క్షయతో మరణిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈ దుస్థితికి కారణం ఈ వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన లేకపోవడం. నిర్లక్ష్యం. క్షయ ప్రధానంగా ఊపిరితిత్తులకు సోకినప్పటికీ, ఇతర అవయవాలకు కూడా ప్రమాదం పొంచి ఉంటుంది. కాబట్టి, రోగులను దీర్ఘకాలం పాటు పీడించే ఈ ప్రాణాంతకమైన వ్యాధి పూర్వాపరాలను తెలుసుకోవడం తప్పనిసరి. మనదేశంలో రోజుకు ఎంతోమంది క్షయతో మరణిస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) లెక్కలు వెల్లడిస్తున్నాయి. అందులోనూ ముఖ్యంగా హెచ్‌ఐవీ, క్యాన్సర్ రోగులు, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడే రోగులు ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తున్నది. ఇలా ఉంటే 1882 మార్చి 24న క్షయవ్యాధికి కారణమయ్యే సూక్ష్మజీవిని జర్మనీ శాస్త్రజ్ఞుడు రాబర్ట్ కోచ్ కనుక్కొన్నాడు. వ్యాధి నివారణకు శ్రీకారం చుట్టాడు. దీనికి గుర్తుగా వందేండ్ల తర్వాత నుంచి ఏటా మార్చి 24ను ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినంగా జరుపుకొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ వ్యాధి గురించి అవగాహన చేసుకుందాం.

**ఎలా వస్తుంది?**

ఈ వ్యాధి 'మైకోబ్యాక్టీరియం ట్యూబర్క్యులోసిస్' అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. దీన్ని ట్యూబర్క్యులోసిస్ (టీబీ) అని కూడా పిలుస్తారు. ఈ వ్యాధిగ్రస్తులు మాట్లాడినప్పుడు, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, ఉమ్మివేసిన సందర్భాల్లో గాలిలోకి విడుదల అయ్యే తుంపర్ల వల్ల చుట్టుపక్కల వారికి క్షయ సోకుతుంది. ఈ వ్యాధి రెండు రకాలు. మొదటిది ఊపిరితిత్తుల క్షయ, రెండోది ఇతర అవయవాల క్షయ. ఒకరి నుంచి మరొకరికి వ్యాపించేది ఊపిరితిత్తుల క్షయ.

**వ్యాధి లక్షణాలు**

2 వారాలు లేదా అంతకంటే ఎక్కువ రోజులు దగ్గు రావడం.
సాయంత్రం, రాత్రి సమయాల్లో జ్వరం, చెమటలు పట్టడం.
అవాంఛనీయంగా బరువు తగ్గడం.
ఆకలి మందగించడం.
ఆయాసం, నీరసించిపోవడం.
దగ్గుతోపాటు తెమడలో రక్తం పడటం.
ఎలా నిర్ధారిస్తారు?

తెమడ పరీక్ష ద్వారా వ్యాధిని గుర్తిస్తారు. ప్రత్యేక సందర్భాల్లో డీఎన్ఏ పరీక్ష ద్వారా కూడా బ్యాక్టీరియాను గుర్తిస్తారు.

**నివారణ సాధ్యమేనా?**


క్షయను వందశాతం నివారించవచ్చు. అయితే, వ్యాధిని సకాలంలో గుర్తిస్తేనే ఇది సాధ్యమవుతుంది. ఈ దిశగా ముందుగా క్షయ వ్యాధిపై ప్రజల్లో పూర్తి అవగాహన ఉండాలి. వ్యాధి లక్షణాలు కనిపించగానే, లేదంటే రెండు వారాల కంటే ఎక్కువ కాలం దగ్గు ఉంటే వెంటనే వైద్యులను సంప్రందించి క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి ఉన్నట్టు తేలితే వెంటనే మందులు వాడటం మొదలుపెట్టాలి. వైద్యులు సూచించిన మందులను రోగి తు.చ. తప్పకుండా ఆరు నెలలు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుంది. కానీ, కొంతమంది దగ్గు, జ్వరం తగ్గగానే నెల రోజుల్లోనే మందులు మానేస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం. దీనివల్ల రెండో రకం క్షయ, అంటే మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ ఎండీఆర్ టీబీ వస్తుంది. దీని చికిత్స కాలం 9 నెలల నుంచి ఏడాది కాలం దాక ఉంటుంది. ఈ రకం క్షయకు చికిత్స వ్యయం కూడా ఎక్కువే. పైగా దుష్ప్రభావాలూ అధికంగా ఉంటాయి. ఈ దశలో కూడా మందులు వాడటం నిర్లక్ష్యం చేస్తే వ్యాధి మరింత ముదురుతుంది. ఎక్స్‌టెన్సివ్‌లీ డ్రగ్ రెసిస్టెంట్ ఎక్స్‌డీఆర్ టీబీగా రూపాంతరం చెందుతుంది. ఈ దశలో చికిత్స అందించినా పెద్దగా ప్రయోజనం ఉండదు! ఈ మధ్యకాలంలో ఎండీఆర్, ఎక్స్‌డీఆర్ కేసుల సంఖ్య పెరుగుతుండటం బాధాకరం. కాబట్టి, క్షయ గురించి అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రజలు కూడా క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి. దేశంలో 40 శాతం కన్నా ఎక్కువ మంది వరకు టీబీ ఇన్ఫెక్షన్‌కు లోనైన వాళ్లు ఉంటారు. అయితే, ఇన్ఫెక్షన్‌కు గురైన వాళ్లందరికీ క్షయ రాదు. వాళ్లలో రోగ నిరోధక శక్తి తగ్గడం, తగిన పోషకాహారం తీసుకోని సందర్భంలో ఇన్ఫెక్షన్ వ్యాధిగా మారే ప్రమాదం ఉంది. హ్యూమన్ ఇమ్యూనో వైరస్ (హెచ్‌ఐవీ), క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధి బాధితుల్లో టీబీ వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి. సకాలంలో వ్యాధిని నిర్ధారించి, కచ్చితమైన మోతాదులో, పూర్తికాలం మందులు వాడితే టీబీని 6 నెలల్లో వంద శాతం నివారించవచ్చు.

**డ్రగ్ రెసిస్టెంట్ కేసులకూ మందులు**



డ్రగ్ రెసిస్టెంట్ కేసులకు అంటే మందులు వాడిన తర్వాత, వివిధ కారణాల వల్ల రెండోసారి టీబీ బారినపడిన రోగులకు ప్రస్తుతం మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. గతంలో డ్రగ్ రెసిస్టెంట్ కేసుల్లో కేవలం 30 శాతం మాత్రమే ఫలితాలు ఉండేవి. ఇప్పుడు 60 నుంచి 65 శాతం వరకు ఫలితాలు కనిపిస్తున్నాయి.

# వంతారా ఎంతో వింతేరా..!


















చిన్న పిల్లలకి సహజంగానే జంతువులంటే ఆకర్షణ ఉంటుంది. వాటితో చాలా తొందరగా బంధాన్ని ఏర్పరచుకోగలుగుతారు. వాళ్ల కథల్లోనూ కార్టూన్లలోనూ కూడా ఎప్పుడూ అవే ఉంటాయి. వాటికి ఎలాంటి కష్టమొచ్చినా అయ్యో అని బాధపడిపోతుంటారు. అయితే, అలాంటి ఓ పిల్లాడి అనుబంధమే నేడు 200 ఏనుగులు సహా 2000 దాకా జంతువులను కాపాడే ఓ వన్యప్రాణి సంరక్షణా కేంద్రం ఏర్పాటుకు కారణమైంది. కొన్ని వందల మంది డాక్టర్లు, నిపుణులు వాటి బాగోగులు చూసుకునే బాటయింది. రిలయన్స్ సంస్థల అధినేత ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీనే ఆ పిల్లవాడు. ఇక, వింతైన ఆ జంతు ప్రపంచమే గుజరాత్ రాష్ట్రపు జామ్ నగరలో ఉన్న 'వంతారా జూ'! అనంత్ అంబానీకి పన్నెండేండ్ల వయసులో తల్లి నీతాతో కలిసి ఓ ఊరికి వెళుతున్నాడు. అందమైన చెట్లు, పరిగెడుతున్నాయా అనిపించే ఊళ్లూ చూస్తూ కూర్చున్నాడు అనంత్. అదే దారిలో ఓ ఏనుగు పిల్ల కనిపించిందతనికి. ఇంకేం, ఎగిరి గంతేసినంత పనిచేశాడు. కానీ పరిశీలించి చూస్తే పాపం అది ఎంతో ఇబ్బందిగా నడుస్తున్నది. మావటి వాడు దాన్ని ఎలాగోలా తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు. అది చూసిన అనంత్ మనసు చలించిపోయింది. 'పాపం కదా అమ్మా మనం పెంచుకుందామా దాన్ని' అని అడిగాడు. 'సరే నువ్వు జాగ్రత్తగా చూసుకుంటావా మరి'%ౌ%అని అడిగింది తల్లి. 'అవునమ్మా నేను దాన్ని బాగా చూసుకుంటాను' అని చెప్పాడా పిల్లవాడు. అలా ఆ ఏనుగు పిల్ల అనంత్ దగ్గరికి చేరింది. 'దాన్ని తీసుకున్నప్పటికి కనీసం అది ఏం తింటుందో కూడా తెలీదు' అని చెబుతాడు అనంత్. 'మావటి వాడు ఏం చెబితే అదే పెట్టేవాళ్లం. దానికి ఏమైనా అయితే చికిత్స చేయించడానికి కూడా పెద్దగా నిపుణులు అందుబాటులో లేరు. అయితే ఇన్నాళ్లలో మేం చాలా నేర్చుకున్నాం. ఆ ఒక్క ఏనుగే కాదు, ఎన్నో ఆపదలో ఉన్న జంతువులు మా దగ్గర వచ్చి చేరాయి. మరెన్నో గాయాల పాలై, ప్రాణాపాయంలో ఉన్న జీవులు ఇక్కడ కోలుకుని ఆనందంగా ఆడుకుంటున్నాయి. వాటికోసం ఎంతో పరిశోధనలు చేసి వందల సంఖ్యలో నిపుణుల్ని నియమించాం. విభిన్న జాతుల జంతువులు ఇక్కడి అడవిలో చక్కగా తిరుగుతూ ఉండటం చూస్తే ఎవరికైనా ఆనందం కలుగుతుంది' అని తన ఈ ముందడుగు గురించి చెబుతాడు అనంత్. ఇంతకీ వంతారా అంటే ఏమిటో చెప్పలేదు కదూ స్టార్ ఆఫ్ ద ఫారెస్ట్ అడవి చుక్క అని అర్థం! వంతారాలో మొత్తం 43 విభిన్న జాతులకు చెందిన 2000 దాకా జంతువులు ఉన్నాయి. అందులో 200 ఏనుగులు ఉన్నాయి. మంచు చిరుతలు, తెల్ల పులులతో పాటు విభిన్న రకాల చిరుతలు, పులులు, సింహాలు ఇక్కడ తిరుగుతుంటాయి. అనేక రకాల పాములు, మొసళ్లు, జిరాఫీలు, జీబ్రాలు, హిప్పోలు భారత్ సహా ప్రపంచంలోని విభిన్న ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి చేరాయి. అంతేకాదు, అంతరించిపోతున్న జాతులుగా ఉన్న దేవాంగ పిల్లి, బట్టమేక పిట్ట, రాబందు, ఒకాపి, కారకల్ లాంటి జంతు, పక్షుజాతులెన్నో ఇక్కడ తమ ఉనికిని పెంపొందించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. గుజరాత్ రాష్ట్రంలోని జామ్ నగర్‌లో మొత్తం 3000 ఎకరాల్లో ఉన్న దీనిలో ఈ జీవులన్నీ తమ కోసం కేటాయించిన విశాలమైన ప్రాంగణాల్లో సంచరిస్తుంటాయి. అడవుల నరికివేత వల్ల తమ స్థావరాలను కోల్పోవడం, వేట, స్మగ్లింగ్ లాంటి రకరకాల ప్రమాదాలకు గురయిన జంతువులే ఇవన్నీ. వేరువేరు ఆరోగ్య సమస్యలతో వచ్చే వాటిని ఇక్కడి నిపుణులైన వైద్యులు పరిశీలిస్తారు. ప్రపంచంలోనే అగ్రశ్రేణి వైద్యులు, జంతు సంరక్షణ నిపుణులతో పాటు న్యూట్రీషనిస్టులు, పాథాలజిస్టుల్లాంటి 500 మంది అంకిత భావం కలిగిన నిపుణుల బృందం వీటి జబ్బులు, గాయాలను నయం చేసేందుకు పనిచేస్తున్నది. క్రూర జంతువులా, సాధు జంతువులా, సరీసృపాలా అన్నదాన్ని బట్టి అన్ని జంతువులకూ స్వేచ్ఛగా సంచరించేందుకు సరిపడా స్థలాన్ని కేటాయిస్తారు. వీటి బాగోగులు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా చూసుకునేందుకు 2100 మంది దాకా ఉద్యోగులు ఉన్నారు. 75 యానిమల్ అంబులెన్సులు కూడా ఉన్నాయిక్కడ. వంతారాలో ప్రధాన ఆకర్షణ ఏనుగులే. ఇక్కడ ఉండే 200కు పైగా గజరాజుల సంరక్షణ కోసం 25000 చదరపు అడుగుల్లో ఆసుపత్రి కట్టారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్దది. భారీగా ఉండే ఈ జంతువులకు ఆర్థరైటిస్‌లాంటి ఎముకల సమస్యలు ఏర్పడుతుంటాయి. దానికి హైడ్రోథెరపీ అని చేస్తారు. కాళ్ల సమస్యలు, కీళ్ల నొప్పులు ఉండే ఏనుగులు ఇక్కడి హైడ్రోథెరపీ పూల్స్‌లో కొన్ని గంటల పాటు సేదతీరి, సాంత్వన పొందుతుంటాయి. ఇవికాక, ముల్తానీ మట్టి మసాజ్, జకుజీ (బాత్ టబ్ థెరపీ)లాంటివీ వీటి కోసం ఏర్పాటు చేశారు. ఇక, ఇందులో నివసించే జంతువుల ఆరోగ్య పరీక్షల కోసం, శస్త్ర చికిత్సలు, ఇతర చికిత్సల కోసమూ ఏర్పాట్లున్నాయి. ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకువెళ్లగలిగే పోర్టబుల్ ఎక్స్-రే, లేజర్ మెషీన్‌లు, సీటీ, ఎంఆర్ఐ యంత్రాలు, ఐసీయూ, డయాలిసిస్ కేంద్రం, పాథాలజీ ల్యాబ్, ఆపరేషన్ థియేటర్లు, హైపర్ బారిక్ ఆక్సిజన్ ఛాంబర్లు ఉంటాయి. అల్ట్రాసౌండ్, ఎండోస్కోపీలాంటివి పరీక్షలు చేసే పరికరాలూ ఇక్కడ ఉన్నాయి. కేవలం జంతువులను కాపాడి ఆరోగ్యాన్ని బాగు చేయడమే కాదు, వాటి గురించిన పరిశోధనలు జరిపే ప్రత్యేక విభాగమూ వంతారాలో ఏర్పాటయింది. ఆపదలో ఉన్న జంతువుల సంరక్షణ కోసం ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్, వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ఫర్ నేచర్ లతో కలిసి పనిచేస్తున్నది వంతారా. వివిధ దేశాల్లోని జంతు సంరక్షణ కేంద్రాలతో పాటు ముఖ్యంగా మెక్సికో, వెనెజుల్లాలో ఉన్న రెస్క్యూ సెంటర్ల భాగస్వామ్యమూ ఉంది. భారత్‌లోని నేషనల్ జూ అథారిటీతోనూ టై అప్ అయ్యింది వంతారా. దేశవ్యాప్తంగా జూ లను ఏర్పాటు చేసేందుకు మంతనాలు చేస్తున్నది. ఇటీవలే ప్రధాని అధికారికంగా ఓపెన్ చేసిన ఇది, త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. 'ఆవులో మూడు కోట్ల దేవతలూ ఉంటారంటారు. నేను ప్రతి ప్రాణిలోనూ దేవుడిని చూస్తాను. వాటికి సేవ చేయడం నిజంగా అదృష్టంగా భావిస్తాను. ఎందుకంటే మనుషులకు సేవ చేసే వాళ్లు చాలామందే ఉంటారు. కానీ నోరులేని ఈ ప్రాణులకు సేవ చేసే వాళ్లు చాలా తక్కువ. అందుకే అలాంటి జంతువుల కోసం ఈ నా ముందడుగు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను.' అంటూ ప్రేమ పూర్వక గొంతుకతో చెబుతాడు అనంత్. ఆపద నుంచి గట్టెక్కిన ఎన్నో మూగజీవాలకు ఈ నీడ నిజంగా దేవుడి తోడే కదూ!

# కలుపు మొక్కనెలా కలుపుకొని సాగడం?




'మన శత్రువులు వేర్వేరు రూపాలను తీసుకొని ఉండవచ్చు, కానీ మనం మారలేదు. మన పోరాటాలు మారలేదు. అదే డీఎంకే' అని కలైవానర్ అరంగంలో 2024, అక్టోబర్ 5న ఆ పార్టీ ఎంపీ తిరుచ్చి శివ రాసిన ఐదు పుస్తకాలను ఆవిష్కరించిన సందర్భంగా తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ సందేశమిచ్చారు. ప్రఖ్యాత వర్ధమాన సినీ నటుడు, ప్రగతిశీల వాది అయిన ప్రకాష్‌రాజ్ కూడా పాల్గొన్న ఆ సమావేశంలోనే చరిత్రను మార్చడానికి, పుకార్లను వ్యాప్తి చేయడానికి, అసత్యాల ఆయువు పెంచడానికి రాజకీయ శత్రువులు నిరంతరం చేసే ప్రయత్నాలను ఓడించడానికి సత్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లో ఉంచడమే పరిష్కారమని కూడా అన్నారు. నిజమే, సాంఘిక దురాచారాలు, ఆత్మగౌరవం, తమిళ అస్తిత్వం అంశాలపై ఎటువైపు నుంచి దాడి ఎదురైనా, ఏ శక్తులతో తలపడాల్సిన సందర్భం ఎదురైనా డీఎంకే నిర్మాతలైన అన్నాదురై నుంచి కరుణానిధి వరకు పెరియార్ మార్గాన్ని మదిలో ఉంచుకునే జనాన్ని నడిపించారు. జస్టిస్ పార్టీ, ద్రవిడార్ కళగం అనుభవాల నుంచి తమిళనాడు రాష్ట్ర రాజకీయ అస్తిత్వం కోసం ద్రవిడ మున్నేట్ర కళగం చాలా స్పష్టమైన కార్యాచరణనే సుదీర్ఘకాలం ఆచరణాత్మకంగా నమ్ముకున్నది. దానివల్లనే ఒక ప్రాంతీయ పార్టీ ఏడున్నర దశాబ్దాల పాటు క్రియాశీలకంగా మనుగడ సాగించడమే కాదు రాష్ట్ర, దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకమైన అధ్యాయాన్ని సంపాదించగలిగింది. అయితే తాజాగా స్టాలిన్ నేతృత్వంలో ఆ పార్టీ ప్రారంభించిన డీలిమిటేషన్ వ్యతిరేక పోరాటంలో దక్షిణాది రాష్ట్రాల హక్కుల నినాదంతో పాటు ఎన్నికల రాజకీయాల్లో తమిళ ఏజెండాను భావోద్వేగ అంశంగా నిలబెట్టి, రాజకీయ విరోధులను నిలువరించాలనే డీఎంకే సహజమైన ఎత్తుగడ కూడా ఇమిడి ఉన్నదనేది ఎవరూ కాదనలేని వాస్తవం. అయితే ఆ పార్టీ ఎత్తుకున్న డీలిమిటేషన్ వ్యతిరేక పోరాటాన్ని, త్రిభాషా విధానానికి నిరసనగా వినిపిస్తున్న వాదనను యూజీసీ ప్రతిపాదనల వెనుక రాష్ట్రాల హక్కుల హననం వైఖరిని తేటతెల్లం చేయడాన్ని సమాఖ్య విధానాన్ని, రాజ్యాంగస్ఫూర్తిని విశ్వసించే వారెవరైనా సమర్థించి తీరవలిసిందే. అయితే, తమిళనాడు ప్రయోజనాలకు, ఆత్మ గౌరవానికి స్వాతంత్ర్యానికి పూర్వం, అనంతరం బలమైన విరోధిగా నిలబడిన కాంగ్రెస్ పార్టీని కూడా తాజాగా ప్రతిపాదిస్తున్న పోరాట జట్టులో కలుపుకొని సాగాలనే అంశంపైనే భిన్నాభిప్రాయాలు వ్యక్తం కాకుండా ఉండలేవు. ఆనాటి మద్రాస్ ప్రెసిడెన్సీలోని అన్యాయమైన విధానాల నుంచి ఇండిపెండెంట్ ఇండియాలో సుదీర్ఘకాలం తమిళనాడు రాష్ట్ర ప్రజలు ఎదుర్కొన్న దుఃఖపూరితమైన అనుభవాలకంటే ఎన్నో రెట్ల ఎక్కువ వేదనను తెలంగాణ రాష్ట్రం అనుభవించిందన్నది చరిత్ర చెప్తున్న సత్యం. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో తమిళనాడులో అమలవుతున్న రిజర్వేషన్లు చెల్లనేరవని న్యాయస్థానాలు తప్పుపట్టడంపైనే పెరియార్ నిప్పుల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పార్టీ వైఖరి ఇప్పటికైనా మారిందా అంటే వెయ్యి జీవులను మింగిన రాబందు, మళ్లీ అవకాశం కోసం ఆవు మొహం పెట్టుకొని తిరుగుతున్న విధంగానే ఉన్నది. అందుకే మొన్నటికి మొన్న ఇండియా కూటమిలోనే ఉన్న ఢిల్లీ రాష్ట్ర హక్కుల కోసం పోరాడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించేందుకు పావులు కదిపి, బీజేపీ గెలుపునకు సహకరించింది. ఈ కుట్రను స్వయంగా రేవంత్ రెడ్డే బయటపెట్టాడు. ఢిల్లీ ఎన్నికల ఫలితాల అనంతరం కేజ్రీవాల్ పార్టీ ఓటమికి వ్యూహాలు పన్నిందే కాంగ్రెస్ పార్టీ అని బీరాలు పలికాడు. సిరా రాతలు ఆరకమునుపే దేశ రాజ్యాంగా న్ని బ్రాహ్మణ డాక్యుమెంట్‌గా వర్ణించి, ప్రత్యేక ద్రవిడనాడు దేశమే కావాలంటూ వేర్పాటు ఉద్యమాన్ని రగిలించాడు. దాంతో మొదటి ప్రధాని నెహ్రూ రాజీకి వొచ్చేలా, తొలి రాజ్యాంగ సవరణ జరిగేలా చేసి, స్వతంత్ర దేశంతో అడుగులు కలపడంలోనే హక్కుల పట్ల రాజీలేనితనాన్ని తమిళజాతి చూపించగలిగింది. అదే స్ఫూర్తితో 1949లో మొదలైన డీఎంకే, కాంగ్రెస్ పార్టీ అన్యాయమైన రాజకీయాలను ప్రజల్లో ఎండగడుతూ, ఎట్టకేలకు 1967 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి అధికారం హస్తగతం చేసుకున్న తొలి ప్రాంతీయ పార్టీగా చరిత్రలో నిలిచింది. ఇలా చాలా స్పష్టాతి స్పష్టంగా తొలి నాటనే తమ రాష్ట్ర ఆత్మగౌరవానికి రాజకీయ శత్రువు కాంగ్రెస్ పార్టీనే అనే కీలక అంశాన్ని సైద్ధాంతికంగా ద్రవిడియన్ భావజాలంలో మిళితం చేసి ప్రజలందరి హృదయాల్లో నాటగలిగింది. అయితే, 2014 నాటికే పూర్తిగా తమిళనాట కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా నిర్వీర్యం చేసి, డీఎంకే ఆశ్రిత సంస్థగా లొంగదీసుకోగలిగింది. అయితే డీఎంకే మూల సిద్ధాంతకర్తలైన పెరియార్, అన్నాదురై విశ్వసించిన ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం, రాష్ట్రాల ఆత్మ గౌరవం తదితర మౌలికమైన రాజ్యాంగ అంశాల పట్ల అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఒక తీరున, విపక్షంలో ఉన్న రాష్ట్రాల్లో మరో తీరున అపరిచితుడు సినిమాలో వలె భిన్న మోహాలతో ప్రవర్తిస్తున్న కాంగ్రెస్ పార్టీని కూడా రాష్ట్రాల హక్కుల సాధన పోరులో కలుపుకొని సాగాలనుకోవడంపై ఏకాభిప్రాయానికి రావడం కష్టం. కాంగ్రెస్ అనే కలుపు మొక్కను కూటమిలో పెట్టుకొని రాష్ట్రాల హక్కుల ఉద్యమాన్ని ప్రాంతీయ రాజకీయశక్తులు కొనసాగించడం ఏమిటనే ఆందోళన వ్యక్తమౌతున్నది. రాజ్యాంగానికి తూట్లు పొడవడంలో, సమాఖ్య స్ఫూర్తికి కళంకం తేవడంలో, కాంగ్రెసేతర గవర్నమెంట్‌లను కూలదోయడంలో, అంతెందుకు బడుగు వర్గాలకు అవకాశాలను దూరం చేయడంలో హస్తం పార్టీ అతి పెద్ద పాపాలపుట్టనే కదా? నంబుద్రీపాద్ నుంచి ఎన్టీఆర్ దాకా దక్షిణ భారతదేశంలో కాంగ్రెసేతర ప్రభుత్వాలను కూల్చివేసిందే కాంగ్రెస్ పార్టీ. డీలిమిటేషన్‌తో పాటు హిందీ భాష, యూజీసీ నిబంధనల వివాదంలో తొలి అడుగు వేసిందే కాంగ్రెస్ పార్టీ కేంద్ర సర్కార్లు. 1937లోనే నాటి మద్రాస్ ప్రెసిడెన్సీలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తే, మూడేండ్ల పాటు ఉధృతంగా వ్యతిరేక పోరాటం నడిచింది. దానివల్లనే హిందీ, ఇంగ్లీష్‌లను అధికార భాషలుగా గుర్తించారు. మళ్లీ 15 ఏండ్ల తర్వాత హిందీని ఇదే కాంగ్రెస్ పార్టీ సర్కార్ జాతీయ అధికార భాషగా ప్రకటించే ప్రయత్నం చేసింది. అయితే తమిళనాడు వ్యతిరేకతకు జడిసి 1963 అధికార భాషా చట్టంలో హిందీతో పాటు ఇంగ్లీష్ ను చేర్చారు. అలాగే, 2009, 2011లో రాష్ట్రాల విద్యాహక్కులు హరించే ప్రయత్నం కాంగ్రెస్ చేసిం ది. పశ్చిమబెంగాల్, తమిళనాడు నిరసించడంవల్లనే వెనక్కి తగ్గారు. ఇలాంటి ధోరణిలో బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందే. అంతెందుకు రిజర్వేషన్ల కోసమే ప్రత్యేక ద్రవిడనాడు పోరాటం చేసిన తమిళనాడు రాష్ట్ర మేధావులు, నేతలకు.. ప్రత్యేక దేశం గా, అనంతరం ప్రత్యేక రాష్ట్రంగా వర్ధిల్లిన తెలంగాణపై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎలా దాడి చేసి, ఐదున్నర దశాబ్దాలు ఎలా అడుగడుగునా వంచించిందో చరిత్ర సాక్షిగా తెలియకుండా ఉండదు. తమిళనాడు కంటే తెలంగాణ, డీఎంకే కంటే బీఆర్ఎస్ ఎన్నో రెట్లు ఎక్కువ నిర్బంధాన్ని, నష్టాన్ని, కష్టాలను కాంగ్రెస్, బీజేపీల వల్ల అనుభవించాయి. ఎంతో వైవిధ్యమైన ఉన్నతమైన చరిత్రనూ, త్యాగాలనూ తెలంగాణ ప్రజలు పండించారు. కానీ, తెలంగాణలో హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ నుంచి మంత్రివర్గ విస్తరణ వరకు, ప్రతి పైసా ఖర్చుపెట్టడం కోసం 37 సార్లు ఢిల్లీ వెళ్లి, గాంధీల అనుమతి తీసుకునే పరిస్థి తి ఏర్పడింది. ఇది త్యాగాల తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలు బలితీసుకోవడం కాదా? ఇలా ఇంకా మారని, మళ్లీ కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రాంతీయ రాజకీయ శక్తులను వేటాడుతామని కేజ్రీవాల్ ఉదాహరణతో తేటతెల్లం చేస్తున్న కాంగ్రెస్‌ను కలుపుకొని సాగడం వల్ల ప్రాం తీయ పార్టీలకు, రాష్ట్రాలకు ముప్పే. బీఆర్ఎస్, డీఎంకే తదితర పార్టీల పుట్టుక, సుదీర్ఘ పోరాటం, త్యాగాల వెనుక ప్రాంతీయ ఆకాంక్షలున్నాయి. కాబట్టి డీఎంకే తాజా పోరాట ఎజెండాలో ఎంత న్యాయమున్నదో, జట్టులో కపట కాంగ్రెస్‌ను కలుపుకొనిపోవడంలో అంతే నష్టమున్నది. పైగా అధికారంలో ఉన్నంత మాత్రాన తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి లాంటి ఢిల్లీ దళారీ పాలకుల నేతృత్వంలో రాష్ట్రాల హక్కుల సాధన పోరు రెండో సమావేశం జరపాలని నిర్ణయించడం ప్రజాస్వామ్యవాదులకు ఎబ్బెట్టుగా అనిపిస్తున్నది. డీఎంకే, బీఆర్ఎస్ తలపెట్టిన పోరాటాన్ని, కాంగ్రెస్ కలుపుమొక్కను తీసేసి కొనసాగించగలిగితే, ఈ జట్టులో అధికారంలో లేకపోయినా సరే మిగతా ప్రాంతీయ పార్టీలు, సంఘాలు, మేధావులను భాగస్వామ్యులుగా మార్చగలిగితే మంచిది.

## పసిడి ధర మళ్లీ పెరిగింది..!
# హైదరాబాద్‌లో తులం ఎంతంటే..?



బంగారం ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. రికార్డు స్థాయికి ధరలు చేరగా.. ఇటీవల వరుసగా నాలుగు రోజులు తగ్గుతూ వచ్చి ఊరటనిచ్చాయి. తాజాగా బుధవారం మార్కెట్‌లో ధర మళ్లీ పెరిగింది. రూ.235 పెరిగి తులం ధర రూ.రూ.90,685కి చేరుకున్నాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం ప్యూరిటీ బంగారం 10 గ్రాములకు రూ.235 పెరిగి రూ.90,235కి చేరింది. ఇటీవలి నష్టాల తర్వాత రిటైలర్లు తాజాగా కొనుగోలు చేయడంతో పసిడి ధరలు పెరిగినట్లుగా వ్యాపారులు పేర్కొంటున్నారు. గ్లోబల్ మార్కెట్‌లో బలమైన ట్రెండ్ కారణంగా సెంటిమెంట్‌ను ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. ఇక వెండి ధర రూ.1,500 పెరిగి కిలోకు రూ.1,01,500కి చేరింది. మరో వైపు ప్రపంచ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ 0.16 శాతం పెరిగి ఔన్సుకు 3,024.96 డాలర్లకు చేరింది. పెట్టుబడిదారుల డిమాండ్, సురక్షితమైన పెట్టుబడి గోల్డ్‌కి డిమాండ్, ఈటీఎఫ్‌ల నుంచి బలమైన ఇన్‌ఫ్లో కారణంగా బుధవారం బంగారం స్వల్పంగా పెరిగింది. ఇక ఏప్రిల్ 2న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలపై కొత్త వాణిజ్య విధానాన్ని ప్రకటించనున్నారు. యూఎస్ సుంకాల నిర్ణయంపై అనిశ్చితి కారణంగా బంగారానికి మద్దతు లభిస్తుందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ (కమోడిటీస్) విశ్లేషకులు సౌమిల్ గాంధీ తెలిపారు. సెక్యూరిటీస్, కమోడిటీ అండ్ కరెన్సీ, రీసెర్చ్ అనలిస్ట్-వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది మాట్లాడుతూ ఈ వారం చివరలో విడుదలకానున్న యూఎస్ జీడీపీ, కోర్ పర్సనల్ కన్జ్యూమ్ ఎక్స్‌పెన్షన్ ప్రైస్ ఇండెక్స్‌తో సహా కీలకమైన స్థూల ఆర్థిక డేటా కోసం మార్కెట్‌కు చెందిన వారంతా ఎదురు చూస్తున్నారన్నారు. రష్యా-ఉక్రెయిన్ పరిణామాలు సైతం విస్తృత ధోరణిని ప్రభావితం చేస్తాయని.. డిమాండ్‌ను పెంచుతుందని త్రివేది పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల గోల్డ్ రూ.81,950 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి ధర రూ.89,400గా ఉన్నది. ఇక కిలో వెండి ధర రూ.1,11,000గా చేరింది.

## భారత్‌ను వీడేందుకే సంపన్నుల ఆసక్తి..!
# సర్వేలో షాకింగ్ విషయాలు..!



దేశానికి సంపన్నులు పలువురు భారత్‌ను వీడి ఇతర దేశాల్లో నివసించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కనీసం 22శాతం మంది సూపర్ రిచ్ ఇండియన్స్ మెరుగైన జీవన ప్రమాణాలు, సులభమైన వ్యాపార వాతావరణం తదితర కారణాలతో దేశాన్ని వీళ్లాలని కోరుకుంటున్నట్లుగా ఓ సర్వే షాకింగ్ విషయాలు వెల్లడించింది. ఈ సర్వే 150 మంది అల్ట్రా రిచ్ వ్యక్తులు (%ఖఎచీ×%)పై నిర్వహించారు. సర్వే ప్రకారం.. ఆయా సంపన్నులంతా గోల్డెన్ వీసా స్కీమ్‌ని దృష్టిలో పెట్టుకొని.. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (%ఖాజు%) లాంటి దేశాల్లో స్థిరపడాలని కోరుకుంటున్నారు. దేశానికి చెందిన ప్రముఖ అసెట్ మేనేజర్ కంపెనీ కొటక్.. ప్రైవేట్ కన్సల్టింగ్ కంపెనీ ఈవైతో కలిసి సర్వే నిర్వహించింది. వాస్తవానికి విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం.. ప్రతి సంవత్సరం 25లక్షల మంది భారతీయులు ఇతర దేశాలకు వలస వెళ్తున్నారు. సర్వేలో పాల్గొన్న ప్రతి ఐదుగురు అల్ట్రా రిచ్ వ్యక్తుల్లో ఒకరు ప్రస్తుతం వలస వెళ్లే పనిలో కొందరు ఉండగా.. మరికొందరు వలస వెళ్లేందుకు యోచిస్తున్నారని సర్వే ఫలితాలు తెలిపాయి. ఇందులో చాలామంది తమ భారతీయ పౌరసత్వాన్ని నిలుపుకుంటూనే.. తమకు నచ్చిన దేశంలో శాశ్వతంగా నివసించాలని కోరుకుంటున్నట్లుగా సర్వే పేర్కొంది. మెరుగైన జీవన ప్రమాణాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, జీవనశైలిని కోరుకుంటున్నట్లుగా సర్వే పేర్కొంది. మూడింట రెండువంతుల కంటే ఎక్కువ మంది వ్యాపార కార్యకలాపాలు సులభతరం చేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వారంతా వలస వెళ్లే నిర్ణయాన్ని 'భవిష్యత్ పెట్టుబడి'గా అభివర్ణించడంతో పాటు తమ పిల్లలకు మంచి ఉన్నత విద్యను అందించాలనే కోరిక కూడా వలసకు ప్రేరేపిస్తుందని సర్వే నివేదిక తెలిపింది. ఈ సందర్భంగా కొటక్ మహీంద్రా బ్యాంక్ చైర్మన్ గౌతమి గవాంకర్ మాట్లాడుతూ వలస వెళ్లే నిర్ణయాన్ని దేశం నుంచి బయటకు వెళ్లే మూలధనంగా చూడొద్దన్నారు. అలాంటి కార్యకలాపాలపై పరిమితులు విధించడం వల్ల ఓ వ్యక్తి తన నివాస స్థలాన్ని మార్చినప్పటికీ.. డబ్బు బయటకు వెళ్లదన్నారు. ప్రస్తుతం భారతీయ పౌరుడుద ఏశం నుంచి సంవత్సరానికి 2.50లక్షల డాలర్లు మాత్రమే తీసుకువెళ్లగలడని.. ప్రవాస భారతీయుడు మాత్రం మిలియన్ డాలర్లు తీసుకువెళ్లేందుకు అనుమతి ఉందన్నారు. ఇది పెద్ద ఎత్తున మూలధనం తరలింపు లేదని నిర్ధారిస్తుందన్నారు. వ్యవస్థాపకులు, వారి వారసుల కంటే నిపుణులు దేశం విడిచి వెళ్లేందుకు ఎక్కువ మొగ్గు చూపుతున్నారని సర్వే చెబుతున్నది. 36-40 సంవత్సరాలు.. 61 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు గల వ్యక్తులు వలస వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారని పేర్కొంది. ఇక 2023 లెక్కల ప్రకారం.. అల్ట్రా రిచ్‌గా జాబితాలో 2.83లక్షల మంది భారతీయులు ఉన్నారు. ఇందులో ప్రతి ఒక్కరి నికర విలువ రూ.25కోట్ల కంటే ఎక్కువ. వారి మొత్తం సంపద రూ.2.83లక్షల కోట్లుగా అంచనా. సర్వే ప్రకారం.. 2028 నాటికి ఈ సంఖ్య 4.3లక్షలకు పెరుగుతుంది. వారి సంపద రూ.359లక్షల కోట్లకు చేరనున్నది.

## శామ్ సంగ్‌కు షాక్ ఇచ్చిన కేంద్రం..
# ఏకంగా రూ.5,154 కోట్ల జరిమానా..!




దక్షిణ కొరియాకు ఎలక్ట్రానిక్స్ దిగ్గజ సంస్థ శామ్ సంగ్‌కు కేంద్ర ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. కంపెనీతో పాటు అధికారులకు 601 మిలియన్ డాలర్ల పన్నులతో పాటు జరిమానా విధించింది. ఇది భారతీయ కరెన్సీలో సుమారు రూ.5,154 కోట్లు. టెలికాం పరికరాలకు సంబంధించిన దిగుమతి సుంకాన్ని తప్పించుకునేందుకు అవకతవకలకు పాల్పడిందన్న కారణంతో కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతేడాది భారత్‌లో కంపెనీ సుమారు రూ.8,183 కోట్ల నికర లాభాన్ని ఆర్జించగా.. భారీ పన్ను, జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకున్నది. అయితే, శామ్ సంగ్ టాక్స్ ట్రిబ్యునల్ లేదంటే కోర్టులో సవాల్ చేసే అవకాశం ఉన్నది. శామ్ సంగ్ కంపెనీ నెట్‌వర్క్ విభాగం 'రిమోట్ రేడియో హెడ్' అనే డివైజ్‌తో పాటు పలు టెలికాం పరికరాలను దిగుమతి చేస్తున్నది. ఈ డివైజ్ 4జీ కమ్యూనికేషన్ వ్యవస్థలో మొబైల్ టవర్‌కు కీలకం. ఈ పరికరాలకు 10 నుంచి 20శాతం వరకు సుంకాలు విధించే అవకాశం ఉంటుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ, దిగుమతి సుంకాలను తప్పించుకునేందుకు శామ్ సంగ్ ఆయా పరికరాలను తప్పుగా వర్గీకరించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. 2018 నుంచి 2021 మధ్య దక్షిణ కొరియా, వియత్నాం నుంచి 784 మిలియన్ డాలర్ల (రూ.6,717కోట్లు) విలువైన పరికరాలు దిగుమతి చేసుకున్నా.. ఎలాటి పన్ను చెల్లించలేదని సంబంధిత వర్గాలు చెప్పాయి. కస్టమ్ సుంకాలను తప్పించుకునేందుకు శామ్ సంగ్ ఉద్దేశపూర్వకంగా తప్పుడు పత్రాలను సమర్పించిందని ప్రభుత్వ విచారణలో తేలింది. సదరు కంపెనీ వ్యాపార నీతి, పరిశ్రమ ప్రమాణాలను ఉల్లంఘించిందని కస్టమ్స్ కమిషనర్ సోనాల్ బజాజ్ పేర్కొన్నారు. లాభాలను పెంచుకునే ఉద్దేశంతో మాత్రమే శామ్ సంగ్ అవకతవకలకు పాల్పడిందని కస్టమ్స్ అధికారులు పేర్కొంటున్నారు. 2021లో కస్టమ్స్ అధికారులు ముంబయి, గురుగ్రామ్‌లోని శామ్ సంగ్ కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో పలు పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత కంపెనీకి చెందిన సీనియర్ అధికారులను కస్టమ్స్ విచారించింది. ఆర్ఆర్‌హెచ్ ట్రాన్సీవర్ కేటగిరిలో ఉందని.. అది కూడా సుంకాలకు లోబడి ఉందని ప్రభుత్వం పేర్కొంది. అయితే, కంపెనీ మాత్రం వ్యతిరేకించింది. ఆర్ఆర్‌హెచ్ ట్రానీవర్‌గా పని చేయదని, దాంతో టారిఫ్ మినహాయింపులకు అర్హత, దిగుమతి సుంకాలు విధించరాదని కంపెనీ వాదిస్తున్నది. ఈ క్రమంలోనే కంపెనీకి కేంద్రం ఏడుగురు శామ్ సంగ్ ఎగ్జిక్యూటివ్‌లకు రూ.694 కోట్ల వ్యక్తిగత జరిమానా, మరో రూ.4460కోట్లు కంపెనీకి పన్ను విధించింది.

# వరుస లాభాలకు బ్రేక్.. భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో ముగిశాయి. ఇటీవల వరుసగా ఏడు సెషన్లలో లాభాల్లో కొనసాగిన మార్కెట్లు గురువారం భారీగా పతనమయ్యాయి. యూఎస్ టారిఫ్ విధానాల్లో స్పష్టత లేకపోవడం.. చమురు ధరల పెరుగుదల.. ఇటీవల మార్కెట్‌లో ర్యాలీ కొనసాగుతుండడంతో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు ఒక్కసారిగా కుదేలయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ ఉదయం ఫ్లాట్‌గా మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికి సెన్సెక్స్ 78,167.87 గరిష్ఠానికి చేరుకుంది. ప్రారంభంలోనే 150.68 పాయింట్లు లాభపడింది. ఆ తర్వాత సెన్సెక్స్ అమ్మకాలతో ఒత్తిడికి గురైంది. దాంతో ఒక దశలో 822.97 పాయింట్లు పతనమైంది. ఇంట్రాడేలో 78,167.87 పాయింట్ల గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. 77,194.22 పాయింట్ల కనిష్ఠాన్ని తాకింది. చివరకు 728.69 పాయింట్లు తగ్గి.. 77,288.50 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 181.80 పాయింట్లు పతనమై.. 23,486.85కి చేరింది. నిఫ్టీలో ఇండస్ఇండ్ బ్యాంక్, ట్రెంట్, హెచ్‌సీఎల్ టెక్, హీరో మోటోకార్ప్, భారతీ ఎయిర్‌టెల్, గ్రాసిమ్, ఎంఅండ్ఎం, టైటాన్ కంపెనీ, బ్రిటానియా లాభపడ్డాయి. ఎన్టీపీసీ, టెక్ మహీంద్రా, సిప్లా, బజాజ్ ఫైనాన్స్, బీపీసీఎల్, యాక్సిస్ బ్యాంక్, అపోలో హాస్పిటల్, ఇన్ఫోసిస్, విప్రో నష్టపోయాయి. యూఎస్ వాణిజ్య విధానంపై అనిశ్చిత మధ్య పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల కొన్ని దేశాలకు టారిఫ్ నుంచి మినహాయింపులు ఉంటాయని ప్రకటించారు. అయితే, ఈ విషయంలో స్పష్టత కొరవడింది. ఈ అస్పష్టత కారణంగా భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లను అస్థిరపరించింది. గతవారంలో దలాల్ స్ట్రీట్‌లో ర్యాలీ కొనసాగింది. ఈ క్రమంలో గురువారం పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్ ఒత్తిడికి గురైంది. ఫలితంగా సూచీలు పతనమయ్యాయి. మరో వైపు డాలర్ మారకంతో పోలిస్తే రూపాయి 6 పైసలు తగ్గి 85.78కి చేరింది. దీనికి తోడు వెనిజులా నుంచి చమురు, గ్యాస్ దిగుమతి చేసుకునే దేశాలపై సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో చమురు ధరలు బుధవారం భారీగా పెరిగాయి. భారత్ ముడి చమురును దిగుమతి చేసుకుంటున్న విషయం తెలిసిందే. ముడి చమురు ధరలు పెరిగే అవకాశం ఉండడంతో భారత స్టాక్స్‌పై ప్రత్యక్షంగా ప్రభావం పడే అవకాశం ఉన్నది.

## బీజేపీ అనాలోచిత నిర్ణయాలు 1948 నాటి
# కంటే దిగజారిన భారతీయ ఎగుమతులు










అచ్చేదిన్ తీసుకొస్తామంటూ పదకొండేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. తన అనాలోచిత నిర్ణయాలతో అన్ని రంగాలనూ అస్తవ్యస్తం చేసింది. రూపాయి పతనం కనిష్ఠ స్థాయికి చేరుకోగా, ఇప్పుడు ఎగుమతుల్లోనూ దేశం అట్టడుగునకు దిగజారింది. స్వాతంత్ర్య కాలం నాటికి అంతర్జాతీయ ఎగుమతుల్లో దేశ వాటా 2.2 శాతంగా ఉండగా, ప్రస్తుతం అంతకన్నా తక్కువ 1.6 శాతం నమోదైంది. ఏడున్నర దశాబ్దాల కిందటితో పోల్చిచూస్తే దేశీయ ఎగుమతులు దారుణంగా పతనమవడం గమనార్హం. మరి, 'మేకిన్ ఇండియా ' ఆడంబరం ఏమైనట్టు? 'విశ్వగురు భారత్' ఎందుకిట్ల మారినట్టు? (స్పెషల్ టాస్క్ బ్యూరో) హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ ) : ఎగుమతులు ఎక్కువగా ఉన్న దేశం ఆర్థికంగా పుష్టిగా ఉంటుందంటారు ఆర్థిక నిపుణులు. ఎగుమతుల విలువ పెరిగితే.. అంతర్జాతీయంగా ఆ దేశానికి పరపతి పెరుగుతుంది. దౌత్య సంబంధాలు బలపడటంతో పాటు విదేశీ కరెన్సీ నిల్వలు పెరుగుతాయి. దేశీయంగా కంపెనీల సంఖ్య పెరిగి ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయి. అయితే, ప్రధాని నరేంద్రమోదీ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి అంతర్జాతీయంగా వివిధ అంశాల్లో దేశ పరపతి పడిపోతూనే ఉన్నది. కేంద్రంలోని బీజేపీ సర్కారు అనాలోచిత నిర్ణయాలతో తాజాగా దేశీయ ఎగుమతుల విలువ చరిత్రలో చూడనటు వంటి స్థాయికి దిగజారింది.

ఎగుమతుల్లో క్షీణత 10.9 శాతం

కీలక రంగాల్లో ఎగుమతులు అంతకంతకూ పడిపోతున్నాయి. పెట్రోలియం, నేత వస్త్రాలు-దుస్తులు, సముద్ర ఉత్పత్తులు, ప్లాస్టిక్స్, రత్నాలు-ఆభరణాలు వంటి కార్మిక శక్తి అధికంగా ఉన్న రంగాలు తీవ్ర నైరాశ్యంలోకి కూరుకుపోయాయి. గత ఫిబ్రవరిలో ఆయా దేశాలకు భారత్ నుంచి జరిగిన ఎగుమతుల విలువ 36.9 బిలియన్ డాలర్లకు పడిపోయింది. నిరుడు ఇదే నెలతో పోలిస్తే ఎగుమతుల్లో క్షీణత 10.9 శాతంగా రికార్డయ్యింది. ఏడాది వ్యవధిలో దేశీయ వస్తు ఎగుమతుల విలువ 4.5 బిలియన్ డాలర్ల మేర క్షీణించినట్టు తెలుస్తోంది. 1948లో అంతర్జాతీయంగా భారత వస్తు ఎగుమతుల వాటా 2.2%గా నమోదవ్వగా.. 2025లో అంతర్జాతీయంగా భారత వస్తు ఎగుమతుల వాటా 1.6%గానే రికార్డయ్యింది. అంటే స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో దేశీయ ఎగుమతులతో పోలిస్తే.. బీజేపీ ప్రభుత్వ హయాంలో వస్తు ఎగుమతుల వాటా మరింతగా పతనమైంది.

### మేకిన్ ఇండియా.. జోకిన్ ఇండియా

దేశీయ కంపెనీలను, ఉత్పత్తులను ప్రోత్సహించడానికి తద్వారా ఎగుమతులను పెంచడానికంటూ 2014 సెప్టెంబర్ 25న 'మేకిన్ ఇండియా' పేరిట బీజేపీ సర్కారు ఓ ఆర్భాటపు కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. తయారీ రంగంలో ఏటా 12-14 శాతం వృద్ధిరేటును నమోదు చేస్తామని, 2022 నాటికి జీడీపీలో తయారీ రంగం వాటాను 25 శాతానికి పెంచి 10 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఊదరగొట్టింది. అయితే, పదేండ్ల అనంతరం 'మేకిన్ ఇండియా' 'జోకిన్ ఇండియా'గా మారినట్టు గణాంకాలను బట్టి అర్థమవుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 35,567 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) మూతబడినట్టు ఇటీవల ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్రం పార్లమెంట్ వేదికగా సమాధానమిచ్చింది. 2019 జూలై నాటికి దేశవ్యాప్తంగా 6.8 లక్షల కంపెనీలు మూతబడ్డట్టు పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆ ఏడాది పేర్కొనడం తెలిసిందే. దీన్ని బట్టి రోజుకు సగటున దేశవ్యాప్తంగా 300 కంపెనీలు మూతబడుతున్నట్టు కార్మిక హక్కుల కార్యకర్తలు చెప్తున్నారు. మొత్తంగా మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన మేకిన్ ఇండియా అట్టర్‌ఫ్లాప్‌గా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### ఎగుమతుల వాటా ఇలా..

1947-48లో అంతర్జాతీయంగా భారత వస్తు ఎగుమతుల వాటా 2.2 శాతం

2024-25లో అంతర్జాతీయంగా భారత వస్తు ఎగుమతుల వాటా 1.6 శాతం

దేశీయ వస్తు ఎగుమతుల విలువ

2024 ఫిబ్రవరిలో 41.4 బిలియన్ డాలర్లు

2025 ఫిబ్రవరిలో 36.9 బిలియన్ డాలర్లు

ఏడాది వ్యవధిలో పతనం 4.5 బిలియన్ డాలర్లు

ఎగుమతులు పెరిగితే లాభమేంటి?

దేశ పరపతి పెరుగుతుంది.

అంతర్జాతీయంగా ప్రాతినిధ్యం దక్కుతుంది.

విదేశీ కరెన్సీ నిల్వలు పెరుగుతాయి.

దేశీయంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

దౌత్య సంబంధాలు బలపడతాయి.

చిన్న దేశాలే బెటర్

నేత వస్త్రాలకు సంబంధించి బంగ్లాదేశ్, వియత్నాం వంటి చిన్న దేశాలు ఎగుమతుల్లో ఏటా 6 శాతానికి పైగా వృద్ధి నమోదు చేస్తుంటే, మన దగ్గర వృద్ధిరేటు ఒక్క శాతం కూడా ఉండట్లేదు. వస్త్ర పరిశ్రమకు కేంద్రం ఆశించిన స్థాయిలో ప్రోత్సాహకాలు ఇవ్వట్లేదని వ్యాపారులు చెప్తున్నారు.

### ఒక్క శాతమూ దాటట్లేదు

పాదరక్షల రంగంలో ప్రపంచ వాణిజ్య విస్తరణ 5 శాతం దాకా ఉన్నది. అయితే, భారత్‌లో ఇది ఒక్క శాతం కూడా మించట్లేదు.

ఆర్థిక వ్యవస్థకు నష్టమే

కార్మిక శక్తి ఎక్కువగా ఉన్న రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించకపోతే, నిరుద్యోగం మరింతగా పెచ్చరిల్లవచ్చు. అదే జరిగితే, ఆర్థిక వ్యవస్థే అల్లకల్లోలమయ్యే ప్రమాదం ఉంది.

## కరెంటును స్టోర్ చేసుకుని క్యాష్ చేసుకోవచ్చు
# మార్కెట్లోకి కొత్త ప్రొడక్ట్.. ధర ఎంతంటే?

ఎలక్ట్రిక్ టూవీలర్స్ తయారీ సంస్థ ప్యూర్ సరికొత్త రంగంలోకి అడుగుపెట్టింది. ఇళ్లలో, వాణిజ్య ప్రదేశాలలో, గ్రిడ్ స్థాయిలో ఉపయోగించే ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్స్ 'ప్యూర్-పవర్' పేరుతో మార్కెట్‌లోకి తెచ్చింది. ఈ ఉత్పత్తులు విద్యుత్తును నిల్వ చేసి అవసరానికి తగినట్లు వాడుకోడానికి వీలు కల్పిస్తాయి. సాధారణ యూపీఎస్‌లలో ఉండే లెడ్ ఆక్సైడ్ బ్యాటరీలకు బదులుగా అత్యాధునిక లిథియం-అయాన్ బ్యాటరీలను ఉపయోగిస్తాయి. సౌర విద్యుత్తు వంటి సంప్రదాయేతర ఇంధన వనరుల నుంచి వచ్చే విద్యుత్తును అదనపు పరికరాలు లేకుండా నిల్వ చేయగలవు. ఉదాహరణకు, ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి 'ప్యూర్-పవర్: హోం'ను వాడితే, ఇంటికి కావలసిన విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవడమే కాకుండా మిగిలిన విద్యుత్తును ప్రభుత్వానికి అమ్మవచ్చు. నీతీ ఆయోగ్ సభ్యుడు, డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వి.కె.సారస్వత్ మంగళవారం హైదరాబాద్‌లోని నోవోటెల్‌లో ఈ ఉత్పత్తులను లాంఛనంగా ప్రారంభించారు. ప్యూర్ సంస్థ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నిశాంత్ దొంగరి మాట్లాడుతూ, "దేశమంతటా రానున్న 18 నెలల్లో 300 మంది డీలర్ల ద్వారా 'ప్యూర్-పవర్' ఉత్పత్తులను మార్కెట్ చేయనున్నాము" అని తెలిపారు. ఈ ఉత్పత్తులు యూపీఎస్‌లతో పోలిస్తే ఎన్నో విధాలుగా ప్రత్యేకమైనవని, నానో పీసీఎం మెటీరియల్ ద్వారా భద్రతను పెంచామని చెప్పారు. ప్రస్తుతం రెండు రకాలను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నామని, గ్రిడ్ స్థాయిలో విద్యుత్తును నిల్వ చేసే 'ప్యూర్-పవర్: గ్రిడ్'ను వచ్చే ఏడాది లాంచ్ చేస్తామన్నారు. ఇళ్లలో, అపార్ట్‌మెంట్లలో వాడేందుకు 'ప్యూర్-పవర్: హోం' 3 కిలోవోల్ట్ ఆంపియర్ (కేవీఏ), 5 కేవీఏ, 15 కేవీఏ సామర్థ్యాల్లో లభిస్తుందని, ధర రూ.74,999 నుంచి ప్రారంభమవుతుందని వివరించారు. దుకాణాలు, కార్యాలయాలు, టెలికాం టవర్స్ కోసం 25 కేవీఏ నుంచి 100 కేవీఏ సామర్థ్యం గల 'ప్యూర్-పవర్ కమర్షియల్'ను అందుబాటులోకి తెస్తున్నామని నిశాంత్ చెప్పారు. ఈ ఉత్పత్తులు డీజిల్ జనరేటర్ల అవసరాన్ని తగ్గిస్తాయని తెలిపారు. గ్రిడ్ స్థాయిలో విద్యుత్తును నిల్వ చేసే మూడో ఉత్పత్తి 'ప్యూర్-పవర్: గ్రిడ్' 20 అడుగుల పొడవైన కంటెయినర్‌లో ఇమడగలదని, దీనిలో నాలుగు




మెగావాట్ల విద్యుత్తును నిల్వ చేయవచ్చని వివరించారు. సోలార్ పార్కుల్లో దీనిని ఏర్పాటు చేస్తే, విద్యుత్తు డిమాండ్ తక్కువగా ఉన్న సమయంలో ఉత్పత్తి చేసిన విద్యుత్తును ఎక్కువ డిమాండ్ ఉన్న సమయంలో సరఫరా చేయడానికి వీలవుతుందన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఉత్పత్తులను బుక్ చేసుకోవచ్చని, నెలాఖరు నుంచి డెలివరీ మొదలవుతుందని తెలిపారు.

### దేశ అభివృద్ధికి కీలకం

2070 నాటికి కర్బన్ ఉద్గారాలను సున్నాస్థాయికి తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నాల్లో విద్యుత్తు వాహనాలతోపాటు 'ప్యూర్-పవర్' లాంటి ఉత్పత్తులు ఎంతగానో ఉపయోగపడతాయని నీతీ ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ స్పష్టం చేశారు. 2030 నాటికి వాహనాల్లో 40 శాతం విద్యుత్తుతో నడిచేలా చేయాలని ప్రభుత్వం తీర్మానించిందని, కోటి ఇళ్ల పైకప్పులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని సంకల్పించిందని వివరించారు. అయితే, ప్రస్తుతం దేశంలో విద్యుత్తు వాహనాల సంఖ్య ఇరవై లక్షలకు మించడం లేదని తెలిపారు. విద్యుత్తు వాహనాల ఛార్జింగ్ కోసం గ్రిడ్‌ను వాడితే గ్రిడ్‌పై అధిక భారం పడుతుందని, ఈ సమస్యను పరిష్కరించడానికి 'ప్యూర్-పవర్' లాంటి ఉత్పత్తులకు ప్రాధాన్యత ఏర్పడుతోందని అన్నారు. బ్యాటరీల ధరలను తగ్గించేందుకు, మరింత సమర్థవంతమైన వాటిని తయారు చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలు ఫలిస్తే మరింత ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్యూర్ సంస్థ సహ వ్యవస్థాపకుడు రోహిత్ వదేరా తదితరులు పాల్గొన్నారు.

printed , published and owned by DR.B.ANILKUMAR ,@ 407 THARNAKA , HYDERABAD , Telangana state.published at DAIWIK PUBLICATIONS pvt.ltd.printed at SNEHITHA PRINTERS H.NO : 2-6 , Warangal Dist.Telangana state ,EDITOR DR.B.ANILKUMAR ,RNI NO TELTEL/2021/ 81079 , cell : 7702866885 ,vijethatelugudaily@gmail.com